thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 289 | కరీంనగర్ శుక్రవారం, 26 డిసెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఆమ్కా జెట్‌ల రేసులో..హైదరాబాదీ సంస్థతో అదానీ జట్టు

హైదరాబాద్ : దేశీయంగా అభివృద్ధి చేయనున్న ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానం 'ఆమ్కా (అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్)' ప్రొటోటైప్ తయారీ రేసులో హైదరాబాదీ సంస్థ కూడా భాగస్వామ్యం అవుతోంది. ఆమ్కా ప్రొటోటైప్ కాంట్రాక్టును దక్కించుకునేందుకు అదానీ గ్రూపులోని అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ సంస్థ తాజాగా హైదరాబాద్‌కు చెందిన 'ఎంటార్ టెక్నాలజీస్' సంస్థతో జట్టుకట్టినట్టు తెలిసింది. విశ్వసనీయవర్గాలను ఉటంకిస్తూ బిజినెస్ స్టాండర్డ్ దీనిపై కథనాన్ని ప్రచురించింది. ప్రెసిషన్ ఇంజనీరింగ్ (కీలకమైన పరికరాలు, విడిభాగాలను ఎలాంటి లోపాలు లేకుండా అత్యంత కచ్చితత్వంతో తయారు చేయడం)లో ఎంటార్ టెక్నాలజీస్ సంస్థకు మంచి గుర్తింపు ఉంది. న్యూక్రియర్ పవర్ కార్పొరేషన్, ఇస్రో, డీఆర్‌డీవో తదితర సంస్థలకు ఎన్నో సంస్థలు ఎంటార్ టెక్నాలజీస్ కస్టమర్లుగా ఉన్నాయి. చంద్రయాన్-2, మంగళ్‌యాన్ మిషన్లకు అవసరమైన ఎలక్ట్రో న్యూమాటిక్ వ్యవస్థలను ఈ సంస్థే సరఫరా చేసింది.







# ఊకే గణేష్ కాల్చివేతతో...
# ఒడిశా మావోకథ సమాప్తం..!

**-మొన్న 22 మంది మావోయిస్టుల సరెండర్**
**-రెండు రోజుల తర్వాత సీసీ మెంబర్ సహా నలుగురు ఎన్కౌంటర్**
**-నల్గొండ జిల్లా టాప్ లిస్టు నుంచి పాక హన్మంత్ అవుట్**

చురకలు ,ప్రత్యేక ప్రతినిధి :-కగార్ ఆపరేషన్ తర్వాత మళ్లీ మావోయిస్టులకు షాక్ తగిలింది.తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఒడిశా ఎన్కౌంటర్లో మావో అగ్రనేత పాక హన్మంత్ అలియాస్ ఊకే గణేశ్ అలియాస్ రాజేష్ అలియాస్ గణేశన్న కథ గురువారంతో ముగిసింది.గత ఏడాది నుండి ముఖ్యంగాపాక హన్మంతు అదిగో వస్తున్నాడు ఇదిగో లొంగిపోతున్నాడు..నెలరోజులుగా జరుగుతున్న ప్రచారం..లొంగిపొమ్మని కుటుంబ సభ్యుల నుంచి పిలుపు..ఇవి పాక హన్మంతు ఏయుకే గణేష్ ఒడిశ్శా ఇంచార్జ మావోయిస్టు పార్టీ సీసీ సభ్యుల పై జరుగుతున్న ప్రచారం ఇవ్వాల్టితో ఆగిపోంది.అంటే పాక హన్మంతు తుపాకీ దించలేదు పార్టీ సిద్ధాంతం వదలలేదు ఏకంగా ఒడిశా లో ఎన్కౌంటర్లో ప్రాణాలు కోల్పోయిన నేతగా మిగిలి పోయారు.ఓ వైపున ఆయుధ విరమణ ప్రకటించిన మావోయిస్టులు కొందరు అరణ్యాలు వీడి జనారణ్యాంలోకి వస్తున్నారు. గణేశ్ దగ్గర ఉన్న ఓ 22 మంది మావోయిస్టులు మంగళ వారం ఉదయం పోలీసులకు లొంగిపోయారు.వాళ్ళు లొంగిన మావోయిస్టులు నుండి గణేష్ ను జాడ పట్టి పోలీసులు ఖాతం చేశారు అని సమాచారం.నక్సల్ ప్రభావిత రాష్ట్రాల్లో మాత్రం బలగాల ఏరివేత కొనసాగుతూనే ఉంది. మరోవైపు ఇప్పటికే ఎన్కౌంటర్లో,లొంగుబాట్లు మధ్య గురువారం భారీ ఎన్కౌంటర్ జరిగింది.ఒడిషాలోని కందమాల్ జిల్లాలో కూంబింగ్ చేపట్టిన బలగాలకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు సహా నలుగురు మావోయిస్టులు చనిపోయినట్టుగా సమాచారం.బుధవారం రాత్రి కందమాల్ జిల్లా బెల్ఘర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుమ్మా అటవీ ప్రాంతంలో ఎదురు కాల్పులు జరిగాయని గురువారం ఉదయం వెలుగు చూసింది. మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న సమాచారం అందుకున్న సీఆర్పీఎఫ్ (CRPF), ఒడిషా స్పెషల్ ఆపరేషన్ గ్రూప్స్ (SOG), ఒడిషా రాష్ట్ర పోలీసులు బెల్ఘర్ అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టాయి. బుధవారం రాత్రి మావోయిస్టులు తారసపడడంతో ఎదురు కాల్పులు జరిగినట్టుగా ఒడిషా రాష్ట్ర పోలీసు వర్గాలు ప్రకటించాయి. ఈ ఎన్ కౌంటర్ లో కేంద్ర కమిటీ సభ్యుడు ఊకే గణేష్ అలియాస్ పాక హన్మంతు, చత్తీస్ గడ్ రాష్ట్రంలోని రాయిగడ ప్లాటూన్ ఏరియా కమిటీ సభ్యుడు, ప్లాటూన్ మెంబర్ రాకేష్ అలియాస్ బారీ, సప్లై టీమ్ మెంబర్ అమృత్ లను గుర్తించారు మిగతా వారిని గుర్తించాల్సి ఉందని పూర్తి వివరాలు తెలియజేస్తామని పోలీసు వర్గాలు చెప్తున్నాయి. రూ. కోటి. 10 లక్షల రివార్డు ఉన్న ఊకె గణేష్ తెలంగాణలోని నల్గొండ జిల్లా చందూర్ మండలం పుల్లెంల వాసి కాగా మిగతా వారంతా చత్తీస్ గడ్ రాష్ట్రానికి చెందిన వారుగా తెలుస్తోంది. ఘటనా స్థలం నుండి ఒక AK47, 2 INSAS, 303 రైఫిల్, స్వాధీనం చేసుకున్నారు.గణేష్ భావ ప్రసాద్ గత నెలక్రితం కందమహల్ లో పలు చోట్ల తిరిగి గణేష్ కు విన్నవించిన వార్త ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. అయితే గణేష్ ఎత్తిన తుపాకీ మాత్రం దించలేదు.నమ్ముకున్న సిద్ధాంతం కోసం పోరాటం చేసి అదే బాటలో నడిచాడు..చివరికి కన్నుమూశారు

## మందు బాబులకు అలర్ట్.. డిసెంబర్ 31 వరకు..

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు ప్రారంభించారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలు డిసెంబర్ 31వ తేదీ వరకు కొనసాగనున్నాయి. నగరంలో 120 ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు ఉంటాయని హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. తొలి రోజు అయిన బుధవారమే డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలో 304 మందిని పట్టుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన 304 మంది వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో నగర వాసులకు పలు సూచనలు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడమే కాకుండా, పది వేల రూపాయల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం పబ్‌లకు వెళ్లే వారు తమ డ్రైవర్లను వెంట తీసుకెళ్లాలని కమిషనర్ తెలిపారు.

## ఢిల్లీ కేథడ్రల్ చర్చ్ క్రిస్మస్ ఉదయ సర్వీస్‌లో పాల్గొన్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: నేడు క్రిస్మస్ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలోని కేథడ్రల్ చర్చ్ ఆఫ్ ది రిడంప్షన్‌లో ఉదయపు ప్రార్థనా సర్వీస్‌లో పాల్గొన్నారు. ఢిల్లీ, ఉత్తర భారత క్రైస్తవ సమాజం పెద్ద సంఖ్యలో హాజరైన ఈ కార్యక్రమంలో ప్రార్థనలు, సాంప్రదాయ క్యారల్స్, హిమ్స్‌లతో సందడి వాతావరణం నెలకొంది. ఢిల్లీ బిషప్ ఆర్‌టి. రెవ. డాక్టర్ పాల్ స్వరూప్ ప్రధానికి ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ Xలో పోస్ట్ చేస్తూ, 'ఢిల్లీలోని కేథడ్రల్ చర్చ్ ఆఫ్ ది రిడంప్షన్‌లో క్రిస్మస్ ఉదయ సర్వీస్‌లో పాల్గొన్నాను. ఈ సర్వీస్ ప్రేమ, శాంతి, కరుణ యొక్క శాశ్వత సందేశాన్ని ప్రతిబింబిస్తుంది. క్రిస్మస్ స్ఫూర్తి మన సమాజంలో సామరస్యం, మంచితనాన్ని ప్రేరేపించాలి' అని తెలిపారు. దేశ ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మోదీ, ఈ పండుగ స్ఫూర్తి సమాజంలో ఐక్యతను బలోపేతం చేయాలని కోరారు. యేసు క్రీస్తు బోధనలైన ప్రేమ, శాంతి, కరుణలను జ్ఞాపకం చేస్తూ, సమాజంలో సామరస్యం, పరస్పర గౌరవాన్ని ప్రోత్సహించేలా ఈ కార్యక్రమం నిర్వహించారు.

భారత వైవిధ్యభరిత మత సంప్రదాయాలకు గౌరవం చూపుతూ ఈ వేడుకలు జరిగాయి. గత కొన్ని సంవత్సరాలుగా ప్రధాని మోదీ క్రైస్తవ సమాజ కార్యక్రమాల్లో క్రియాశీలంగా పాల్గొంటున్నారు. 2023లో ఈస్టర్ సందర్భంగా సేక్రెడ్ హార్ట్ కేథడ్రల్‌లో నిర్వహించిన ప్రార్థనకు మోదీ హాజరయ్యారు.



## క్రిస్మస్ వేడుకల్లో మోదీ..

# కేసీఆర్ వర్సెస్ రేవంత్
# ఫేస్ టూ ఫేస్!
## అసెంబ్లీ వేదికగా యుద్ధమే!?




హైదరాబాద్ : రెండేళ్ళ పాటు సైలెంట్ గా ఉన్నాను. ఇక ఆగేది లేదు, తగ్గేది అంతకంటే లేదు అని రీసెంట్ గా నిర్వహించిన ప్రెస్ మీట్ లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గర్జించారు. ఇక జనం లోకి వెళ్తాం, తేల్చుకుంటామని కూడా ఆయన స్పష్టం చేశారు. తెలంగాణాలో మూడు భారీ సభలను కూడా కొత్త ఏడాది మొదట్లోనే నిర్వహించాలని కూడా ఆయన నిర్ణయించారు. కృష్ణా నదీ జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని జనం మధ్య నుంచే బిగ్ సౌండ్ చేయాలని కేసీఆర్ డిసైడ్ అయ్యారు.

అంతే కాకుండా నీరు అన్నది సెంటిమెంట్ కాబట్టి నీటి నుంచే నిప్పులు పుట్టించాలని కూడా భారీ వ్యూహ రచన చేస్తున్నారు.

**అక్కడ కాదు అంటూ రేవంత్ :** అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ మీడియా సమావేశం మీద గత రెండు రోజులుగా తనదైన శైలిలో కౌంటర్లు ఇస్తున్నారు. క ృష్ణా నది జలాల విషయంలో తెలంగాణకు ఎవరు న్యాయం చేస్తున్నారు ఎవరు అన్యాయం చేశారు అన్నది అసెంబ్లీ వేదికగానే తేల్చుకుందామని రేవంత్ రెడ్డి కేసీఆర్ కి భారీ సవాల్ విసురుతున్నారు. అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు కావాల్సివస్తే అన్ని రోజులు పొడిగిస్తామని ఆయన హామీ ఇస్తున్నారు. అక్కడ ఎవరి వాదన ఏమిటో వినిపించుకోవచ్చు అని సూచిస్తున్నారు.

**కేసీఆర్ రెడీనా :** మరి ఈ సవాల్ మీద కేసీఆర్ వైపు నుంచి బీఆర్ఎస్ వైపు నుంచి ఇప్పటికైతే ఏ విధమైనా సమాచారం అయితే రాలేదు, అసెంబ్లీ వింటర్ సెషన్ కి కేసీఆర్ హాజరవుతారా అనంది అయితే సస్పెన్స్ గానే ఉంది. అయితే తెలంగాణా ప్రజల ఆలోచనలతో పాటు బీఆర్ఎస్ వర్గాలు సైతం కేసీఆర్ అసెంబ్లీకి వెళ్ళి నిలదీస్తేనే బాగుంటుంది అన్నది ఉంది. దాంతో పాటుగా కేసీఆర్ ఇక రెండేళ్ల సమయం అయిపోయింది చూస్తూ ఊరుకోను అని అంటూ వస్తున్నారు. దాంతో ఆయన ఆలోచనలకు సలహా సూచనలను జనంలోనే కాదు చట్ట సభలల ద్వారా కూడా వెల్లడించాలని అంతా కోరుకుంటున్నారు. మరి దీని మీద అయితే బీఆర్ఎస్ లో తర్జన భర్జన జరుగుతోంది అని అంటున్నారు.

**29 నుంచి సమావేశాలు :** ఇక చూస్తే తెలంగాణా అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ఈ నెల 29 నుంచి నిర్వహించనున్నారు. అయిదారు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలకు కేసీఆర్ హాజరు మీదనే చర్చ సాగుతోంది. అయితే నదీ జలాలలో తెలంగాణాకు జరుగుతున్న అన్యాయం అలాగే పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పధకం విషయంలో డీపీఆర్ ని కేంద్రం వెనక్కి పంపించినా రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించకపోవడం మీదనే బీఆర్ఎస్ తన అజెండాగా చేసుకుని సభలో చర్చిస్తుందని అంటున్నారు. ఇక కేసీఆర్ సభకు హాజరైతే మాత్రం ఏకంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ తోనే సభలో బీఆర్ఎస్ వాదన వినిపిస్తారు అని అంటున్నారు. అయితే పవర్ పాయింట్ ప్రజంటేషన్ కి కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరిస్తుందా అన్నదే చర్చగా ఉంది మరో వైపు చూస్తే ఈసారి అసెంబ్లీకి కేసీఆర్ హాజరు అయ్యే విషయంలో మాత్రం ఒక స్పష్టత రావాల్సి ఉన్నా ఆయన హాజరు అయితేనే బాగుంటుందని అంతా అంటున్నారు. కేసీఆర్ కూడా హాజరయ్యేందుకు రెడీ అవుతున్నారని ప్రచారం సాగుతోంది. అదే జరిగితే ఈసారి వింటర్ సెషన్ హీట్ పుట్టించడం ఖాయమని అంటున్నారు.



## సంస్థాగత పదవుల జాతర.. కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త జోష్

పంచాయతీ ఎన్నికల విజయంతో మంచి జోరు మీదున్న అధికార కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సంస్థాగత మార్పులపై దృష్టి సారించింది. ఇప్పటికే గ్రామ, మండలస్థాయి కమిటీలను పూర్తి చేసిన టీపీసీసీ, ఇప్పుడు జిల్లా కార్యవర్గాల భర్తీకి కసరత్తు ప్రారంభించింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ప్రతి జిల్లాకు ప్రత్యేక పరిశీలకులను నియమించారు. ఈ నెల 27నుంచి జిల్లాల వారీగా పరిశీలకుల పర్యటనలు ఖరారయ్యాయి. వీరు నియోజకవర్గాల వారీగా పర్యటించి జిల్లా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి వంటి కీలక పదవుల కోసం ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే వారికే ఈ పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని అధిష్టానం స్పష్టం చేసింది.




బ్రహ్మపుర నగరం: ఒడిశాలోని కందమాల్ జిల్లా గుమ్మా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావోయిస్టు కీలక నేత, కేంద్ర కమిటీ సభ్యుడు పాకా హనుమంతు అలియాస్ గణేశ్ ఉయికే ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆయనపై రూ.1.10 కోట్ల రివార్డు కూడా ఉందని తెలిపారు. హనుమంతు స్వస్థలం తెలంగాణలోని నల్గొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామం అని అధికారులు తెలిపారు. మరోవైపు ఘటనాస్థలిలో ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మావోయిస్టుల కోసం గాలింపు కొనసాగుతోంది.

**గణేశ్ నేపథ్యం ఇదీ..** పాక చంద్రయ్య, పాపమ్మ దంపతుల ఆరుగురు సంతానంలో గణేష్ మొదటివారు. ఆయన 1961లో జన్మించారు. హనుమంతుకు ముగ్గురు చెల్లెళ్లు, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. చండూరులో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ నల్గొండలో చేస్తూ రాడికల్ యూనియన్‌లో పనిచేశారు. 45 ఏళ్ల క్రితం ఏచూరి శ్రీనివాస్ హత్యలో ఆయన కీలకపాత్ర పోషించారు. అనంతరం అజ్ఞాతంలోకి వెళ్లి నక్సలైట్ ఉద్యమంలో చేరారు. అప్పటినుంచి ఆయన ఇంటివైపు చూడలేదు. ఆయన అమ్మ, నాన్న చనిపోయినప్పుడు కూడా రాలేదు. మండల కమిటీ నుంచి జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి నేతగా ఎదిగి మూడు రాష్ట్రాలకు కేంద్ర కమిటీ సభ్యుడిగా పనిచేశారు. ఇటీవలి కాలంగా ఆరోగ్యం బాగాలేక ఇబ్బంది పడుతున్నారని సమాచారం. పాక హనుమంతు చిన్నప్పటినుంచే కమ్యూనిస్టు భావజాలం కలిగి ఉన్నారని ఆయన సోదరుడు తెలిపారు. హనుమంతు తండ్రి సీపీఎం పార్టీలో పనిచేశారు. దీంతో చదువుకునే రోజుల్లోనే ఉద్యమం వైపు వెళ్లారు.

## బీజేపీ మరో కీలక నిర్ణయం.. నీటి ప్రాజెక్టులపై అధ్యయనానికి సిద్ధం

హైదరాబాద్, డిసెంబరు25 : తెలంగాణ బీజేపీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో నీటి ప్రాజెక్టులపై అధ్యయనం చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక కమిటీ వేసి ప్రాజెక్టులను సందర్శించనున్నారు టీబీజేపీ నేతలు. తెలంగాణ అసెంబ్లీలో నీటి కేటాయింపులపై చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు కేంద్ర ప్రభుత్వంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై కమలం పార్టీ నేతలు షాకింగ్ కామెంట్స్ చేశారు.

**కేంద్ర ప్రభుత్వంపై నెపం..** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరోసారి సెంటిమెంట్ రాజకీయాలు చేస్తున్నారని కాషాయ పార్టీ నేతలు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓటీపీ రాజాకీయాలు తెలంగాణలో చెల్లదంటూ స్పష్టం చేశారు. చేసిన తప్పు కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్ కేంద్ర ప్రభుత్వంపై నెపం పెడుతున్నారని ధ్వజమెత్తారు. గతంలో కృష్ణా జలాల్లో 299 టీఎంసీల నీటి కోసం ఒప్పుదం చేసింది ఎవరనీ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు కమలం పార్టీ నేతలు. తెలంగాణకు నీటి వాటాలో అన్యాయం చేసింది కేసీఆరేనని ఆరోపిస్తున్నారు.

**కేసీఆర్‌వి ఓటీపీ రాజకీయాలు..** ఇన్నాళ్లు ఫాంహౌస్‌లో ఉన్న కేసీఆర్ ఇప్పుడు బయటకు వచ్చి ఓటీపీ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఇప్పుడు తెలంగాణకు సరైన నీటి వాటా తీసుకురావడంలో విఫలం అవుతోందని మండిపడ్డారు.




దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి కూడా గతంలో కృష్ణా నీటిని తరలించుకు పోతుంటే కాంగ్రెస్ నేతలు ఎందుకు నోరు మెదపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అసెంబ్లీ సమావేశాల్లో కూడా ఇదే అంశంపై తమ వాదనను బలంగా వినిపిస్తామని బీజేపీ నేతలు స్పష్టం చేశారు. ఇప్పటికే నీటి వాటాలో తెలంగాణకు జరిగిన అన్యాయంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చామని బీజేపీ నేతలు ప్రస్తావించారు. రాబోయే రోజుల్లో తెలంగాణకు బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన అన్యాయంపై సమగ్ర సమాచారం అందిస్తామని బీజేపీ నేతలు హెచ్చరించారు.




సిర్పూర్: మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన నలుగురు మహిళలు మృతిచెందారు. దేవాడ–సోండో సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్ నగర్ పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీకి చెందిన జాకీర్ కుటుంబం వైద్యం కోసం నాగ్‌పుర్‌లోని ఆస్పత్రికి వెళ్లారు. వారితో పాటు బంధువులు కూడా ఉన్నారు. బుధవారం అర్ధరాత్రి దాటాక తిరుగు ప్రయాణంలో వీరు వస్తున్న కారు అదుపుతప్పి వంతెన పైనుంచి పడింది. దీంతో జాకీర్ భార్య సల్మా బేగం, కుమార్తె శబ్రీమ్‌తో పాటు బంధువులు అఫ్జా బేగం, సహారా మృతిచెందారు.

మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను చంద్రపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## వాజ్‌పేయి ప్రసంగాలు, వ్యక్తిత్వం యువతకు మార్గదర్శకాలు: కిషన్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 25: అటల్ జీ 101వ జన్మదినం సందర్భంగా దేశమంతా ఉత్సవాలు కార్యక్రమాలు జరుపుకుంటున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ ప్రధాని , భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు కేంద్రమంత్రి. అనంతరం మాట్లాడుతూ.. అటల్ బిహారీ వాజ్‌పేయి మంచి వక్త, మంచి పరిపాలనా దక్షుడు, విలువలు కలిగిన మహా నేత అని కొనియాడారు. ఒక్క ఓటు తేడా ఉంటే నైతిక విలువలకు కట్టుబడి రాజీనామా చేసి ప్రధాని పదవిని తృణ ప్రాయంగా వదులుకున్న మహోన్నతమైన నేత అటల్ జీ అని అన్నారు.

భారతదేశ రక్షణ కోసం ఎంతో కృషి చేసి సుపరిపాలన అందించిన నేత అని తెలిపారు. సర్వ శిక్ష అభియాన్ పేరుతో విద్యాలయాల్లో మౌళిక వసతు లు ఏర్పాటు చేశారని చెప్పారు.. పేద ప్రజల పక్షాన నిలిచి వారి అభ్యుదయం కోసం అనేక సంస్కరణలు తీసుకోచ్చిన నేత అటల్ అని అన్నారు. ఆయన ప్రసంగాలు, వ్యక్తిత్వం దేశ యువతకు మార్గదర్శిగా నిలిచాయన్నారు. పాకిస్థాన్ వెన్నుపోటు పొడిస్తే తిరిగి పాక్‌కు మూడు చెరువుల నీళ్ళు తాగించి పాక్‌ను మట్టికరిపించిన ఘనత అటల్‌కు దక్కుతుందని చెప్పుకొచ్చారు. ఒక



దేశం నుండి మరొక దేశానికి.. ఢిల్లీ నుంచి లాహోర్‌కు బస్‌లో వెళ్లిన మొదటి ప్రధాని మోదీ అని తెలిపారు. స్వర్ణ చతుర్భుజి పేరుతో దేశ వ్యాప్తంగా రోడ్ల విస్తరణ చేసిన ఘనత ఆయనది అని అన్నారు. దేశ ప్రగతిలో తనదైన ముద్ర వేసుకున్న మహానుభావుడన్నారు. దేశ యువతకు అటల్ జీ జీవితం ఒక స్ఫూర్తి అనితెలిపారు. నేడు వాజ్‌పేయికు యావత్ దేశం ఘనంగా నివాళి అర్పిస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



## ప్రపంచవ్యాప్తంగా మనుషులు ప్రేమ ఆప్యాయతతో జీవించాలి : డిప్యూటీ సీఎం

మధిర : ప్రపంచవ్యాప్తంగా మనుషులు ప్రేమ ఆప్యాయతతో జీవించాలని, పాడిపంటలతో దేశం సుభిక్షంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం ఆర్థిక ప్రణాళిక విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం మధిర మండల పరిధిలోని బయ్యారం గ్రామంలో చారిత్రాత్మకమైన చర్చిలో గురువారం తెల్లవారుజామున ప్రత్యేక ప్రార్థనలు జరిపి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ చారిత్రాత్మకమైన బయ్యారం చర్చి నిర్మించుకొని 125 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చర్చ్ కు చేరుకున్న సోదర సోదరీమణులందరికీ, స్నేహితులకు, రాష్ట్ర ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా బయ్యారం చర్చ్ కు రావడం ఫాదర్ తో ప్రార్థనలు చేయించుకొని కేవలం మధిర నియోజకవర్గంలోని కుటుంబాలకే కాకుండా రాష్ట్రం మరియు దేశంలోని అన్ని కుటుంబాలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రధానంగా మానవ మనుగడకు ప్రపంచవ్యాప్తంగా సహజీవనంతో జీవించేలా తద్వారా మానవ మనుగడకు మనం అంతా ప్రేమతో ఆప్యాయతతో బతికేలా ఉండాలని ప్రతి సంవత్సరం ఈ చర్చి నుంచి ప్రభువును ప్రార్థిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ప్రభువు ఆశీర్వాదాలు ఉండాలని మంచి జరగాలని, కుటుంబాలు బాగా ఎదిగి పిల్లలు మంచిగా చదువుకొని ఎదగాలని ఫాదర్ తో ప్రార్థన చేయించుకుని ఇక్కడి నుంచి బయలుదేరుతాం. కేవలం ప్రార్థనలు చేయించుకుని బయలుదేయటమే కాదు ప్రభువు ఏ సందేశాన్ని అయితే మానవాళికి అందించారో ఇతరుల కోసం, వారి ఇబ్బందుల నుంచి బయటపడేయడం కోసం ఎలా జీవించాలో ప్రభువు జీవితం మనకు నేర్పిస్తుంది అన్నారు. ఒకరికి మరొకరు సహాయ సహకారాలతో జీవించేందుకు ప్రభువు ఆశీస్సులు మనందరిపై ఉండాలని ప్రభువును ప్రార్థిస్తున్నాను అన్నారు. ప్రజలందరి యోగక్షేమాల కోసం ఈ అధికారం ఉపయోగపడే విధంగా మన ఆలోచనలు మనం మార్గం ఉండేటట్టుగా ప్రభువు మనల్ని నడిపించాలని ఆ ప్రభువును కోరుకుంటున్నానని తెలిపారు. ప్రభువు చూపించిన మార్గంలో పయనిస్తూ తోటి వారి కోసం పనిచేద్దామని మరోసారి ఎంతో చారిత్రాత్మకమైన ఈ బయ్యారం చర్చి నుంచి 125 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఎంతో వైభవంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారని తెలుసుకొని ఆ వేడుకలు వైభవంగా జరగాలని ప్రపంచవ్యాప్తంగా శాంతి సందేశం వెళ్లేలా ఉత్సవాలు భారీగా ఉండాలని తాను కోరుకుంటున్నాను అన్నారు . బయ్యారంలో అభివృద్ధి కోసం కాకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం భగవంతుడు నిండుగా మనకు శక్తిని ఇవ్వాలని ఆయన శక్తితో వచ్చే అధికారం హోదాతో కూడా ప్రజా సంక్షేమ కోసం ఉపయోగపడేట్టుగా మన ఆలోచనలు మన మార్గాన్ని నడిపించే విధంగా వారు ఆశీర్వదిస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటూ అందరికీ రాబోయే రోజుల్లో మంచి జరగాలని ఈ క్రిస్మస్ సందర్భంగా శుభాకాంక్షలు తో పాటు నూతన సంవత్సర శుభాకాంక్షలు అందరికి తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిఎంహెచ్వో ఏ కొండలరావు కాంగ్రెస్ పార్టీ మధిర పట్టణ మండల అధ్యక్షులు మిర్యాల వెంకటరమణ గుప్తా సూరంశెట్టి కిషోర్ నాయకులు కర్నాటి రామారావు చావా వేణు యర్రగుంట రమేష్ మైలవరపు చక్రి బొల్లెద్దు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.




## తమిళనాడులో పెను విషాదం.. బస్సు టైరు పేలి..

తమిళనాడు రాష్ట్రం కడలూరు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డుప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ దురెటనలో తొమ్మిది మంది అక్కడికక్కడే మృతిచెందగా, మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. బస్సు టైరు అకస్మాత్తుగా పేలడంతో వాహనం అదుపుతప్పింది. ఈ క్రమంలో ముందుగా వెళ్తున్న రెండు కార్లను ఢీకొనడం ఈ ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది.

**విషాద వాతావరణం..** ఈ ఘటన జరిగిన వెంటనే ఆ ప్రాంతం మొత్తం విషాద వాతావరణంలో మునిగిపోయింది.

ప్రమాద తీవ్రతను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను తక్షణమే సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. బస్సు బలంగా ఢీకొనడంతో కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ ఘటనతో పెద్ద శబ్దం వినిపించడంతో చుట్టుపక్కల జనాలు పరుగున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడి దృశ్యాలు అత్యంత భయానకంగా ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు మానవత్వంతో స్పందించారు.

పోలీసులు, అంబులెన్స్ రాకముందే గాయపడిన వారిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. కొందరు ప్రథమ చికిత్స చేయగా.. మరికొందరు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు.

**పోలీసులు, రెస్క్యూ బృందాల చర్యలు..** ఈ సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌ను నిలిపివేసి సహాయక చర్యలు చేపట్టారు. వాహనాల్లో చిక్కుకుపోయిన మృతదేహాలను బయటకు తీసేందుకు క్రేన్లు, కట్టర్లు ఉపయోగించారు. అంబులెన్స్‌ల ద్వారా క్షతగ్రాతులను ఆస్పత్రులకు తరలించారు. పోలీసులు పరిస్థితిని పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదం జరిగిన రహదారిపై ట్రాఫిక్‌ను మరో మార్గంలో మళ్లించారు.

**ఆస్పత్రుల్లో చికిత్స..** క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రితో పాటు ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. వైద్యులు తక్షణమే అత్యవసర చికిత్స అందిస్తున్నారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఆస్పత్రుల్లో బాధితుల కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. తమ వారిని ఈ ప్రమాదంలో కోల్పోవడంతో ఆయా కుటుంబాల ఆర్తనాదాలు అందరినీ కలిచివేశాయి. మృతుల వివరాలను సేకరించే పనిలో అధికారులు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

**ప్రమాదానికి కారణాలపై దర్యాప్తు..** ఈ ఘోర ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బస్సు టైరు పేలడానికి గల కారణాలను పరిశీలిస్తున్నారు. డ్రైవర్ వేగంతో బస్సు నడిపారా వంటి అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలనూ నమోదు చేస్తున్నారు. అలాగే బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, టైర్ల పరిస్థితి, సర్వీసింగ్ వివరాలను కూడా పోలీసులు తనిఖీ చేస్తున్నారు.

**రోడ్డు భద్రతపై మళ్లీ చర్చ..** కడలూరు ప్రమాదం రోడ్డు భద్రతపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తింది. ముఖ్యంగా ప్రజా రవాణా వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యం ఎంత ప్రమాదకరమో ఈ ఘటన స్పష్టం చేసింది. ఈ ప్రమాదం అనంతరం కడలూరు జిల్లా ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రహదారులపై భద్రతా చర్యలు పెంచాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఘటన.. రోడ్డు భద్రత, వాహన నిర్వహణలో నిర్లక్ష్యం ఎంత ప్రమాదకరమో మరోసారి గుర్తు చేసింది. పోలీసుల దర్యాప్తు కొనసాగుతుండగా, ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.




## ఉన్నావ్ కేసులో కుల్దీప్ సెంగర్‌కు బెయిల్.. సీబీఐ సీరియస్

దేశంలో తీవ్ర సంచలనం సృష్టించిన ఉన్నావ్ అత్యాచార కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు బీజేపీ మాజీ ఎమ్మెల్యే, బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగర్ దాఖలు చేసిన అప్పీల్ పిటీషన్‌పై విచారణ చేపట్టిన ఢిల్లీ హై కోర్టు రూ.15 లక్షల వ్యక్తిగత పూచీకత్తుతో పాటు కొన్ని షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఇప్పటికే కుల్దీప్ ఏడేళ్ల శిక్ష అనుభవించారని, అప్పీల్ తేలేవరకు శిక్షను నిలిపివేస్తున్నామని కోర్టు పేర్కొంది. ఇదిలా ఉండగా.. కుల్దీప్ బయటకు వస్తే కేసుపై ప్రభావం పడే అవకాశముందని సీబీఐ వాదిస్తోంది. అంతేకాకుండా.. బాధితురాలి భద్రతపై కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే ఢిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై సీబీఐ కీలక నిర్ణయం తీసుకుంది. సెంగర్ శిక్షను సస్పెండ్ చేస్తూ హై కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్నట్లు సీబీఐ ఈరోజు(శనివారం) వెల్లడించింది. 2017లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఒక మైనర్ బాలికపై అప్పటి బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగర్ తన నివాసంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. 2018 డిసెంబర్‌లో ట్రయల్ కోర్టు సెంగర్‌ను దోషిగా నిర్ధారిస్తూ జీవితఖైదు విధించింది. కుల్దీప్‌కు బెయిల్ మంజూరు చేయడంపై బాధితురాలు సహా ఆమె బంధువులు కోర్టు తీర్పుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీని కలిసి తన బాధను వ్యక్తం చేసింది బాధితురాలు. తనకు న్యాయం జరిగే వరకు పోరాడతానని, ప్రధాని మోదీ కేంద్ర హోం మంత్రిని కూడా కలుస్తామని తెలిపింది. నిందితుడికి బెయిల్ రావడంపై తన కుటుంబానికి మరణశాసనం అంటూ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది.

# "సునామీ" లపై అవగాహన అవసరం

### "విజ్ఞాన వాహిని" భాగ్య నగరానికి గర్వ కారణం - డిసెంబర్ 26... మరచిపోలేని బాక్సింగ్ డే సునామీ




సరిగ్గా రెండు దశాబ్దాల కిందట భయంకరమైన అలలు లక్షల మందిని పొట్టన పెట్టుకున్నాయి. 2004 డిసెంబరు 26న ఇండొనేసియాలోని సుమత్రా తీరంలో ఒక్కసారిగా భారీ కుదుపు. 9.3 తీవ్రతతో హిందూ మహా సముద్ర గర్భంలో వచ్చిన భూకంపం ప్రళయాన్ని తలపించింది. దాని ఉద్ధృతితో ఒక్కసారిగా విరుచుకు పడిన సునామీ పెను విషాదాన్ని మిగిల్చింది. ఆ భూకంపం ధాటికి 23 వేల 'హిరోషిమా' తరహా అణుబాంబులు పేలినంత శక్తి విడుదలైనట్లు శాస్త్రవేత్తలు గుర్తించారంటే అది ఎంత తీవ్రమైనదో అర్థం చేసుకోవచ్చు. భూకంప కేంద్రం నుంచి సముద్రంలో మొదలైన రాకాసి అలలు సునామీలా దూసుకొచ్చి... భారత్ సహా 14 దేశాల్లో భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. సునామీలు అరుదుగా సంభవిస్తాయి. వస్తే మాత్రం మానవాళికి అమితంగా నష్టం చేకూరుస్తాయి. క్షణాల్లో ప్రాణాలను కబళిస్తాయి. ఊరూవాడ మొత్తాన్ని ఏకం చేస్తాయి. భారీగా ప్రాణనష్టం, ఆస్తినష్టానికి కారణ భూతాలు అవుతాయి. క్రీ.పూ. 426 ఆరంభంలో గ్రీకు చరిత్ర కారుడు తుసైదిదేస్ తన పుస్తకం పెలిపొంనేసియన్ యుద్ధ చరిత్రలో సునామి కలుగచేసే కారణముల గురించి చర్చించి, అవి భూకంపం వల్లే సంభవిస్తాయని చెప్పాడు. ప్రపంచ వ్యాప్తంగా వందేళ్లలో 58 సునామీలు సంభవించాయి. రెండున్నర లక్షల మంది మృత్యువాత పడ్డారు. 2004లో వచ్చిన సునామీతో సుమారు 2,40,000 మంది వరకు అసువులు బాసారు. మరో 48,000 మంది కనిపించకుండా పోయిన విషయం విదితమే. ఈ సునామీ 14దేశాల వారిని ప్రభావితం చేసింది. అంతకు ముందు 1960 మేలోనూ, 1945 నవంబర్ లోనూ సునామీలు సంభవించాయి. జపాన్ కు చెందిన గోహి అనే రైతు 1985లో సముద్రం వెనక్కి వెళ్లడాన్ని గుర్తించాడు. శబ్ద తరంగాల్లో మార్పును గమనించాడు. దీంతో సునామీ రాబోతుందని గుర్తించాడు. ప్రజలకు హెచ్చరిక చేయడానికి తన వరిపొలం మొత్తాన్ని తగుల బెట్టాడు. ఈ మంటల ద్వారా ప్రజలు రానున్న ఉపద్రవాన్ని గుర్తిస్తారని భావించి రైతు ప్రజల ప్రాణ రక్షణకు పూనుకున్నాడు. ఇలా ఆయన ప్రేరణతో 'వరల్డ్ సునామ్ అవేర్నెస్ వచ్చింది. అప్పటి వరకు సునామీ పై ముందస్తు సమాచారం అందించే కేంద్రం ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేదు. దీంతో భారత ప్రభుత్వం కూడా తేరుకుని సునామీ హెచ్చరిక కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అప్పటికే ఇంకాయిన్ ద్వారా మహా సముద్ర సమాచార సేవలు అందుతుండడంతో దీనికి అనుబంధం గానే సునామీ హెచ్చరిక కేంద్రం నెలకొల్పింది. 2005 నుంచి 2007 వరకు ఆపరేషన్ ప్రక్రియ కొనసాగింది. 2007లో పూర్తి స్థాయిలో "ఇండియన్ సునామీ ఎర్లీ వార్నింగ్ సిస్టం" కేంద్రంగా అవతరించింది. మత్స్యకారులకు ఉపయోగకర సేవల కోసం హైదరాబాద్ లో 1999లో ప్రగతినగర్ సమీపంలో పొటెన్షియల్ ఫిషింగ్ జోన్ ఎఎఫెడ్) గా ఇంకాయిస్ ఆవిర్భవించింది. సునామీకి ముందు మొదట సముద్రంలో భూమి కంపిస్తుంది. అలా భూప్రకంపనలు జరిగిన 5-6 నిమిషాలకు ఇంకాయిస్ కు సమాచారం అందుతుంది. సముద్ర భూభాగంలో అమర్చిన సిస్మో మీటర్ల ఆధారంగా శాటిలైట్ ద్వారా భూకంపనలు జరిగిన సమాచారం ఇంకాయిస్ కు చేరుతుంది. ఆ తర్వాత భూకంపం ప్రభావంతో సునామీ ఉత్పన్నమయ్యే అవకాశం ఉందా? లేదా? అనే దానిపై దృష్టి సారిస్తారు. సముద్ర జలాలకు కొద్ది కి.మీ దూరంలో ఏర్పాటుచేసిన 'సునామీ బోయ్ నెట్వర్క్' పరికరాల ఆధారంగా కెరటాల ఎత్తు, వాయు దిశను పరిశీలించి సునామీని గుర్తిస్తారు. సునామీ అన్న పదం జపనీస్ భాషకు చెందింది. హార్బర్ కెరటం అని దీని అర్థం. సునామీలు ఏర్పడినప్పుడు రాకాసి అలలు100 అడుగుల ఎత్తు వరకు వెళతాయి. పసిఫిక్ మహా సముద్రంలో రింగ్ ఆఫ్ ఫైర్ కారణంగానే 80 శాతానికి పైగా సునామీలు సంభవిస్తున్నాయి. సునామీ అలలు గంటకి 805 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఒక జెట్ విమానం స్పీడ్ ఇది సమానం. ప్రపంచంలో జపాన్ తర్వాత అమెరికాలోని హవాయి, అలస్కా, వాషింగ్టన్, ఒరెగాన్, కాలిఫోర్నియాకు సునామీ ముప్పు ఎక్కువ. అందులో హవాయి దీవులకి ఉన్న ముప్పు మరెక్కడా లేదు. ప్రతీ ఏడాది అక్కడ సునామీ సంభవిస్తుంది. ప్రతీ ఏడేళ్లకి తీవ్రమైన సునామీ ముంచేస్తుంది. హిందూ మహాసముద్రంతో అనుబంధంగా ఉన్న 28 దేశాలకు సునామీ హెచ్చరికలు మన హైదరాబాద్ నుంచే వెళ్తుంటాయని చాలా మందికి తెలియని విషయం. సముద్రాల్లో ఏర్పడే భూప్రకంపనల నుంచి సునామీ రాక.. సముద్రపు అలల ఎత్తు.. వేగం.. వాటి తీవ్రత ఏమేర ఉంటుందో నిమిషాల్లో భారత్ తో పాటు ఆయా దేశాలకు చేరవేసే 'విజ్ఞాన వాహిని' భాగ్యనగర సొంతమనే విషయం గర్వకారణం. నగర కీర్తి కెరటంగా 'ఇంకాయిస్' (భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవా కేంద్రం) పరిఢ విల్లుతోంది. ప్రపంచంలో మూడు దేశాల్లో సునామీ హెచ్చరిక కేంద్రాలు ఉంటే అందులో హైదరాబాద్ లోని ఇంకాయిస్ ఒకటి. మిగతా రెండు ఇండోనేషియా, ఆస్ట్రేలియా దేశాల్లో ఉన్నాయి. సముద్రంలో చేపలు ఎక్కువగా లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తించి వారికి చేరవేసే కేంద్రంగా మాత్రమే ఉండేది. ఆ తర్వాత కొద్ది కాలానికి "ఓషియన్ స్టేట్ పోర్కాస్ట్ సేవలను" ప్రారంభించింది. సముద్ర భాగంలో వాయు దిశ, అలల వేగం, వాటి ఎత్తు, ఉష్ణోగ్రత వివరాలను అందించే సేవలకు అంకురార్పణ చేసింది. సునామీ, సముద్ర విపత్తులపై ఇంకాయిస్ విస్తృతమైన అవగాహన కల్పిస్తోంది. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో సునామీ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. సునామీ వచ్చే సమయంలో సంకేతాలు ఏవిధంగా ఉంటాయి, ప్రకృతి పరంగా జరిగే మార్పులు, ప్రమాదం నుంచి బయట పడేందుకు అనుసరించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తోంది. ఆయా ఆధునిక పరికరాల సునామీ రాకను గుర్తించడమే కాకుండా తీరాన్ని ఎంత సమయంలో చేరుకుంటుంది. ఎంత ఎత్తులో కెరటాలు వస్తాయి, దాని తీవ్రత ఏమేర ఉంటుందో ఇంకాయిస్ అంచనా వేస్తుంది. అలా సేకరించిన సమాచారాన్ని జిల్లా స్థాయిలో ఉండే డిస్ట్రిక్ ఎమర్జెన్సీ సెంటర్లు, రాష్ట్ర స్థాయిలో ఉండే ఎస్ఈఓసీ (స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్), జాతీయ స్థాయిలో ఉండే ఎన్ డీ ఎంపి (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ), ఎంహెచ్ఎ (మినిస్ట్రీ ఆఫ్ హోరీం సైన్సెస్) లకు వెబ్సైట్, మెయిల్, ఎస్ఎంఎస్ ల ద్వారా కేవలం పది నిమిషాల లోపే చేరవేస్తుంది. మూడు స్థాయిల్లో ఇంకాయిన్ సమాచారం అందిస్తుంది. వార్నింగ్, అలర్ట్ వాచ్ స్థాయిల్లో సందేశం పంపుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# కుష్టు వ్యాధిగ్రస్తులకు దేవుడు బాబా ఆమ్టే

### డిసెంబర్ 26...బాబా మురళీధర్ దేవదాస్ ఆమ్టే జయంతి



ఉన్నత కుటుంబంలో జన్మించి భోగభాగ్యాలను వదిలి అణగారిన వర్గాల మేలు కొరకై జీవితాంతం కృషిసల్పిన మహోన్నత వ్యక్తి బాబా ఆమ్టే. సంఘ సేవకుడిగా ప్రసిద్ధి గాంచిన బాబా ఆమ్టే ముఖ్యంగా కుష్టు రోగుల పాలిట దేవుడిగా భావించ బడ్డారు. అమ్టే భారతీయ సామాజిక కార్యకర్త, లక్ష్య సిద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి. సామాజిక సేవే పరమావధిగా ఎంచి, జీవితాన్ని అందుకు దారవోసిన ధన్య జీవి ఆయన. కుష్టురోగుల సేవలకై చంద్రా పూర్ జిల్లాలో ఆనంద్వన్ ఆశ్రమాన్ని స్థాపించి అయన కూడా వారితోపాటే అక్కడే జీవితాన్ని గడిపి 2008, ఫిబ్రవరి 9న తన ఆశ్రమంలోనే మృతి చెందిన త్యాగశీలి. అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన మహనీయుడు. డిసెంబర్ 26, 1914లో మహా రాష్ట్రలోని వార్ధా జిల్లా హింగన్ ఘాట్లో ఒక ఉన్నత దేశస్థ బ్రాహ్మణ జాగిర్దార్ కుటుంబం లో జన్మించాడు మురళీధర్ దేవదాస్ ఆమ్టే. బాబా అనేది తల్లిదండ్రులు పెట్టిన ముద్దు పేరు. న్యాయ శాస్త్రంలో శిక్షణ పొందిన తరువాత వార్ధాలో న్యాయ అభ్యాసం ప్రారంభిం చాడు. అదే సమయంలో భారత జాతీయోద్యమ పోరాటం జరుగుతుండేది. క్విట్ ఇండియా ఉద్యమ సమయం లో అరెస్ట్ కాబడిన జాతీయ నేతల తరఫున కోర్టులలో వాదించేవాడు. క్రమక్రమంగా మహాత్మా గాంధీ వైపు ఆకర్షితు డైనాడు. గాంధీజీతో పాటు కొంత కాలం సేవాగ్రం ఆశ్రమం లో గడిపినాడు. ఆ తరువాత జీవితాంతం వరకు గాంధీజీ సిద్ధాంతాలకే కట్టుబడినాడు. వేషధారణలో కూడా గాంధీజీ వలె ఖద్దరు దుస్తులనే వాడే వాడు. గాంధీజీ వలె జీవితాంతం అణగారిన వర్గాల కృషికై పాటు పడ్డాడు. బాబా ఆమ్టే స్థాపించిన మూడు ఆశ్రమాల్లో ఆనంద్వన్ మొదటిది. కుష్టురోగుల సంక్షేమానికి మహారాష్ట్రలోని చంద్రాపుర్ జిల్లాలో ఈ ఆశ్రమాన్ని 1951లో స్థాపించాడు. ఆనంద్వన్ వరోరాకు దగ్గరలోని అటవీ ప్రాంతంలో 50 ఎకరాల విస్తీర్ణంలో దీన్ని ప్రారంభిం చాడు. అది క్రమ క్రమంగా పెద్దదై నేడు 500 ఎకరాలకు విస్తరించింది. ఆ రోజులలో కుష్టురోగులకు సమాజం నుంచి వెలివేసేవారు. అలాంటి వారి కొరకు ఆశ్రమాన్ని స్థాపించి కుష్టు రోగులను చేరదీసి వారితో పాటు అతడు కూడా అక్కడే వారి సంక్షేమం చూస్తూ గడపటం గొప్ప విషయం. కుష్టువ్యాధి ఒక అంటు రోగమని, కుష్టు రోగులను తాకినా ఆ వ్యాధి వస్తుందనే ప్రచారంలో ఉన్న సమయంలో బాబాఆమ్టే ఆ వదంతులను త్రిప్పి కొట్టడానికి స్వయంగా ఒక కుష్టురోగి నుంచి బాసిల్లి క్రిములను తన శరీరంలో ఇంజెక్షన్ ద్వారా ఎక్కించు కున్నాడు. కుష్టు రోగులకై బాబాఆమ్టే తదనంతరం సోమనాథ్, అశోకవన్ ఆశ్రమాలను కూడా స్థాపించాడు. సమాజసేవ విషయంలో ఆనంద్వన్ ఆశ్రమం ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచింది. ఆనంద్వన్ కై బాబా ఆమ్టేకు 1983లో డేమియన్ డట్టన్ లెప్రసీ సంస్థనుంచి డేమియన్ డట్టన్ అవార్డు కూడా లభించింది. ప్రస్తుతం ఆనంద్వన్ రెండు ఆసుపత్రులను, ఒక విశ్వ విద్యాలయాన్ని, ఒక అంధుల కొరకు పాఠశాలను, ఒక అనాథ శరణాలయాన్ని కలిగిఉంది. ఈ ఆశ్రమంలో 5000కు పైగా నివసిస్తున్నారు. బాబా ఆమ్టే, గాంధీజీ సిద్ధాంతాలు బాబా ఆమ్టే గాంధీజీ సిద్ధాంతాలను నమ్మిన వ్యక్తి పూర్తిగా ఆచరించిన మహనీయుడు. గాంధీజీతో పరిచయమైన తరువాత అతనితో పాటు కొద్ది రోజులు సేవాగ్రామ్ ఆశ్రమంలో గడిపి గాంధీజీ శిష్యుడిగా మారి, ఆయన సిద్ధాంతాలను పూర్తిగా వంట పట్టించు కున్నాడు. కుష్టురోగులకు భయపడక వారి సంక్షేమానికి అయన చేస్తున్న కృషికి బాబాఆమ్టేకు గాంధీజీ "అభయసాధక్" అనే బిరుదు ఇచ్చాడు. ఆ తరువాత బాబా ఆమ్టే సిద్ధాంతాలపై కూడా గాంధీజీ ప్రభావం చాలా పడింది. శేషజీవితం అణగారిన వర్గాల కొరకే గడపడమే కాకుండా, వస్త్రధారణలో ఖద్దరు బట్టలనే ధరించడం ఇత్యాది విషయా లలో ఆ ఇద్దరిలో సామ్య ముంది. అంతేకాదు ఆశ్రమాల్లో గడుపుతూ పూర్తి శాకాహార భోజనం చేస్తూ జీవనం గడిపినాడు. గాంధీజీ వలెనే స్వయంసమృద్ధి గ్రామాలు ఉండాలని ఆకాంక్షించాడు. గాంధీజీ బ్రిటీష్ వారిపై అహింసా పోరాటం జరిపినట్లే బాబా ఆమ్టే కూడా నర్మదా బచావో ఉద్యమంలో కూడా ప్రభుత్వ నిర్ణయానికి విరుద్ధంగా అహింసాయుత పోరాటం కొనసాగించాడు. తుదిశ్వాస వదిలే వరకు తాను నమ్మిన సిద్ధాంతాలకే పాటు పడి, తన ఆశయమే లక్ష్యంగా కృషిసల్పి, 2008, ఫిబ్రవరి 9న తన ఆశ్రమం ఆనంద్వన్లో బాబా ఆమ్టే 94 సంవత్సరాల వయస్సులో కన్నుమూశాడు. అనేక దశాబ్దాల పాటు దీనజన ప్రజల కోసం కృషిసల్పిన బాబా ఆమ్టేకు అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు ఎన్నో లభించాయి. అవార్డులతో పాటు లభించిన నగదును సాంఘిక కార్యకలాపాల కోసమే వినియోగించాడు. 1971లో భారత ప్రభుత్వపు పద్మశ్రీ అవార్డు, 1974లో మహారాష్ట్ర ప్రభుత్వపు దళిత్ మిత్రా అవార్డు ,1978 లో రాష్ట్రీయ భూషణ్ అవార్డు, 1979 లో జమన్లాల్ బజాజ్ అవార్డు, 1983లో అమెరికాకు చెందిన డామియెన్ డట్టన్ అవార్డు (కుష్టువ్యాధి పీడితుల కోసం కృషిసల్పిన వారికిచ్చే ప్రపంచంలో అత్యున్నత అవార్డు), 1985లో రామన్ మెగ్సేసే అవార్డు, 1985లో మధ్య ప్రదేశ్ ప్రభుత్వపు ఇందిరా గాంధీ స్మారక అవార్డు ,1986లో భారత ప్రభుత్వపు పద్మ విభూషణ్ అవార్డు, 1986 లో రాజారాంమోహన్ రాయ్ అవార్డు, 1988లో ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల అవార్డు,1988లో జి.డి.బిర్లా అంతర్జాతీయ అవార్డు, 1988లో ఫిక్కి అవార్డు, 1989లో అంతర్జాతీయ జిరాఫీ అవార్డు, 1990లో టెంపుల్టన్ అవార్డు, 1991లో రైట్ లివ్లీ హుడ్ అవార్డ్ (ఈ అవార్డు ప్రత్యమ్నాయ నోబెల్ బహుమతిగా పేరుపొందింది), 1991లో ఆదివాసీ సేవక్ అవార్డు, 1992లో మహారాష్ట్ర ప్రభుతపు అంబేద్కర్ దళిత్ మిత్ర అవార్డు, 1997లో మహాత్మా గాంధీ చారిటేబుల్ ట్రస్ట్ అవార్డు, 1999లో గాంధీ శాంతి బహుమతి, 1999లో అంబేద్కర్ అంతర్జాతీయ అవార్డు, 2008లో భారత్వాసా అవార్డు లభించాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**




అమరావతి, డిసెంబరు25 : వాజ్పేయి జయంతి సందర్భంగా ఇవాళ సుపరిపాలన దినోత్సవంగా ప్రకటించారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ. ఈ క్రమంలో అటల్ - మోదీ సుపరిపాలన యాత్ర ముగింపు సభ ఇవాళ(గురువారం) వెంకటపాలెం వద్ద నిర్వహించారు. ఈ సభకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేశ్, నారాయణ, సత్యకుమార్ యాదవ్, కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు భారీగా హాజరయ్యారు. వాజ్పేయి శత జయంతి సందర్భంగా 12 అడుగుల ఆయన కాంస్య విగ్రహం ఆవిష్కరించారు. అనంతరం వాజ్పేయి, భారతమాతల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. వాజ్పేయి జీవిత చరిత్రను వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ను తిలకించారు చంద్రబాబు, శివరాజ్ సింగ్ చౌహాన్. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఏపీ అభివృద్ధికి వాజ్పేయి సహకారం అందించిన తీరును గుర్తు చేసుకున్నారు సీఎం చంద్రబాబు. అనంతరం ఈ సభలో వందేమాతర గీతం ఆలపించారు. గతంలో తొలగించిన చరణాలను కలిపి పూర్తి వందేమాతర గీతాన్ని ఆలపించారు. వాజ్పేయి పేరుతో నిర్మించిన స్మృతి వనానికి సంబంధించిన ఏవీని ప్రదర్శిస్తూ.. వాజ్పేయి జీవిత చరిత్రను వివరించారు బీజేపీ నేతలు.

# పిన్నెల్లి సోదరులకు రిమాండ్ పొడిగింపు..



నరసరావుపేట, డిసెంబర్ 25: జంట హత్యల కేసులో వైసీపీ నేతలు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో పాటు ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి జనవరి 7 వరకు రిమాండ్ను పొడిగిస్తూ జూనియర్ సివిల్ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. గురువారం నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న వీరిని మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంత్ వర్చువల్గా విచారించారు. అనంతరం వారి రిమాండ్ను పొడిగించారు. 2025 మే 24న పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావులు దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్యలపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ఏ6గా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఏ7గా పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఉన్నారు. తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ పిన్నెల్లి సోదరులు హైకోర్టును ఆశ్రయించారు. అందుకు హైకోర్టు నిరాకరించింది. దీనిని సవాల్ చేస్తూ.. వీరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వీరి ముందస్తు బెయిల్పై కోర్టులో విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా ఇరువైపులా వాదోపవాదాలు జరిగాయి. అనంతరం పిన్నెల్లి సోదరులు కోర్టులో లొంగిపోయేందుకు సుప్రీం కోర్టు రెండు వారాల గడువు విధించింది. డిసెంబర్ 11న చివరి రోజు కావడంతో.. ఆ రోజు మాచర్ల జూనియర్ సివిల్ కోర్టులో లొంగిపోయారు. అనంతరం వారికి న్యాయమూర్తి రిమాండ్ విధించారు. దాంతో వారిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ రిమాండ్ నేటితో అంటే డిసెంబర్ 25తో ముగియనుంది. దాంతో వారిని వర్చువల్గా కోర్టులో హాజరుపరిచారు. దీంతో మరో 14 రోజుల పాటు వారికి కోర్టు రిమాండ్ విధించింది.

# గిరిజన విద్యార్థులకు గుడ్న్యూస్.. ఆ నిధులు విడుదల



అమరావతి, డిసెంబర్ 25: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త చప్పింది. గిరిజన విద్యార్థులకు స్కాలర్ షిప్లు విడుదల చేసింది ప్రభుత్వం. దీనిపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులకు సంబంధించిన పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ల విషయంలో గత ప్రభుత్వ కాలంలో పెండింగ్లో ఉన్న బకాయిలను ఇప్పటికే కూటమి ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలిపారు. ఇప్పుడు తాజాగా 2025%-%26 విద్యా సంవత్సరంలో ప్రస్తుతం అర్హులైన విద్యార్థులకు నిధులను విడుదల చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు మొత్తం రూ.100.93 కోట్లు విడుదల చేశామని.. దీని ద్వారా 59,297 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా గిరిజన విద్యార్థుల విద్య నిలకడగా, సానుకూలంగా, సంతృప్తికరంగా, భయం లేకుండా కొనసాగేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పష్టం చేశారు.




## తిరుమలకు పోటెత్తిన భక్తులు.. శ్రీవారి సర్వదర్శనానికి 30గంటలు

తిరుమల: తిరుమల కొండ భక్తులతో కిటకిటలాడుతోంది. వరుస సెలవుల నేపథ్యంలో శ్రీవారిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చారు. దీంతో శ్రీవారి సర్వదర్శనానికి 30 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్లు, నారాయణగిరి షెడ్లు భక్తులతో నిండిపోయాయి. శిలాతోరణం క్యూలైన్ వరకు భక్తులు వేచి ఉన్నారు. క్యూలైన్లలోని భక్తులకు తాగునీరు, పాలు, టీ, అన్నప్రసాదాలను శ్రీవారి సేవకులు నిరంతరాయంగా పంపిణీ చేస్తున్నారు. క్యూలైన్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు తితిదే అధికారులు పర్యవేక్షిస్తున్నారు. క్యూలైన్లన్నీ నిండిపోవడంతో యాత్రికుల వసతి సముదాయంలో ఉంటూ శుక్రవారం ఉదయం సర్వదర్శనం క్యూలైన్లోకి రావాలని భక్తులకు తితిదే విజ్ఞప్తి చేసింది. బుధవారం శ్రీవారిని 73,524 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.4.88 కోట్లు హుండీ కానుకలు లభించాయి. గదుల కోసం రద్దీ కొనసాగుతోంది. దీంతో భక్తులు యాత్రికుల వసతి సముదాయాలు, శ్రీవారి ఆలయం, ఇతర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన సాధారణ షెడ్లలో సేద తీరుతున్నారు. మరికొన్ని రోజులు ఈ రద్దీ కొనసాగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

**అలిపిరిలో టోకెన్ల కోసం..** అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద సర్వదర్శనం (ఎస్ఎస్డీ) టోకెన్ల కోసం రద్దీ నెలకొంది. కోటా పూర్తికావడంతో అధిక సంఖ్యలో భక్తులు టోకెన్ల కోసం ఒక్కసారిగా ఎగబడటంతో విధుల్లో ఉన్న పోలీసు, తితిదే సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమై పరిస్థితి అదుపు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. టోకెన్ల కోటా పూర్తయిందని తితిదే సిబ్బంది ప్రకటించడంతో.. భక్తులు తిరుమలకు పయనమయ్యారు. మరో వైపు తిరుమలకు వెళ్లేందుకు భక్తులు సొంత వాహనాల్లో తరలి రావటంతో అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వాహనాల రద్దీ అమాంతం పెరిగిపోయిం ది. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద భద్రతా సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలిస్తుం డటంతో వాహనాల తనిఖీకి కొంత సమయం పడుతోంది. అలిపిరి ముఖద్వారం వరకు వాహనాలు బారులు తీరడంతో రద్దీని నియంత్రిస్తున్నారు.



చురకలు

## సంపాదకీయం

# టెకీల కష్టాలు

గ్రేటర్ నోయిడా నుండి బెంగళూరు, హైదరాబాద్ వంటి దేశంలోని ప్రధాన నగరాల్లోని ఐటీ ఉద్యోగుల పరిస్థితి ప్రస్తుతం ఆందోళనకరంగా మారింది. విస్తృత స్థాయిలో జరుగుతున్న లేఆఫ్ లు, తగ్గుతున్న కొత్త అవకాశాలు, ఉద్యోగ భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి.. ఇవన్నీ కలిసి అనేక ఐటీ కుటుంబాల ఆర్థిక పునాదులను తీవ్రంగా కుదిపేశాయి.

**ఇఎంఐ భారం: ఊపిరి బిగపట్టే స్థితి...** ఐటీ ఉద్యోగులకు అతిపెద్ద ఆర్థిక భారంగా మారింది వారి హోమ్ లోన్ ఇఎంఐలు. నెలనెలా చెల్లించాల్సిన ఈ భారీ చెల్లింపులు ఉద్యోగం కోల్పోయిన వెంటనే అసాధ్యంగా మారాయి. ఆదాయం లేకుండా భారీ ఇఎంఐలను ఎలా భరించాలి? అనే భయం అనేక మందిని వెంటాడుతోంది. ఇఎంఐ డిఫాల్ట్ అయ్యే ప్రమాదం పెరుగుతుందనే ఆందోళనతో కొంతమంది టెకీలు తమ అపార్ట్‌మెంట్‌లను అమ్మకానికి కూడా పెట్టేశారు. ఏళ్ల కష్టంతో కొన్న ఇంటిని విడిచి పెట్టడం వారికి బాధగా ఉన్నా, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు వారిని ఈ కఠినమైన నిర్ణయం తీసుకునేలా నెట్టేస్తున్నాయి.

**అద్దె ఇళ్లు... అయినా భారమే...** ఫ్లాట్లు అమ్మేసి కొందరు మళ్లీ అద్దె ఇళ్లకు మారుతున్నారు. నగరాల్లో నెలకు 20,000 నుండి 30,000 వరకు ఉన్న అద్దెలు కూడా ఉద్యోగం లేని కుటుంబాలకు పెద్ద సవాలుగా ఉన్నాయి. అయినప్పటికీ, భారీ ఇఎంఐ కంటే ఈ అద్దె ఓ కొద్దిగా భరించగలిగే ఎంపికగా కనిపిస్తోంది.

**బతుకు దెరువు కోసం రెపిడో డ్రైవింగ్...** ఉద్యోగాలు కోల్పోయిన అనేక మంది టెకీలు బతుకుదెరువు కోసం కొత్త మార్గాలు వెతుకుతున్నారు. అందులో భాగంగా కొంతమంది రెపిడో డ్రైవర్లుగా పనిచేయడం మొదలుపెట్టారు. ఇప్పటివరకు ఏసీ ఆఫీసుల్లో కూర్చుని పనిచేసిన వారు.. ఇప్పుడు రోడ్ల మీద బైక్ టాక్సీలను నడుపుతూ జీవనోపాధి కోసం పోరాడుతున్నారు. వారి మాటల్లో... "ఇది మనం ఎప్పుడూ ఊహించుకున్న జీవితం కాదు.

కానీ కుటుంబాన్ని నెట్టుకొచ్చుకోవడం కోసం మరో మార్గం లేదు. అద్దె కట్టాలన్నా, నిత్యవసరాలు కొనాలన్నా కష్టపడక తప్పట్లేదు." అని నిట్టూరుస్తున్నారు.

**లేఆఫ్ ల దెబ్బ: ఏఐ ప్రభావం స్పష్టం...** ఐటీ రంగాన్ని ప్రభావితం చేస్తున్న ఈ సంక్షోభం ఒక్కరోజులో రాలేదు. దీనికి అనేక అంశాలు దోహదపడుతున్నాయి. భారీ స్థాయి లేఆఫ్ లు ప్రధాన కారణం. కొత్త అవకాశాలు, ప్రాజెక్టులు తగ్గిపోవడం.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పనులను ఆటోమేట్ చేయడం.. ఔట్‌సోర్సింగ్ ప్రాజెక్టులు పడిపోవడం.. ఈ పరిణామాలు ఐటీ ఉద్యోగుల జీవనాన్ని పూర్తిగా మార్చేశాయి. అభివృద్ధి, అపారమైన అవకాశాలకు మారుపేరుగా భావించిన ఐటీ రంగం, ఇప్పుడు అనేక కుటుంబాలకు ఆర్థిక ఒత్తిడి, భయాందోళనలకు కారణమవుతోంది. ఇళ్ల అద్దెల కోసం టెకీలు రెపిడో డ్రైవర్లుగా మారాల్సిన పరిస్థితి, ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌లో ఉన్న అస్థిరతను స్పష్టంగా చూపిస్తోంది. రాబోయే రోజుల్లో ఉద్యోగ భద్రత, నైపుణ్యాల పెంపు (రీ-స్కిల్లింగ్), మరియు ఏఐ ప్రభావానికి తగిన విధంగా ఐటీ రంగం మార్పులు పొందడం అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

# భారత జాతీయ కాంగ్రెస్ అతివాద, మితవాదుల చీలిక... స్వాతంత్ర్యోద్యమంలో ఒక మలుపు

## డిసెంబర్ 26...భారత జాతీయ కాంగ్రెస్ సూరత్ చీలిక దినం



1907 డిసెంబర్ 26న సూరత్‌లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో మితవాదులు, అతివాదుల మధ్య విభేదాలు తారస్థాయికి చేరి, కాంగ్రెస్ చీలికకు దారితీశాయి. ఈ సంఘటన భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో కీలకమైన మలుపుగా నిలిచింది. చీలికకు ముందున్న రాజకీయ పరిస్థితులు, నాయకుల వ్యూహాలు, విధాన భేదాలు, విభజన ఫలితాలు స్వాతంత్ర్యోద్యమాన్ని దిశా నిర్దేశం చేశాయి.

**చీలికకు పూర్వ పరిస్థితి...** 19వ శతాబ్దం చివర నాటికి భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ బ్రిటిష్ ప్రభుత్వంతో సంభాషణలు చేస్తూ, రాజకీయ స్వేచ్ఛను క్రమంగా సాధించడానికి ప్రయత్నించింది. అయితే 1905లో బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్ విభజన చేపట్టడంతో పరిస్థితి మారిపోయింది. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వెల్లువెత్తింది. దీనికి అతివాదులు తీవ్ర నిరసనలు తెలిపి, స్వావలంబన, స్వదేశీ ఉద్యమాలకు ప్రాధాన్యం ఇవ్వగా, మితవాదులు రాజ్యాంగబద్ధమైన మార్గాలపై నమ్మకం ఉంచారు.

**మితవాదులు ... అతివాదులు...** భారత జాతీయ కాంగ్రెస్‌లో చీలికకు ప్రధాన కారణం ఆ రెండు వర్గాల వ్యూహాలు, లక్ష్యాల్లో తేడా. మితవాదులలో ప్రధాన నాయకులు గోపాలకృష్ణ గోఖలే, దాదాభాయి నౌరోజీ, సురేంద్రనాథ్ బెనర్జీ.

**లక్ష్యాలు:** బ్రిటిష్ ప్రభుత్వం నుండి కొద్దికొద్దిగా రాయితీలు పొందడం. రాజ్యాంగ మార్గాల్లో స్వరాజ్యం సాధించడం.

**విధానం:** శాంతియుత నిరసనలు, పిటిషన్లు, బ్రిటిష్ అధికారులతో చర్చలు.

**అతివాదులలో ప్రధాన నాయకులు:** బాల గంగాధర్ తిలక్, లాలా లజపతిరాయ్ బిపిన్ చంద్ర పాల్ (లాల్-బాల-పాల్ త్రయం).

**లక్ష్యాలు:** స్వాతంత్ర్యం పొందడం (సంపూర్ణ స్వరాజ్యం). ప్రజలను చైతన్యపరచి, ఉద్యమాలు చేపట్టడం.

**విధానం:** స్వదేశీ ఉద్యమం, బ్రిటిష్ వస్తువుల బహిష్కారం. బలమైన ప్రజా ఉద్యమాలు, నిరసనలు.

**1907 సూరత్ కాంగ్రెస్ సమావేశం...** సూరత్ సెషన్‌లో మితవాదులు, అతివాదుల మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి.

**నాయకత్వం పై విభేదాలు:** అతివాదులు, ముఖ్యంగా తిలక్ వర్గం, తమ నాయకత్వం ఖరారు చేయాలని భావించారు. మితవాదులు రాష్ బిహారీ ఘోష్‌ను అధ్యక్షుడిగా ఎంపిక చేశారు.
ఈ నిర్ణయం తీవ్రవాదుల ఆగ్రహానికి దారితీసింది.

**సభలో ఘర్షణ:** ఇరు వర్గాల మధ్య వాగ్వాదం తీవ్రంగా మారి, సమావేశం మధ్యలోనే సభ వాతావరణం దిగజారిపోయింది. దీనితో కాంగ్రెస్ అధికారికంగా రెండుగా చీలిపోయింది.

**విభజనకు కారణాలు... విధానాల్లో భేదాలు:** మితవాదులు శాంతియుత మార్గాలపై విశ్వాసం ఉంచగా, అతివాదులు హింసాత్మక చర్యలను సమర్థించారు.

**బెంగాల్ విభజన ప్రభావం:** అతివాదులు బెంగాలు విభజనకు తీవ్రంగా స్పందించి, స్వావలంబన ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. మితవాదులు శాంతియుత పద్ధతులను ఎంచుకున్నారు.

**నాయకత్వ పోటీ:** తిలక్ నాయకత్వంపై అతివాదులు విశ్వాసం ఉంచగా, మితవాదులు ఆమోదించలేదు.

**వర్గ విభజన:** మితవాదులు బ్రిటిష్ విధానాలను క్రమంగా ఎదుర్కోవాలని భావించారు, కానీ అతివాదులు వాటిని పూర్తిగా నిరాకరించారు.


**విభజన ఫలితాలు... కాంగ్రెస్ బలహీనత...** కాంగ్రెస్ ఒకతాటిపై పని చేయడం కష్టమై, స్వాతంత్ర్యోద్యమం కొంతకాలం నీరసించింది.

**ఉగ్రవాద ఉద్యమాలకు ప్రేరణ...** యువతను చైతన్య పరిచిన అతివాదాలు, భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి నాయకులకు ప్రేరణగా నిలిచాయి.

**పునఃఏకతా ప్రయత్నం...** 1916లో లక్నో ఒప్పందం ద్వారా మళ్లీ మితవాదులు, అతివాదులు కలిసి పనిచేసే ప్రయత్నం చేశారు. 1907 సూరత్ చీలిక భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఒక కీలకమైన అధ్యాయం. ఈ చీలిక ఒకవైపు కాంగ్రెస్ బలహీనతకు దారితీసినా, మరోవైపు ఉద్యమంలో కొత్త రకాల మార్గాలు, వ్యూహాలకు పునాదులు వేసింది. ఈ చీలిక భారతీయులను వివిధ మార్గాల్లో స్వాతంత్ర్య సాధనకు ప్రేరేపించింది. ఈ సంఘటనకు విభిన్న వర్గాలు తమ పాత్రలు సమర్థవంతంగా నిర్వర్తించడం ద్వారా భారత స్వాతంత్ర్యోద్యమానికి కొత్త దిశానిర్దేశం లభించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ప్రతిజ్ఞా పాలనలో లక్ష్యాన్ని ముద్దాడిన ఉద్ధం సింగ్ - డిసెంబర్ 26...ఉద్ధం సింగ్ జయంతి



భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అసువులు బాసిన వారెందరో... అయితే అమర వీరుడు ఉద్ధం సింగ్ ఆత్మార్పణం ఒక ప్రత్యేకం. కళ్ళముందే అగణిత ప్రాణాలను కిరాతకంగా తుపాకీ గుళ్ళకు బలి చేసిన శ్వేత జాతి అధికారిని హతమార్చి పగ తీర్చుకున్న సందర్భం. దేశ చరిత్రలో చెరిగి పోలేని దేశభక్తికి పరాకాష్టగా నిలిచిన ముఖ్య ఘట్టం. జలియన్ వాలా బాగ్ మారణ కాండలో ప్రాణాలతో బయట పడిన యువకుడు తాను చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చుడానికి, పగ తీర్చుకోవడానికి ఏళ్ళ తరబడి నిరీక్షించి, లక్ష్య సాధనలో దేశాన్ని వదిలి, విదేశానికి శ్రమకోర్చి వెళ్ళి, సమయం కోసం వేచి ఉండి, నర రూప రాక్షసుడైన డయ్యర్ ను హత మార్చి, ఉరి తాడును ముద్దాడిన దేశం గర్వించదగ్గ అమరుడు ఉద్దమ్ సింగ్ సాహసోపేత నేపథ్యం అనన్య సామాన్యం, అపూర్వం, అసమానం. ఈ చారిత్రక నేపథ్యం గురించి తెలుసు కోవాలంటే వంద ఏళ్లు వెనకకు వెళ్లాల్సిందే. బెంగాల్ నానాటికీ పెచ్చరిల్లుతున్న విప్లవోద్యమం, భారత ప్రజల్లో నానాటికీ రగులు తున్న అసంతృప్తి (ముఖ్యంగా బాంబే మిల్ వర్కర్స్ లో), మొద లైన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని బ్రిటిష్ ప్రభుత్వం 1918లో ఆంగ్లేయ న్యాయమూర్తి యైన సిడ్నీ రౌలట్ ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. దీనినే రౌలట్ కమిటీ అంటారు. రౌలట్ కమిటీ ప్రతిపాదనను అనుసరించి ర బ్రిటీష్ ప్రభుత్వం 1915లో ఏర్పాటు చేయబడ్డ భారతీయ రక్షణ చట్టానికి అదనంగా రౌలట్ చట్టాన్ని ప్రతిపాదించింది. ఈ చట్టం అణిచి వేయడానికి వైస్రాయ్ లకు విశేష అధికారాలని కట్ట బెట్టారు. ప్రెస్ నోళ్ళను కట్టేయడానికీ, విచారణ లేకుండా రాజకీయ నాయకులను నిర్బంధించడం, తిరుగుబాటు దారునిగా అనుమానితులైన వ్యక్తులను వారంటు లేకుండా అరెస్టు చేయడం మొదలైన నిరంకుశమైన అధికారాలు ఇందులో ఉన్నాయి. ఈ చట్టం పై దేశంలో సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్త మయ్యాయి. జలియన్ వాలాబాగ్ దురంతం భారత స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో జరిగిన అత్యంత దురదృష్టమైన సంఘటన. 1919, ఏప్రిల్ 13న పంజాబ్ రాష్ట్రంలోని అమృత్సర్ లోగల స్వర్ణ దేవాలయం పక్కనే ఉన్న జలియన్ వాలాబాగ్ తోటలో దాదాపు 20 వేలమంది ప్రజలు సమావేశ మైనారు. అది వైశాఖ మాసం, సిక్కులకు ఆధ్యాత్మిక నూతన సంవత్సరం. వారు అక్కడ సమావేశ మవడానికి ముఖ్య కారణం, ప్రముఖ నేతలు ఆంగ్లేయ పాలనకు వ్యతిరేకిస్తూ చేస్తున్న ఉపన్యాసాలను వినడం, అనేక విమర్శలకు గురైన రౌలట్ చట్టం క్రింద సత్యపాల్, సైఫుద్దీన్ కిచ్లూలను అక్రమంగా నిర్భందించడాన్ని వ్యతిరేకించడం ఏప్రిల్ 13, 1919 న బ్రిటీష్ సైని కులు జనరల్ డయ్యర్ సారథ్యంలో ఈ తోటలో సమావేశమైన నిరాయుధులైన స్త్రీ, పురుషులు, పిల్లలపైన విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పులు పది నిమిషాలపాటు కొనసాగాయి. ఇరుకైన సందుల కారణంగా వాహ లోపలికి రాలేక పోయాయి. జలియన్ వాలా బాగ్ (పార్కు) అన్ని ప్రక్కలా ఇండ్లతోను, పెద్ద భవనాల తోను చుట్టబడి ఉంది. ఉన్న కొద్దిపాటి ఇరుకైన సందుల దారుల్లో చాలావాటికి తాళాలు వేసి ఉన్నాయి. కాల్పుల కారణం వందలమంది మరణించారు. 1650 రౌండ్లు కాల్పులు జరిగాయి. అప్పటి ఆంగ్ల ప్రభుత్వ లెక్కల ప్రకారం 379 (337 పురుషులు, 41 మంది మహిళలు, 6 వారాల పసికందు) మరణించారు. కానీ ఇతర గణాంకాల ప్రకారం అక్కడ 1000 కి పైగా మరణించారు. 2000 మందికి పైగా గాయ పడ్డారు. అక్కడ స్మారక చిహ్నంపైన వ్రాసిన సమాచారం ప్రకారం అక్కడి బావిలోంచి 120 శవాలను నగరంలో కర్ఫ్యూ ఉన్నందున గాయపడిన వారిని ఆసుపత్రులకు తీసికొని వెళ్ళడం సాధ్యం కాలేదు. పంజాబ్ అమృత్ సర్ లోని 1919 ఏప్రిల్ 13 మైన జలియన్ భాగ్ లో చాలా శాంతియుతంగా వేల మంది సామాన్య పౌరులు సమావేశం పోలీసులతో చుట్టు ముట్టి విచ్చలవిడిగా కాల్పులు జరిపి వేల మంది మరణానికి కారణం అయ్యాడు జనరల్ డైయర్. షేర్ సింగ్ (ఉధం సింగ్) 1899 డిసెంబర్ 26 న పంజాబ్ లో సంగ్రూర్ జిల్లా సునం అనే గ్రామం లో కాంబోజి సిక్ కుటుంబంలో జన్మించారు. తండ్రి తెహల్ సింగ్ పొరుగు గ్రామమైన ఉపాల్ లో జమ్ము రైల్వే క్రాసింగ్ కాపలా దారుగా జీవనం సాగించేవారు. ఉద్ధం సింగ్ తల్లి 1901లో తండ్రి 1లో చనిపోయారు. షేర్ సింగ్ (ఉధం సింగ్ ) వారి తల్లి తండ్రులు చనిపోయాక అన్న ముక్తా సింగ్ తో కలిసి అమృత్ సర్ లో సెంట్రల్ ఖల్సా అనాథ ఆశ్రమంలో చేరారు. అక్కడ సిక్కులకి మతపరమైన దీక్ష చేసి అక్కడ వారి చేత ఉద్దం సింగ్ అనే పేరుని స్వీకరించారు. మెట్రిక్యు లేషన్ చదువు 1918లో పూర్తి చేసి 1919లో ఆ అనాథ ఆశ్రమం నుండి బయటకి వచ్చాడు. జలియన్ వాలా బాగ్ సంఘటనలో యువకుడైన సింగ్ కూడా ఉన్నాడు. అమానుష దాడి తన కళ్ళ ముందే జరగడంతో హత్యాకాండకు సూత్రధారి అయిన డైయరు, జెనరల్ మైకెల్ ఒడ్వాయర్ ను హత మార్చడానికి ప్రతీకారాన్ని తీర్చు కోవటానికి ప్రతిన బూనాడు. భగత్ సింగ్ విప్లవ భావాలకి ఆకర్షితుడై 1927 న భగత్ సింగ్ ఆదేశాల మేరకు విదేశాలనుండి తుపాకులు తెస్తు పోలీసులకు దొరికి 1931 వరకు జైలు జీవితం గడిపాడు. విప్లవ వీరుడు భగత్ సింగ్ ను ఉరి తీయడం సింగ్ ను కలచి వేసింది. జైలు నుండి విడుదల అయిన తరువాత చదువు పేరుతో పేరు మార్చుకుని, పోలీసుల నిఘా నుండి తప్పించు కుని కాశ్మీర్, జర్మనీ మీదగా లండన్ చేరాడు.

డైయ్యర్ ని హత్య చేయడానికి పగబట్టి 9 సంవత్సరాలు ఎదురు చూసి 21 సంవత్స రాల తరువాత మార్చ్ 1940 మార్చి 13 న లండన్ కాక్స్ టన్ హాల్ లో డయర్ ని అందరు చూస్తుండ గానే తుపాకీతో కాల్చి హత్య చేసి ప్రతీకారం తీర్చుకుని పోలీసులకి స్వచ్ఛందంగా పట్టుబడి తను చంపిన కారణాన్ని నిర్భ యంగా చెప్పాడు. దీంతో జూన్ 4, 1940 న, ఓల్డ్ బెయిలీలోని సెంట్రల్ క్రిమినల్ కోర్టులో, జస్టిస్ అట్కిన్సన్ మరణశిక్ష విధించాడు. జూలై 31, 1940 న, ఉధమ్ సింగ్ ను లండన్ లోని ,పెంటన్ విల్లే జైలులో ఉరి తీశారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# తెలుగు సినీ ఆకాశంలో ధృవతార సావిత్రి - డిసెంబర్ 26...మహానటి సావిత్రి వర్ధంతి



నటి సావిత్రి తెలుగు సినీ రంగంలో ఒక శాశ్వత చిహ్నం, ఒక శిఖరం. ఆమె కేవలం గొప్ప నటి మాత్రమే కాకుండా, అద్భుతమైన వ్యక్తి, మానవీయ గుణాలు కలిగిన స్త్రీ. ఆమె నటనలోని భావోద్వేగాలు, పాత్రలపై ప్రేమ, పరిశ్రమకు చేసిన సేవలు తెలుగు సినీ చరిత్రలో అజరామరంగా నిలిచి పోయాయి.

**బాల్యం, విద్య...** సావిత్రి 1936 డిసెంబర్ 6న ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా చిర్రావూరు అనే గ్రామంలో జన్మించారు. తండ్రి సుబ్రహ్మణ్యం, తల్లి నారాయణస్వామి దంపతుల కూతురు. చిన్నతనం లోనే తండ్రిని కోల్పోవడం ఆమె కుటుంబానికి కఠిన పరిస్థితులు తీసుకొచ్చింది.
చిన్నప్పటి నుండే సావిత్రికి నాటకాల పట్ల ఆసక్తి ఉండేది. తల్లి ప్రోత్సాహంతో సావిత్రి నటనా రంగంలో అడుగు పెట్టారు.

**సినీ రంగ ప్రవేశం...** సావిత్రి సినిమాల్లో అడుగుపెట్టిన తొలి దశలో చిన్నపాటి పాత్రల్లో నటించారు. 1950లో "సాంసారం" అనే చిత్రంతో ఆమె తెలుగు సినిమా రంగంలో పరిచయం అయ్యారు. అయితే ఆమెకు నిజమైన గుర్తింపు 1952లో విడుదలైన " పెళ్లి చేసి చూడు" చిత్రంతో వచ్చింది. ఆ తర్వాత ఆమె నటనకు పట్టం కట్టిన సినిమాలు అనేకం. "దేవదాసు," "మాయా. బజార్," "గుండమ్మ కథ," "చివరికి మిగిలేది" వంటి ఎన్నో చలన చిత్రాల్లో ఆమె ప్రతిభా ప్రదర్శన తెలుగు ప్రేక్షకులను కట్టిపడేసింది.

**నటనలో ప్రత్యేకత...** సావిత్రి అభినయం ఒక ప్రాణశక్తి. ప్రతి పాత్రలో జీవించి, ఆ పాత్రకు తన స్వరూపాన్ని జోడించేది. ఆమె నవరసాలను సజీవంగా అద్భుతంగా వ్యక్తీకరించగలిగిన నటి. "మాయాబజార్" లో ఆమె ఘటోత్గజుడి పాత్రలో చూపిన హాస్యం, "దేవదాసు" లో పార్వతి పాత్రలో చూపిన ప్రేమ విరహం లాంటివి ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశాయి. ఆమె నటన ఏ పాత్రను అయినా నిజంగా అనుభవించి చేసినట్లు ఉండేది.

**చిత్రసీమపై ప్రభావం...** సావిత్రి తన కెరీర్‌లో 250 కంటే ఎక్కువ చిత్రాల్లో నటించారు. తెలుగు మాత్రమే కాకుండా తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషలలో కూడా ఆమె నటించారు. సావిత్రి నటనకు గాను ఆమెను ప్రేక్షకులు "మహానటి" అని పిలుచుకునే స్థాయికి తీసుకెళ్లింది.

**గౌరవాలు, పురస్కారాలు...** సావిత్రికి అనేక పురస్కారాలు, గుర్తింపులు లభించాయి. 1960లో "చివరికి మిగిలేది" చిత్రానికి ఉత్తమ నటి జాతీయ అవార్డును పొందారు. 1968లో భారత ప్రభుత్వం ఆమెకు పద్మశ్రీ అవార్డును ప్రదానం చేసింది. ఆమె నటించిన చిత్రాలు ఇప్పటికీ కళాజ్ఞానానికి నిదర్శనాలుగా నిలుస్తాయి.

**వ్యక్తిగత జీవితం..** సావిత్రి నటుడు జెమినీ గణేశన్‌ను ప్రేమించి వివాహం చేసుకున్నారు. ఈ వివాహం ఆమె వ్యక్తిగత జీవితంలో మలుపులు తీసుకొచ్చింది. కుటుంబ సంబంధాల్లోనూ, సినీ జీవితం మధ్య సమతౌల్యం సాధించడం ఆమెకు సవాలుగా మారింది. ఆమె వ్యక్తిగత జీవితంలో ఎదురైన ఒత్తిళ్లు, మద్యపానం వంటి సమస్యలు ఆమె ఆరోగ్యాన్ని దెబ్బతీశాయి.

**మరణం..** అనారోగ్య సమస్యలతో సావిత్రి 1981 డిసెంబర్ 26న 45 ఏళ్ల వయసులో మరణించారు. ఆమె మరణం తెలుగు చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటు

**జ్ఞాపకార్థం మహానటి...** 2018లో సావిత్రి జీవితం ఆధారంగా రూపొందించిన "మహానటి" సినిమా ఆమె జీవితానికి అద్దం పట్టింది. కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం ప్రేక్షకులను ఎంతో ప్రభావితం చేసింది.

**సావిత్రి వారసత్వం...** సావిత్రి తెలుగు సినీ చరిత్రలో ఒక ప్రేరణ, ఒక చిహ్నం. ఆమె జీవితం కష్టాలను ఎదుర్కొనే ధైర్యానికి ప్రతీకగా నిలుస్తుంది. నేటి తరం స్త్రీలకు సావిత్రి గారి జీవితం ఓ పాఠంగా, ఓ స్ఫూర్తిగా నిలుస్తుంది.
మహానటి సావిత్రి తెలుగు సినిమా చరిత్రలో శాశ్వత నక్షత్రంగా వెలుగొందుతూనే ఉంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## అక్రమార్కులను హడలెత్తించిన హైడ్రా

హైదరాబాద్: సికింద్రాబాద్ బుద్ధభవన్‌లో హైడ్రా నిర్వహించిన ప్రజావాణిలో 37 ఫిర్యాదులందగా.. అదనపు కమిషనర్ ఆర్.సుదర్శన్ అర్జీలను స్వీకరించారు. ప్రాథమిక సమాచారాన్ని పరిశీలించి.. విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎల్బీనగర్‌లోని వెంకటేశ్వర కాలనీ ఫేజ్-2 లేఅవుట్‌లో 1200 గజాల స్థలాన్ని బస్టాపు కోసం కేటాయించగా.. తప్పుడు పత్రాలతో కొందరు కబ్జా చేశారంటూ స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు.

హైడ్రా ప్రగతినగర్ చెరువు(అంబీర్ చెరువు) సంరక్షణ చర్యలను ప్రారంభించారు. మొదటి రోజే 30 ట్రక్కుల వ్యర్థాలను తొలగించామని



రంగనాథ్ తెలిపారు.

**రూ.2,500 కోట్ల విలువైన భూమికి కంచె..**

నార్సింగి మండలం నెక్నాంపూర్‌లో సర్వే నెంబరు 20లోని 23ఎకరాల 16గుంటల భూమిని చెరబట్టేందుకు కొందరు ప్రయత్నిస్తుండగా.. హైడ్రా వారి చర్యలను అడ్డుకుంది. మార్కెట్లో ఆ భూమి విలువ రూ.2,500 కోట్లని, రేకుల షెడ్లు, గోడల నిర్మాణాలను తొలగించినట్లు కమిషనర్ వెల్లడించారు.

## సాగే బలం.. శ్రమే ఆయుధం

హైదరాబాద్: రైతుకు తెలిసింది సాగు ఒక్కటే. తెల్లవారుజామునే పొలానికి పరుగు తీస్తారు. కష్టమొచ్చినా.. నష్టమొచ్చినా వ్యవసాయమే ఊపిరిగా సాగుతారు. శ్రమను ఆయుధంగా చేసుకొని సాగు ఒడిని నమ్ముకుంటాడు. రైతన్న అందరి ఆకలి తీర్చేందుకు శ్రమిస్తారు. ఇదే క్రమంలో కొందరు తమ రెక్కల కష్టంతో పిల్లలను వృద్ధిలోకి తీసుకురాగా, మరికొందరు ఉన్నతవిద్యాభ్యాసం పూర్తిచేసి పొలం వైపే అడుగేయడం విశేషం. నేడు రైతు దినోత్సవం సందర్భంగా వారిపై కథనం.

**కొలువుకు గుడ్ బై చెప్పి..**

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం మంబాపూర్‌కు చెందిన హనీఫ్ పీజీ పూర్తిచేశారు. అనంతరం పోలీసు ఉద్యోగానికి ప్రకటన వెలువడటంతో దరఖాస్తు చేశారు. అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణులై కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. ఈ క్రమంలో వ్యవసాయంపై మక్కువతో కొలువు వదులుకొని స్వగ్రామానికి చేరుకున్నారు. సొంతూరిలో ఆరెకరాలను కౌలుకు తీసుకొని సాగుకు ఉపక్రమించారు. స్వల్ప కాలంలో చేతికొచ్చే కూరగాయలను నమ్ముకున్నారు. ప్రధానంగా బీర, కాకర, సొర, టమాట వంటి తీగ జాతి రకాలను మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పండిస్తున్నారు. ప్రతి నెలా అన్ని రకాలకు కలిపి క్వింటా వరకు దిగుబడి వస్తోంది. వీటి విక్రయంతో రూ.70 వేల వరకు ఆర్జిస్తూ సాగుతున్నారు. గుమ్మడిదల

**కలెక్టర్‌గా తీర్చిదిద్ది..**

సిద్దిపేట జిల్లా కొండపాకకు చెందిన బుద్ది లలిత, నరేష్ దంపతులది సాధారణ రైతు కుటుంబం. వీరికి ఇద్దరు సంతానం అఖిల్, అజయ్. నరేష్ నిత్యం తెల్లవారగానే పొలానికి వెళ్లడమే అలవాటు. తమకున్న వరి, పత్తి, మొక్కజొన్న సాగు చేస్తూ ఇద్దరు పిల్లలను చదివించారు. పంటల సాగునే నమ్ముకున్న నరేష్.. తన పిల్లలను అన్ని రకాలుగా ప్రోత్సహించారు. ఈయన కష్టాన్ని చూసిన అఖిల్ చిన్నప్పటి నుంచి తండ్రికి చేదోడువాదోడుగా ఉంటూ వచ్చారు. ఎలాగైనా ఉన్నత స్థాయికి చేరాలన్న ఉద్దేశంతో కష్టపడి చదివారు. బీటెక్ పూర్తిచేశాక సివిల్స్‌కు సిద్ధమయ్యారు. ఇంట్లోనే ఉండి పరీక్ష రాశారు. రెండు సార్లు ఫలితం దక్కకపోయినా తండ్రి ప్రోత్సాహంతో మూడో సారి ఉత్తీర్ణులయ్యారు. ప్రస్తుతం పాండిచ్చేరిలో సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కొండపాక

**అసంతృప్తిని వీడాలని..**

మెదక్ జిల్లా పాపన్నపేటకు చెందిన రాములు, రాములమ్మ దంపతుల చిన్న కుమారుడు నర్సింహ (విక్కి).. పీజీ పూర్తిచేశారు. రెండేళ్ల పాటు కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో పరిశోధకుల వద్ద పని చేశారు. ఐదంకెల వేతనం పొందారు. అయినా అసంతృప్తి వెంటాడింది. అదే సమయంలో ఉద్యాన శాఖలో పని చేసే ఇతడి మిత్రుడు సాగుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేశారు. అంతే దాన్నే జీవనాధారం చేసుకోవాలని నర్సింహ వెంటనే స్వగ్రామానికి వచ్చేశారు. తమకున్న 35 ఎకరాలలో కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. సేంద్రియ ఎరువులు వాడుతున్నారు. అన్ని రకాలు కలిపి ప్రతి నెలా 200 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తోంది. వాటి విక్రయంతో రూ.1.50 లక్షలకు పైగా ఆర్జిస్తున్నారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ముందుకు సాగుతున్నారు. మెదక్ టౌన్, పాపన్నపేట

## చాటుమాటుగా కాదు.. దర్జాగా..

రామచంద్రాపురం : పేదల కోసం ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. అక్రమాల కట్టడికి ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపడుతున్నా, ఫలితం ఉండటం లేదు. అక్రమార్కులకు అధికారులే అండగా నిలుస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. స్థానికంగా ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

**పాత భవనాల్లో నిల్వ**పటాన్‌చెరు, రామచంద్రాపురం శివారు ప్రాంతాల్లో ఇటీవల రేషన్ సన్న బియ్యం అక్రమ తరలింపు ఘటనలు పెరిగాయి. శివారులోని పలు ప్రాంతాల నుంచి తక్కువ ధరకు ప్రజల నుంచి సేకరిస్తున్నారు. ఆ బియ్యాన్ని ఓఆర్ఆర్ సమీప ప్రాంతాల్లోని పాత భవనాల్లో నిల్వ చేస్తున్నారు. అనంతరం ప్రత్యేక వాహనాల ద్వారా మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ తదితర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఆరు నెలల పరిధిలో 13 కేసుల్లో 200 టన్నులకు పైగా బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**అనేక అనుమానాలు** తాజాగా చిట్కుల్‌లో రేషన్ బియ్యాన్ని గుర్తించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. సంబంధిత అధికారి అక్కడకు చేరుకొని బియ్యాన్ని సీజ్ చేశారు. రేషన్ దుకాణం నుంచి వచ్చిన బస్తాలు వచ్చినట్లే ఉండటంతో అంతా విస్మయానికి గురయ్యారు. ఆ బియ్యం ఎక్కడి నుంచి వచ్చాయో మరుసటి రోజు తేల్చుతామని అధికారులు చెప్పారు. ఇప్పటికీ తేల్చలేదు. మత్తంగిలో ఓ పాత షెడ్డులో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసిన విషయాన్ని స్థానికులు అధికారులకు తెలిపినా.. చర్యలు కరవైన తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఇకపై విజిలెన్స్ అధికారుల తనిఖీలు**

– అనూప్, ఉప తహసీల్దార్, పౌరసరఫరాల విభాగం

విషయం తెలియగానే ఘటనా స్థలికి చేరుకొని బియ్యాన్ని సీజ్ చేస్తున్నాం. ఇకపై పౌర సరఫరాల అధికారులే కాకుండా విజిలెన్స్ అధికారులు సైతం అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకునే అధికారాన్ని ప్రభుత్వం కల్పించింది. తనిఖీలు ముమ్మరం చేసి, అక్రమ దందాను అడ్డుకుంటాం.

# ఖాళీ.. కనిపిస్తే వాలి..




హైదరాబాద్: నగరంలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.. అక్రమార్కులు రెక్కలు కట్టుకుని వాలుతున్నారు. ప్రభుత్వ భూములైతే చకచకా నకిలీ పత్రాలు సృష్టించి తమవే అంటున్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 5లోని ప్రభుత్వ భూమిని ఓ రియల్ వెంచర్ ప్రతినిధులు కబ్జాచేశారు. రూ.కోట్ల విలువైన భూములను సొంతం చేసుకునేందుకు దర్జాగా పనులు చేస్తున్నా.. షేక్‌పేట్ రెవెన్యూ అధికారులు కనీసం అటువైపు చూడడం లేదు. స్థలం వద్ద చిన్న బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు. సెల్లార్ కోసం రాళ్లు పగులగొడుతున్నా... భూమిని చదును చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఈ స్థలంలో కొంత భాగం ప్రైవేటు వ్యక్తులదన్న కారణంతో ఇలా చేస్తున్నారు.

**చదరపు గజం రూ.3 లక్షలు..**

ఆక్రమిత స్థలం బంజారాహిల్స్‌లో లామాకాన్‌కు సమీపంలో ఉంది. ఇక్కడ చదరపు గజం విలువ రూ.3లక్షలు పలుకుతోంది. ఈ భవనాల మధ్యలో 400 గజాల ప్రభుత్వ భూమి ఉంది. కొన్నేళ్లుగా ఈ స్థలం ఖాళీగా ఉండగా.. కొద్దినెలల క్రితం ఓ రియల్ వెంచర్ సంస్థ ప్రతినిధులు రాత్రిరాత్రికి రేకులను ఏర్పాటు చేసి ఆ స్థలాన్ని మూసేశారు. పనులు చేసుకునేందుకు వీలుగా చిన్నగేటును ఏర్పాటు చేశారు. లోపల కాపలాదారును నియమించుకున్నారు. స్థానికుల్లో కొందరు రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా... షేక్‌పేట్ రెవెన్యూ అధికారులు వచ్చి ఖాళీ చేయాలంటూ హెచ్చరించారు. ఒకటి, రెండు రేకులను తొలగించి రహదారిపై బోర్డును ఉంచి వెళ్లిపోయారు.

**ఆదేశాలు బేఖాతర్.. వేగంగా పనులు**

రెవెన్యూ అధికారుల ఆదేశాలను పట్టించుకోకుండా రియల్ ప్రతినిధులు వేగంగా పనులు చేస్తున్నారు. నవంబరు తొలివారం నుంచి ఆ భూమిలోని బండరాళ్లను పగులగొట్టి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. నలుగురైదుగురు పనివాళ్లతో సెల్లార్ తవ్వేందుకు వీలుగా ఒకవైపు నుంచి బండరాళ్లను తొలిచేస్తున్నారు. బండరాళ్లను తొలగిస్తున్న అంశాన్ని కొందరు వ్యక్తులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. జూబ్లీహిల్స్ ఎన్నికల హడావుడిలో ఉన్నాం.. పూర్తయ్యాక కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎన్నికలు పూర్తయి నెలదాటుతున్నా.. అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కలెక్టర్ హరిచందనను వివరణ కోరగా.. ఇప్పటికే సదరు వ్యక్తులకు తాఖీదులు ఇచ్చామని, తాజా పరిస్థితుల ఆధారంగా చట్టపరంగా చర్యలు చేపట్టనున్నామని తెలిపారు.

# అందేనా సహకారం!



వికారాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా వికారాబాద్ జిల్లాలో 22 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పాలకవర్గాలను అధికారులు రద్దు చేశారు. 2025 ఫిబ్రవరి 15న గడువు ముగియడంతో పదవీ కాలం మరో ఆర్నెల్లు పొడిగించారు. ఆ గడువూ ముగియడంతో ఆగస్టు 15న.. మళ్లీ ఆర్నెల్లపాటు పొడిగిస్తూ ఉత్తర్వులొచ్చాయి. పొడిగింపు కాలం పూర్తి కాకుండానే ప్రస్తుతం రద్దు చేయడంతో ఇప్పటి వరకు కొనసాగిన పాలకవర్గాల సభ్యులు మాజీలయ్యారు. ఈ నేపథ్యంలో చాలామంది ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారు.


**ఇన్‌ఛార్జులుగా అధికారులు..**

సహకార కేంద్ర బ్యాంకు ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా కలెక్టర్లకు బాధ్యతలు అప్పగించాలని ఉత్తర్వులిచ్చారు. వికారాబాద్ జిల్లాలోని సహకార సంఘాలు ఉమ్మడి రంగారెడ్డిలో కొనసాగుతుండటంతో ఆ జిల్లా కలెక్టర్‌కే బాధ్యతలు అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు. సహకార సంఘాలకు ఇన్‌ఛార్జులుగా సహకార శాఖకు సంబంధించి అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, సీనియర్ ఇన్‌స్పెక్టర్లకు బాధ్యతలు అప్పగించేందుకు కసరత్తు పూర్తి చేశారు.

**ఆశావహుల ఆసక్తి..**

జిల్లాలో 22 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 2020 ఫిబ్రవరి 15న ఎన్నికలు నిర్వహించారు. వాటిలో మూడు ఏకగ్రీవం కాగా.. ఎన్నికలు జరిగిన 19 సహకార సంఘాల్లోనూ భారాస విజయం సాధించింది. ఇటీవల సర్పంచి ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులు అధిక స్థానాలు గెలుపొందారు. దీంతో సహకార సంఘాలకు త్వరలోనే ఎన్నికలు నిర్వహించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆశావహులు ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల జరిగిన స్థానిక పోరులో రిజర్వేషన్లు అనుకూలించని వారు, ఓడిపోయిన అభ్యర్థులు సహకార సంఘాల ఎన్నికల్లో పోటీకి సమాయత్తమవుతున్నారు.

# సమస్యలతో శి'వార్'



హైదరాబాద్ : జీహెచ్‌ఎంసీలో శివారు ప్రాంతాల విలీనం.. వరమా, శాపమా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవలివరకు అందుబాటులో ఉన్న పౌరసేవలు.. విలీనంతో దూరమయ్యాయి. పారిశుద్ధ్యం పడకేయడంతో కాలనీల్లో చెత్త కుప్పలు పెరిగిపోతున్నాయి. వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయట్లేదు. సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే.. జీహెచ్‌ఎంసీ నుంచి నిధులు, సిబ్బంది వచ్చాకే వాటిని పరిష్కరిస్తామంటూ చేతులెత్తేస్తున్నారు. దీంతో శివారులోని 27 పట్టణ స్థానిక సంస్థల(యూఎల్‌బీ) ప్రజలు మూడు వారాలుగా నరకం చూస్తున్నారు.

**కరవైన అధికారుల సమీక్ష**

గ్రేటర్‌లో 27 స్థానిక సంస్థలు డిసెంబరు 3న విలీనమయ్యాయి. అదేరోజు జీహెచ్‌ఎంసీ అధికారులు దస్త్రాల స్వాధీనంతోపాటు బ్యాంకు ఖాతాలను సీజ్ చేశారు. ఆయా యూఎల్‌బీలను సర్కిళ్లుగా.. మున్సిపల్ కమిషనర్లను డిప్యూటీ కమిషనర్లుగా పేర్కొంటూ ఉత్తర్వులిచ్చారు. అప్పటి నుంచి కమిషనర్ ఒక్కసారి కూడా సర్కిళ్ల గురించి పట్టించుకోలేదనేవిమర్శలొస్తున్నాయి. జోనల్ కమిషనర్లు కూడా సమీక్ష సమావేశం నిర్వహించలేదు.

**నిలిచిన పౌర సేవలు**

బండ్లగూడ జాగీర్ సర్కిల్‌లోని గంధంగూడ వెంకటేశ్వరకాలనీ ఆర్నెల్లుగా చీకట్లో మగ్గుతోంది. సమస్యను పరిష్కరించాలని స్థానికులు తాజాగా కమిషనర్‌కు విన్నవిస్తే.. జీహెచ్‌ఎంసీ నుంచి లైట్లు వస్తే తప్ప పరిష్కరించలేమంటూ చేతులు దులిపేసుకున్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీ సమీపంలోని స్నేహితహిల్స్, బండ్లగూడ జాగీర్, కిస్మత్‌పూర్, హైదర్‌షాకోట్, గంధంగూడ, బైరాగిగూడ ప్రాంతాల్లో అడుగడుగునా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి.

బడంగ్‌పేట్, ఆదిభట్ల, దమ్మాయిగూడ, జవహర్‌నగర్, అమీన్‌పూర్, నార్సింగి, ఇతరత్రా మున్సిపాలిటీల్లోనూ పరిస్థితి దారుణంగా ఉంది. పురోగతిలోని ఇంజినీరింగ్ పనులూ నిలిచిపోయాయి. పారిశుద్ధ్యం దారుణంగా తయారైంది.


జీహెచ్‌ఎంసీ పరిధిలో స్వచ్ఛ ఆటోలు వ్యర్థాలను సేకరిస్తాయి. మున్సిపాలిటీ సొంత వాహనాలు చెత్త సేకరణ చేపడతాయి. డీజిల్ కూపన్లు జారీకాకపోవడంతో వారం రోజులుగా వాహనాలు విధులకు వెళ్లట్లేదు. గ్రేటర్‌లో మురుగునీటి నిర్వహణ పనులను జలమండలి నిర్వర్తిస్తుంది. విలీనం నేపథ్యంలో ఆ బాధ్యతను ఇకపై ఎలా కొనసాగించాలో తెలియక సర్కిళ్ల కమిషనర్లు అయోమయంలో పడ్డారు.

# అడుగేస్తాం.. అడ్డుకునేదెవరు!

జిన్నారం: అత్యంత విలువైన ప్రాంతం.. ఓఆర్ఆర్‌కు కేవలం 50 మీటర్ల లోపులోనే.. ఎగ్జిట్ పాయింట్‌కు సమీపంలో ఉంటుంది. చుట్టూ బహుళ అంతస్తుల భవనాలున్నాయి. హైదరాబాద్ మహానగర శివారులోని జిన్నారం మండలం ఖాజీపల్లి రెవెన్యూ పరిధి.. సర్వే నంబరు 181లోని మూడు ఎకరాల స్థలమది. విలువైన ఆ భూమిపై కొందరు అక్రమార్కుల కన్నుపడింది. ఇప్పటికే రెండు పర్యాయాలు అక్కడ రాత్రికి రాత్రి వెలసిన కొన్ని నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. అయినా కొందరు కబ్జా ప్రయత్నాలు ఆపటం లేదు.

**సూచికలు లేవెందుకు?**అధికారులు అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటూ రెండు పర్యాయాలు కూల్చివేశారు. కొందరిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. రూ.70 కోట్ల విలువైన భూమిని మళ్లీ ఆక్రమిస్తున్నా.. 'ఇది ప్రభుత్వ స్థలమని' అధికారులు సూచికలు ఎందుకు ఏర్పాటు చేయలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల తీరుపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చుట్టు కందకం తవ్వి.. ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే విలువైన స్థలాన్ని రక్షించినట్లు అవుతుందని సూచిస్తున్నారు. **కూల్చివేసినా.. మళ్లీ అదేతీరు**ఖాజీపల్లికి మూడు కిలోమీటర్ల దూరంలోని ఈ స్థలం గజం విలువ రూ.50 వేలకు పైగా ఉంటుంది. మూడు ఎకరాల విలువ రూ.70 కోట్లకు పై మాటే.

కొందరు స్థలాన్ని కబ్జా చేస్తూ.. తాత్కాలిక నిర్మాణాలు చేపట్టగా.. ఇటీవల అధికారులు రెండు సార్లు కూల్చివేశారు. ఇప్పుడు మళ్లీ ఆక్రమణ యత్నం



యథేచ్ఛగా కొనసాగుతోంది. గ్రామానికి చెందిన 15 మంది యువకులు ఇటీవల రెవెన్యూ అధికారులకు ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. దీంతో అదే గ్రామంలోని కొందరు వారిని బెదిరించే ప్రయత్నం చేశారు. ఓ ప్రజాప్రతినిధి కుమారుడి హస్తం ఉందనే ఆరోపణలున్నాయి. అగ్నిమాపక కేంద్రానికి కేటాయించాం– దేవదాసు, తహసీల్దార్, జిన్నారంఖాజీపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని 3 ఎకరాల ప్రభుత్వ భూమిని అగ్నిమాపక కేంద్రానికి కేటాయించాం. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా.. ఆక్రమణలు అడ్డుకుంటాం. ఇప్పటికే కూల్చివేతలు చేపట్టి.. క్రిమినల్ కేసులు నమోదు చేయించాం. కొత్తగా ఏర్పాటు చేసిన నిర్మాణాల గురించి సమాచారం లేదు.

## హరిత ఇంధనం.. భవితకు ఆశాకిరణం

సంగారెడ్డి : హరిత ఇంధన(గ్రీన్ ఎనర్జీ) ఉత్పత్తి, వినియోగాన్ని మరింత పెంచే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలోనే విద్యార్థులకు దీనిపై పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తారు. యువత నైపుణ్యాల పెంపునకు సైతం సన్నాహాలు చేపడుతోంది. ఇందుకు రాష్ట్ర ఇంధనశాఖ ప్రతిపాదనలు చేస్తోంది. దీనికి సంబంధించిన పాఠ్యాంశాలు చేర్చాలని భావిస్తోంది.

**బోధకులకు శిక్షణ..** హరిత ఇంధనం(గ్రీన్ కరిక్యులం)ని తయారు చేసి బోధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నారు. పాఠశాల విద్యార్థులకు ఇంధన వినియోగం, తయారీ, వాడకం వంటి విషయాలపై పాఠ్యాంశాల ద్వారా అవగాహన కల్పిస్తారు. బోధకులకు శిక్షణ ఇచ్చి కళాశాల నుంచి డిగ్రీ పట్టాలు పట్టుకుని వచ్చే యువతకు హరిత ఇంధన రంగంలో ఉపాధి కల్పించేలా ప్రణాళికలు చేపట్టనున్నా



రు. సౌర, విద్యుత్తు తయారీ, వాటి పొదుపు పద్ధతులను ప్రోత్సహించడం వంటి విషయాలపై ప్రధానం ఇంధన శాఖ దృష్టిసారించింది.

**లక్ష్యాల నిర్దేశం..** ఇళ్లపై ఏర్పాటు చేసే సౌరఫలకాలను ఏర్పాటు చేసేలా లక్ష్యాలను నిర్దేశించనున్నారు. చౌకగా లభించే సౌర విద్యుత్తును ప్రతి ఒక్కరు తయారు చేసి వినియోగించేలా పాఠ్యాంశాల ద్వారా అవగాహన కల్పించనున్నారు. సౌర, పవన విద్యుత్తు ప్లాంట్ల నిర్వహణకు శిక్షణ పొందిన యువత కొరత ఉంది. వీటిలో గ్రామాల యువతను భాగస్వామ్యం చేస్తూ వారికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోనున్నారు. ఇందుకు అనుమతించాలని కోరుతూ రాష్ట్ర ఇంధన శాఖ కేంద్ర మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపించారు. వీటికి ఆమోదం లభిస్తే 2030 నాటికి ప్రతి పంచాయతీ, మున్సిపాలిటీలకు హరిత ఇంధన వినియోగంపై లక్ష్యాలను నిర్దేశిస్తారు. ఇవన్నీ సాధించడానికి పాఠశాలలు, కళాశాలలు గ్రీన్ కరిక్యులం చేపట్టడం తప్పనిసరని ఇంధన శాఖ నిర్ణయించింది.

## గొంతు తడపని అమృత ధార

సంగారెడ్డి : పురపాలికల్లోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని నాలుగు పురపాలికలకు రూ.కోట్లలో నిధులు కేటాయించింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో క్షేత్రస్థాయిలో పనుల పురోగతి ఆశించిన స్థాయిలో లేదు. కొన్ని నెలలుగా నిలిచిపోయాయి. ట్యాంకులు, పైపులైన్లు నిర్మించి పట్టణ ప్రజలకు శుద్ధమైన నీటిని అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ప్రజారోగ్యశాఖకు పనుల పర్యవేక్షణ బాధ్యత అప్పగించారు.

**జిల్లా కేంద్రంలోనూ నిర్లక్ష్యం**

సంగారెడ్డి పట్టణానికి అమృత్ 2.0 కింద రూ.44.01 కోట్ల నిధులు కేటాయించారు. ప్రశాంత్ నగర్, మంజీరా ఆసపత్రి ఏరియా, శిల్పా వెంచర్, చింతల్‌పల్లి, ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఐదు మంచినీటి ట్యాంకులు నిర్మించాలి. ప్రశాంత్ నగర్‌లో పిల్లర్ల వరకు మాత్రమే పనులు పూర్తయ్యాయి. 51.91కి.మీ. పైప్‌లైన్ వేయాల్సి ఉంది.

**మిగతా పట్టణాల్లో..**సదాశివపేట పట్టణానికి రూ.8.50 కోట్లు



కేటాయించారు. రెండు తాగునీటి ట్యాంకులు నిర్మించాల్సి ఉంది. 7.56 కి.మీ. పైపులైన్ పనుల ముందుకు సాగడం లేదు.

జహీరాబాద్ పూర్తి పట్టణానికి సరిపడా తాగునీరు అందించాలనే ఉద్దేశంతో చేపడుతున్న అమృత్ నీటి పథకం పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. రూ.66 కోట్లు మంజూరు చేశారు. రెండేళ్లయినా 35 శాతం పనులు మాత్రమే పూర్తి చేశారు. నారాయణఖేడ్‌కు రూ.13.5 0 కోట్లు కేటాయించారు. 1550 మి.లీ. సామర్థ్యం కలిగిన మూడు మంచినీటి ట్యాంకులు, 14 కి.మీ. పైప్‌లైన్ పనులు చేయాల్సి ఉంది. ఆరు నెలల క్రితం పనులు ప్రారంభమైనా.. మధ్యలో నిలిచిపోయాయి. ఇటీవలే మళ్లీ ప్రారంభించారు.

**పనులు వేగవంతం చేస్తాం**–తిరుపతిరావు, ఈఈ, ప్రజారోగ్య శాఖ

జిల్లాలోని నాలుగు పురపాలికల్లో అమృత్ 2.0 పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటాం. ఈ పథకం పనులు ఇటీవలే మళ్లీ ప్రారంభమయ్యాయి. ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు త్వరితగతిన జరిగేలా చూస్తాం.

## 'అద్దె'కు మంగళం.. సర్దుబాటు శరణ్యం

సిద్దిపేట : జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి కార్యాలయం సిద్దిపేటలో అద్దెపై కొనసాగుతోంది. మొత్తం నాలుగు గదులు ఉన్నాయి. శిథిలావస్థకు చేరిన ఈ భవనానికి ప్రతి నెలా రూ.5,315 చెల్లిస్తున్నారు. బీటలువారిన పరిస్థితుల్లో ఉంది. వాన పడితే ఉరుస్తోంది. భవనం మారాలనే ప్రతిపాదన ఉంది. మరోవైపు నిర్వహణకు అనువైన సర్కారు భవనం లభిస్తుందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. జిల్లాలో అనేక ప్రభుత్వ శాఖల కార్యాలయాలు అద్దెపై నిర్వహిస్తున్నారు. కనీస వసతులు కరవయ్యాయి. ఉద్యోగులు ఏళ్లుగా ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ తరుణంలోనే అద్దె భవనాల్లో కొనసాగుతున్న అన్ని శాఖల కార్యాలయాలను ఈ నెల 31 లోపు ఖాళీ చేసి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలంటూ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. మెజార్టీవంతున సొంత భవనాల్లో నిర్వహిస్తున్నారు. మిగిలిన వాటికి సంబంధించి శాఖలు అనుబంధంగా, ప్రభుత్వ సంబంధిత భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, ఎక్కడో ఓ చోట సర్దుబాటు చేయగా కొనసాగుతున్నాయి. మరికొన్ని చోట్ల మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. **మరికొన్ని ఇలా..**హుస్నాబాద్‌లో నీటి పారుదల డివిజన్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. అవసరాలకు సరిపడా లేదు. అక్కన్నపేటలోని వ్యవసాయ అధికారి కార్యాలయం పరిస్థితి అంతే. మిరుదొడ్డిలోని ఆబ్కారీ సీఐ కార్యాలయం, రాయపోల్ మండలంలో పోలీసు ఠాణా, ఎంపీడీవో, కొమురవెల్లి, ధూళ్మిట్టలో తహసీల్, చేర్యాల ఐసీడీఎస్, రవాణా శాఖ యూనిట్, ఆబ్కారీ శాఖ సీఐ కార్యాలయాలు ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్నారు. వైద్యారోగ్య శాఖ పరిధిలో ఆరోగ్య ఉపకేంద్రాలు 75, ఒక యూపీహెచ్‌సీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఆదేశాలు రాలేదని జిల్లా వైద్యాధికారి ధనరాజ్ వెల్లడించారు.

ఎలా సర్దుబాటు చేస్తారో?అద్దె సొమ్ము సకాలంలో విడుదల కాకపోవడంతో మరో చోటికి వెళ్లేందుకు సంశయించాల్సిన పరిస్థితి తలెత్తింది. సర్కారు తీసుకున్న తాజా నిర్ణయంతో వెంటనే సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు.

చురకలు



# పీలిస్తే చిత్తు.. తరలిస్తే ఉచ్చు

వికారాబాద్ :ఈ ఏడాది ఫిబ్రవరి 12న కర్ణాటక నుంచి హైదరాబాద్ నగరానికి ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా.. పరిగి పట్టణ పరిసరాల్లో 3.25 కిలోల గంజాయి పట్టుకొని ఎక్సైజ్ పోలీసులు ఇద్దర్ని రిమాండ్‌కు పంపారు.

పరిగి మండలం లక్ష్మీదేవిపల్లి గేటు సమీపంలో పరిగికి చెందిన ఒకరు, రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన మరో యువకుడి వద్ద కలిపి 260 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఏపీ రాష్ట్రం విశాఖ నుంచి వికారాబాద్ వైపు వస్తున్న రైలులో గతనెల 9న గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారంతో ఆబ్కారీ అధికారులు అప్రమత్తమయ్యారు. వికారాబాద్ రైల్వే ఆసుపత్రి సమీపంలో 26 కిలోల ఎండు గంజాయిని అధికారులు స్వాధీనపర్చుకున్నారు. యువత చెడు అలవాట్లకు బానిసవుతోంది. క్షేత్రస్థాయిలో సరైన దిశా నిర్దేశం లేకపోవడంతో ప్రభావం ఆయా కుటుంబాలపై పడుతోంది. ముఖ్యంగా 20–25 ఏళ్ల వయసువారే గంజాయి తరలిస్తూ కేసుల్లో ఇరుక్కుంటున్నారు. పీలుస్తూ మత్తులో జోగుతున్నారు. నిత్యావసర సరకులు, ఇతర వస్తువుల మాటున దందా సాగిస్తున్నారు. ఇటీవల ఒక్క పరిగి ప్రాంతంలోనే మూడు కేసులు నమోదయ్యాయి. అయిదుగురి నుంచి 3.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారులు జిల్లావ్యాప్తంగా ఏడాదిలోనే 85 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకుని 23 మందిపై కేసులు పెట్టారు.

**జిల్లా, రాష్ట్ర సరిహద్దుల నుంచి..**

గంజాయి చాలావరకు కర్ణాటక రాష్ట్రం నుంచి జిల్లాకు సరఫరా అవుతోంది. కొం దరు స్వార్థపరులు అమాయకులనే లక్ష్యంగా చేసుకుంటున్నారు. ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షి



స్తున్నా విక్రయాలకు అడ్డుకట్ట పడటం లేదు. పరిగి, వికారాబాద్, మోమిన్‌పేట, తాండూరు, బషీరాబాద్ తదితర ప్రాంతాల్లో తరచూ కేసులు నమోదవుతున్నాయి. రైలు సదుపాయమూ ఉండటంతో తాండూరు, వికారాబాద్ మీదుగా రవాణా అవుతోంది. పొరుగు జిల్లా సంగారెడ్డిలోనూ కేసులు కలకలం రేపుతున్నాయి. రంగారెడ్డి జిల్లా బాలానగర్ ప్రాంతంలోని పరిశ్రమల్లో వేల సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారు. పరిగికి తక్కువ దూరం కావడంతో అక్కణ్నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

**చాక్లెట్ల రూపంలోనూ..**

గంజాయిని చాక్లెట్ల రూపంలో అమ్ముతున్నారు. నాలుగు నెలల కిందట రంగారెడ్డి జిల్లా కొందర్గు నుంచి తెచ్చి పరిగిలో విక్రయిస్తున్నట్లు అనుమానం రావడంతో కొందరు కట్టడికి కృషి చేశారు. విషయం తెలుసుకున్న వ్యాపారులు వెనక్కి తగ్గారు. పోలీసు, ఆబ్కారీ అధికారులు తనిఖీలు విస్తృతం చేసి అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

# శివారు..సమస్యలతో బేజారు



పెద్దపల్లి : మురుగు కాలువల నిర్మాణం ప్రధాన వీధులకే పరిమితం కావడంతో శివారు కాలనీవాసులకు కష్టాలు తప్పడం లేదు. జిల్లా కేంద్రంలోని ప్రతీ కాలనీలో మురుగు కష్టాలు వెంటాడుతున్నాయి. శాంతినగర్ నుంచి రంగంపల్లి రాజీవ్ రహదారి వెంట విస్తరించిన కాలనీలన్నింటిలో మురుగు నీటి వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఇళ్ల మధ్యే నీటి గుంతలు ఏర్పడుతున్నాయి.

రోడ్లు ఊడ్చటం, ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించడమే పురపాలిక బాధ్యతగా భావిస్తుండటంతో పట్టణంలోని పలు కాలనీవాసులు మురుగు, దుర్గంధంతోనే సహవాసం చేస్తున్నారు. వివిధ కాలనీల్లో సీసీరోడ్లు నిర్మించి, మురుగు కాలువలు నిర్మించకపోవడంతో కాలనీల్లోని ఓపెన్ ప్లాట్లు మురుగు కూపాలవుతున్నాయి. ఎవరి ఇంటి ముందు వారే మురుగు కాలువ నిర్మించుకోవడంతో ఇళ్లు కట్టుకోనివారి ప్లాట్లలోని నీరు చేరుతోంది. అక్కడి నుంచి కచ్చా కాలువ తీసినా నీటిని ఎటు పంపించాలో తెలియని పరిస్థితి మున్సిపాలిటీకి ఏర్పడింది. టీచర్స్‌కాలనీ రైల్వే ట్రాక్‌వైపు ఉన్న వ్యవసాయ భూముల్లోకి మురుగు రాకుండా భూముల యజమానులు అడ్డుకోవడం సమస్యను మరింత తీవ్రతరం చేసింది. ఈ కాలనీలో కొన్ని వీధులకు సరైన రహదారి లేకపోవడంతో రాత్రిళ్లు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

శాంతినగర్‌లో మురుగు నీటి కాలువల పరిస్థితి దయనీయంగా ఉంది. ముఖ్యంగా ఐటీఐ వెనక వైపు, ఎఫ్‌సీఐ గోదాంల ప్రాంతంలోని వీధుల్లో సీసీరోడ్లు నిర్మించిన పురపాలిక అధికారులు మురుగు కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగంతా ఇళ్ల మధ్య ఖాళీ ప్రాంతాల్లోకి చేరుతోంది. ఇక్కడ రైల్వేట్రాక్‌కు సమాంతరంగా భారీ మురుగు కాలువ నిర్మించి నీటిని మంథని పాత గేటు సమీపంలోని కల్వర్టులోకి మళ్లిస్తే సమస్య తొలగిపోనుంది

రైల్వే ట్రాక్ వెంట విస్తరించిన భూంనగర్, నారాయణస్వామి నగర్‌లలో స్థానికులకు మురుగు నీటి కష్టాలు తప్పడం లేదు. ఈ ప్రాంతంలో కొన్ని వీధులకు సరైన రహదారులు లేవు.

వైష్ణవి కాలనీ, చైతన్య కాలనీ, లక్ష్మీ నగర్, ఆర్ఆర్ గార్డెన్స్ ప్రాంతాల్లో మురుగు కష్టాలు ప్రజలను వెంటాడుతున్నాయి.

# సాగు సుస్థిరం.. సేవలు విస్తృతం



జగిత్యాల : భారత 5వ ప్రధాని, రైతు నాయకుడు చౌదరీ చరణ్‌సింగ్ వ్యవసాయ రంగానికి అందించిన సేవలకు గుర్తుగా ఆయన జయంతిని పురస్కరించుకొని డిసెంబరు 23న ఏటా జాతీయ రైతు దినోత్సవంగా జరుపుకొంటున్నారు. ఈ ఏడాది 'సుస్థిర వ్యవసాయం.. రైతులను శక్తిమంతం చేయడం' అన్న అంశంతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ రంగంలో తక్షణ అవసరాలపై కథనం.

**ఈ–నామ్ విస్తరణతో గిట్టుబాటు**

తొమ్మిదేళ్ల కిందట ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన మండలాల్లో వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అన్నింటినీ ఎఫ్‌పీవోలు(రైతు ఉత్పాదక సంస్థలు)గా మార్చి కేంద్ర, రాష్ట్ర నిధులతో సేవలు విస్తృతం చేయాలి.

ప్రధానమంత్రి ఫసల్ బీమా అమలు చేస్తే ప్రకృతి విపత్తులతో మామిడి, వరి తదితర పంటలకు నష్టం వాటిల్లినప్పుడు అన్నదాతకు ఆర్థిక ఆసరాగా ఉంటుంది.మల్లాపూర్ మండలం ముత్యంపేటలోని చక్కెర కర్మాగారాన్ని తెరిపించాలి. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌లో రూ.7 కోట్లతో నిర్మిస్తున్న విత్తన శుద్ధి కర్మాగారం పనులు పూర్తి చేసి వరి విత్తనోత్పత్తి చేపట్టే రైతులకు అందుబాటులోకి తేవాలి.

జాతీయ వ్యవసాయ మార్కెట్లతో స్థానిక మార్కెట్లను అనుసంధానించే ఈ–నామ్‌ను ఉమ్మడి జిల్లాలోని దాదాపు 25 మార్కెట్లకు విస్తరిస్తేనే అన్నదాతలకు గిటుబాటు ధరలు అందుతాయి.

ఉమ్మడి జిల్లాలో 1.93 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నా ఉద్యాన పరిశోధన స్థానం లేక రైతులకు సలహాలు అందడం లేదు. జగిత్యాల లేదా కరీంనగర్ జిల్లాల్లో ఉద్యాన పరిశోధన స్థానం ఏర్పాటు చేయాలి.

ఐసీఏఆర్, రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో రైతు విజ్ఞాన కేంద్రాలు, జగిత్యాల జిల్లా మల్యాలలో ఉద్యాన కేవీకే, పొలాసలో ఆవాల పరిశోధన కేంద్రం ఏర్పాటుతో అన్నదాతకు మేలు చేకూరుతుంది.

**అనుబంధం.. బలోపేతం**

నాలుగు జిల్లాల్లో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, ఫుడ్ పార్కులు ఏర్పాటు చేయాలి. గతంలో మాదిరిగా అన్ని రకాల కూరగాయలు, ఆరుతడి పంటల విత్తనాలు, యంత్ర పరికరాలను రాయితీపై సరఫరా చేస్తే రైతులకు ఆసరాగా ఉంటుంది. మార్కెట్లో ధరలు తగ్గినపుడు పంట ఉత్పత్తులను ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేసేలా వ్యవసాయ ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తే అండగా ఉంటుంది. రైతులు అన్ని రకాల పంటలు సాగు చేసేలా మద్దతు ధరల కల్పన, పంట కాలనీల ఏర్పాటు, బోనస్ వర్తింపు తదితర పథకాలతో ఊతమివ్వాలి. ఉపాధిహామీ అనుసంధానంతో కూలీల కొరత సమస్య తీరుతుంది. పాడి, పట్టు, కోళ్లు, జీవాలు, చేపలు, తేనెటీగల పెంపకం వంటి అనుబంధ పరిశ్రమలకు రాయితీ పథకాలు వర్తింపజేస్తే వ్యవసాయం లాభసాటిగా మారుతుంది.

# న్యాక్ గ్రేడింగ్‌కు ఆచార్యుల అవసరం




హైదరాబాద్: విశ్వవిద్యాలయాలకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించేందుకు అవసరమైన న్యాక్ గ్రేడింగ్‌కు కేంద్ర విద్యాశాఖ సహకరించాలని నగరంలోని వర్సిటీల ఉన్నతాధికారులు కోరారు. ప్రతి 15 మంది విద్యార్థులకు ఒక ఆచార్యుడు చొప్పున ఉండాలన్న నిబంధనను పాటించాలంటే అవసరమైన సంఖ్యలో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు లేరని అధికారులు చెబుతున్నారు. కొద్దిరోజుల క్రితం హైదరాబాద్ వచ్చిన న్యాక్(నేషనల్ అసెస్‌మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్) ఛైర్మన్ ప్రొఫెసర్ అనిల్ డి.సహస్రబుద్దేను కలిసి ఈ మేరకు అభ్యర్థించారు. న్యాక్ గ్రేడింగ్ తక్కువగా ఉంటే భవిష్యత్తులో ఉన్నత విద్యకోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయని, ప్రభుత్వ రంగ సంస్థలు, బహుళజాతి సంస్థలు పరిశోధనలపై సంయుక్త ఒప్పందాలు కుదుర్చుకునేందుకు రావని వివరించారు.**పరిశోధనలు..** ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం.. జాతీయ స్థాయిలో విశ్వవిద్యాలయాలకు గుర్తింపు, న్యాక్‌గ్రేడింగ్ లేకపోతే వాటిలో చదువుకుంటున్న విద్యార్థులకు, పీహెచ్‌డీ పరిశోధకుల ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం ఉంటుంది. సైన్స్ విభాగాల్లో శాశ్వత అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు తక్కువమంది ఉండటంతో బహుళజాతి సంస్థలు వీరితో సంయుక్తంగా పరిశోధనలు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఓయూలో ఒక బహుళజాతి సంస్థ రూ.10 కోట్లతో పరిశోధన ప్రాజెక్టు నిర్వహించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ... ఆ విభాగంలో ప్రొఫెసర్లు లేకపోవడంతో చివరి నిమిషంలో మరో వర్సిటీని ఎంపిక చేసుకుంది. జేఎన్‌టీయూలో సంయుక్త పరిశోధనలకు ఒక విదేశీ వర్సిటీ ముందుకొచ్చినా.. సాంకేతిక కారణాలతో ఆ పరిశోధనలు తాత్కాలికంగా ఆగిపోయాయి. న్యాక్ గ్రేడింగ్ లభించాలంటే విద్యార్థులు, ఆచార్యుల నిష్పత్తికి కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లనూ పరిగణనలోకి తీసుకుంటామని న్యాక్ అధికారులు కొంత భరోసా ఇచ్చారని జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ఒకరు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు న్యాక్ బృందాలు వర్సిటీల్లో పర్యటించనున్నాయి.

వర్సిటీల వారీగా ఒప్పంద సహాయ ప్రొఫెసర్ల ఖాళీలు

ఉస్మానియా 220 మహిళా 120

జేఎన్‌టీయూ 140

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 21

సురవరం ప్రతాపరెడ్డి 15

# ఆ మలుపుల్లో.. పిలుపులే..!

భువనగిరి: ప్రధాన రహదారుల్లో ఉండే మూల మలుపుల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కన్పించక పదుల సంఖ్యలో ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. హెచ్చరిక బోర్డులు, సూచికలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. జిల్లాలోని ప్రధాన రహదారులపై ప్రమాదకర మూలమలుపులను పరిశీలించింది.

భువనగిరి మండలం వడపర్తి వద్ద పదేళ్ల క్రితం గజ్వేల్ నుంచి భువనగిరి వైపు రెండు ద్విచక్ర వాహనాలపై వస్తున్న నలుగురిని ఫంక్షన్ హాలు సమీపంలోని మలుపు వద్ద లారీ ఢీకొట్టడంతో ముగ్గురు మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గతేడాదిలోనే మండలంలోని పలు మలుపుల వద్ద మొత్తం 76 రోడ్డు ప్రమాదాలు జరిగి 28 మంది మృతి చెందగా 49 మంది తీవ్ర గాయాలపాలయ్యారు.

యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట–గౌరాయిపల్లి, మాసాయిపేట–సైదాపురం, పాతగుట్ట–గొల్లగూడెం మధ్య ఉన్న మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. పదేళ్లలో ఐదుగురు మృత్యువాత పడ్డారు. తుర్కపల్లి మండలం భువనగిరి జాతీయ రహదారిపై సంగ్యతండా, జేతురాంతండా, వాసాలమర్రి, తిర్మలాపురం వద్ద ఉన్న మలుపులు ప్రాణాలు తీస్తున్నాయి. కీసర–యాదగిరిగుట్ట రోడ్డులో మల్కాపురం, బద్దుతండా, వెంకటాపురం శివారులోని మలుపు రోడ్డులో ప్రయాణికు



లు ఇబ్బందులు పడుతున్నారు.

వలిగొండ మండల కేంద్రంలోని వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గల మూల మలుపు వద్ద అనేక సార్లు లారీలు అదుపుతప్పి పల్టీకొట్టిన ఘటనలు చోటు చేసుకున్నాయి. రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామ పరిధిలో మూలమలుపు వద్ద సుమారు పదేళ్ల క్రితం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ఘోర ప్రమాదంలో 15 మంది అక్కడికక్కడే మృతి చెందగా.. పలువురు తీవ్ర గాయాల పాలయ్యారు.

బొమ్మలరామారం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే మార్గంలోని మైసిరెడ్డిపల్లి గ్రామం వద్ద ఉన్న మలుపు వద్ద నాలుగు సంవత్సరాల క్రితం జరిగిన ప్రమాదంలో నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. ప్యారారం – సోలీపేట గ్రామాల మధ్యలో మలుపు వద్ద ప్రమాదాలు జరిగి పలువురు మృతి చెందారు.

# అనగనగా ఓ కోతి.. చెప్పింది నీతి

మిర్యాలగూడ : 'ప్లీజ్ సేవ్ ద ట్రీ'.. అని రాసి ఉన్న ప్లకార్డును చేతులతో పట్టుకుని ప్రదర్శిస్తున్న కోతిని చూసి రోడ్డుపై వెళ్లే వారందరూ నవ్వుతూ ఉంటారు. దీంతో లాభం లేదని..ఆ కోతి రోజుకో మొక్క చొప్పున నాటుతూ.. ఒక అడవినే సృష్టించి..అందులోనే ఓ చెట్టు కింద సేద తీరుతుండగా..కొందరు వచ్చి ఆ కోతిని లోయలో పడేసి.. చెట్లు మొత్తం నరికి తీసుకెళ్తారు. అడవి మొత్తం ఎడారిలా మారిపోతుంది. కొన్నేళ్ల తర్వాత ప్రజలందరూ ఆక్సిజన్ మాస్కులు, సిలిండర్లతో తిరుగుతుంటారు. ఏఐ ద్వారా రూపొందించి ఇటీవలి కాలంలో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఓ వీడియో సారాంశమిది. జిల్లా ఉన్నతాధికారుల నుంచి.. సాధారణ ప్రజలు ఎంతో మంది ఈ వీడియోనే షేర్ చేస్తున్నారు.

ఇది కేవలం వీడియో మాత్రమే కాదు. పర్యావరణం పట్ల నేటితరం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యంతో పాటు.. ఇది ఇలాగే కొనసాగితే భావితరాల పరిస్థితి ఏమిటనేది కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో సైతం ఇటీవలి కాలంలో అభివృద్ధి, రహదారుల విస్తరణ, పరిశ్రమల నిర్మాణం పేరుతో భారీ వృక్షాలను నిమిషాల్లో నరికి పారేస్తున్నారు. నరికిన చెట్ల స్థానంలో ఎటువంటి ప్రత్యామ్నాయ



చర్యలు చేపట్టకపోవడం.. జనాభా విపరీతంగా పెరుగుతుండటంతో ప్రజలకు ప్రాణ వాయువు అందే పరిస్థితులు దూరమవుతున్నాయి.

**జిల్లాలో ఆందోళనకరం**

ఉమ్మడి జిల్లాలో గాలి నాణ్యత రోజురోజుకూ క్షీణిస్తోంది. ఈ నెలలో 20 రోజుల క్రితం ఉన్న నాణ్యత సూచీ(ఏక్యూఐ)లో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. సాధారణంగా శీతాకాలంలో గాలి నాణ్యత క్షీణిస్తుంది కానీ.. ఈ స్థాయిలో క్షీణించడానికి వాతావరణ కాలుష్యమే ప్రధాన కారణమని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. చెట్లను పెంచకపోవడం.. ప్లాస్టిక్ విచ్చల విడిగా వాడటం..పంట పొలాలకు అధికంగా రసాయనాలు పిచికారీ చేయడం, భూగర్భ జలాలు పరిమితికి మించి తోడెయ్యడం, వాహనాల అధిక వినియోగం, అధికంగా ఎలక్ట్రానిక్ పరికరాల వాడకం, పంట కొయ్యల కాల్చివేత తదితర కారణాలతో పర్యావరణం కలుషితం అవుతుందని పర్యావరణ వేత్తలు వాపోతున్నారు.ఇప్పటికైనా ప్రజలు బాధ్యతగా వ్యవహరించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరుతున్నారు.

# తర'గని'.. సిరుల వేణి

గోదావరిఖని: 136 ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణి బొగ్గు ఉత్పత్తిలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంది. కార్మికుల పని నైపుణ్యంతో మరో వందేళ్ల భవిష్యత్తుకు ప్రణాళికలు రచించుకుంటోంది. ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక ప్రగతికి దారులు, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సామాజిక బాధ్యతను విస్మరించకుండా తనదైన శైలిలో సంస్థ సాగుతోంది. 137వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కథనం.

**100 మిలియన్ టన్నుల లక్ష్యం**

అంచెలంచెలుగా ఎదుగుతూ వస్తున్న సింగరేణి.. రానున్న కాలంలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించే దిశగా ప్రణాళికలు చేసుకుంటోంది. అందుకు అవసరమైన గనులను విస్తరించుకుంటూ ముందుకు సాగుతోంది. ఒడిశాలో నైనీ బొగ్గు బ్లాకుతోపాటు రామగుండంలో మెగా ఓసీపీ ఏర్పాటు ద్వారా లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకుంది.

**విద్యుత్తు ఉత్పత్తి రంగంలో..**

ఇప్పటికే 1200 మెగావాట్ల థర్మల్, 300 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్న సింగరేణి కొత్తగా ఒడిశా రాష్ట్రంలోని నైనీలో 2000, రాజస్థాన్‌లో 2000 మెగావాట్ల థర్మల్, మరో 1500 మెగావాట్ల సోలార్ విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేసింది. జైపూర్‌లో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రం నిర్మాణ పనులు సాగుతున్నాయి. పర్యావరణహితమైన పంపుడ్‌స్టోరేజ్, జియోథర్మల్ విద్యుత్తు కేంద్రాలపై దృష్టి సారించింది.

**మహిళలకు ప్రత్యేకం**



బొగ్గు ఉత్పత్తి రంగంలో మహిళలను ప్రోత్సహించేందుకు ఒక గనిని పూర్తిగా వారికే అప్పగించి పనులు చేయిస్తోంది. అధికారి నుంచి ఉద్యోగి స్థాయి వరకు పూర్తిగా మహిళలతోనే బొగ్గును వెలికితీసే పనులు కేటాయించింది.

**రెస్క్యూ సేవలు**

రెస్క్యూ సేవలను సామాజిక బాధ్యతగా ఇతర ప్రాంతాల్లో అందిస్తుంది. ఇటీవల ఎస్ఎల్‌బీసీలో జరిగిన ప్రమాదంలో సింగరేణి రెస్క్యూ బృందం సేవలందించింది. ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి రెస్క్యూ పోటీల్లో తొలిసారిగా హాజరైన మహిళా జట్టు ద్వితీయ స్థానాన్ని దక్కించుకొంది.

**ఖనిజాల అన్వేషణ**

సంస్థ తాజాగా ఖనిజాల అన్వేషణపై దృష్టి సారించింది. మట్టిలో లభించే కీలక ఖనిజాలను గుర్తించి వాటిని పరిశోధన చేసేందుకు ఎన్ఎఫ్టీడీసీ, ఐఎంఎంటీ సంస్థలతో ఒప్పందం చేసుకొంది. కర్ణాటకలో రాగి, బంగారం అన్వేషణకు అనుమతి దక్కించుకొంది. ఖనిజాల అన్వేషణ ఆస్ట్రేలియా, ఆఫ్రికా దేశాలతో అవగాహన చేసుకొంది. సింగరేణి ఉపరితల గని మట్టిలో 10 రకాల ఖనిజాలను గుర్తించారు. కోల్‌బెల్టు ప్రాంతాల్లో కొత్తగా 62 చెరువులను నిర్మించింది. మరో 45 చెరువుల్లో పూడికతీత చేపట్టింది.

# అదనపు యూనిట్లు.. అందుబాటులో సేవలు


గోదావరిఖని : ప్రతి బోధనాసుపత్రిలో అదనంగా రెండు డయాలసిస్ యూనిట్లు(మిషన్లు) ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయం తీసుకోవడంతో అత్యవసరమైన వారికి సేవలు అందుబాటులోకి రానున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించిన మంత్రి దామోదర రాజనర్సింహా ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, బోధనాసుపత్రుల్లో 102 రక్తశుద్ధి కేంద్రాలున్నప్పటికీ అత్యవసరమైన వారికి డయాలసిస్ సేవలు అందించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో కేవలం అత్యవసర సమయంలో మాత్రమే వినియోగించేలా ప్రతి బోధనాసుపత్రిలో అదనంగా రెండు యూనిట్లు ఏర్పాటు చేయడంతో అత్యవసర విభాగంలో రక్తశుద్ధి సేవలు అందుబాటులోకి రానున్నాయి.
సాధారణంగా రక్తశుద్ధి కేంద్రాల్లో షిఫ్టుల వారీగా సమయాన్ని



కేటాయిస్తారు. కేటాయించిన సమయం ప్రకారం కేంద్రాలకు వచ్చి రక్తశుద్ధి చేయించుకొని వెళ్తుంటారు. ఈ సమయంలో ఎవరికైనా రక్తశుద్ధి అవసరమైతే చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. రెగ్యులర్‌గా చేయించుకునేవారిని ఆపాల్సి ఉంటుంది. ఇది వారి ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారనుంది. ఈ నేపథ్యంలో కేవలం అత్యవసరమైన వారికి మాత్రమే అదనపు యూనిట్లలో రక్తశుద్ధి చేసే అవకాశం ఉండగా రెగ్యులర్ రోగులకు ఎలాంటి ఇబ్బందులుండవు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆరు కేంద్రాల్లో 40 యూనిట్లు అందుబాటులో ఉండగా 287 మంది రెగ్యులర్‌గా రక్తశుద్ధి చేయించుకుంటున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 డయాలసిస్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు.

# టీకా శక్తి.. పోషకాల యుక్తి

మిర్యాలగూడ : సాధారణంగా పిల్లలు, వృద్ధులు తరచూ అనారోగ్యానికి గురవుతుంటే వారిలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుందంటారు. దీనిని పెంచేందుకు వైద్యులు మందులు సూచిస్తారు. అయితే కేవలం పిల్లలు, వృద్ధులే కాకుండా అన్ని వయసుల వారిలోనూ ఈ శక్తి తక్కువగా ఉండొచ్చు. ఇది తక్కువగా ఉన్న వారిలో వాతావరణ మార్పులు, కొత్త ఆహార పదార్థాలు తినడం తదితర సమయాల్లో తీవ్ర అనారోగ్యం, ఇన్‌ఫెక్షన్ల బారిన పడతారు. రోగనిరోధక శక్తి, టీకాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించేలా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఏటా నవంబరు 10న 'ప్రపంచ రోగనిరోధక దినోత్సవం' నిర్వహిస్తున్నారు. రోగనిరోధక శక్తి పెంచేందుకు పోషకాలతో పాటు మందులు వినియోగిస్తారు. అయితే కొన్ని రకాల వ్యాధుల నిరోధానికి ప్రత్యేకంగా కొన్ని టీకాలను తయారు చేస్తారు. పిల్లల్లో నిరోధకతను పెంచేందుకు వయసుల వారీగా జాతీయ రోగనిరోధక ప్రణాళిక,



ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్ సంస్థలు సిఫారసు చేసిన టీకాలను అందిస్తారు. వీటిలో ఏటా మార్పులు చేయడం, కొత్త వ్యాధులకు టీకాలు చేర్చడం వంటివి జరగవచ్చు. ఈ టీకాలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుంది.

**అన్ని వయస్సుల వారికి అవసరమే...**

డాక్టర్ నితిన్ ప్రసాద్ రాయ్, ఆర్బీఎస్కే వైద్యాధికారి, మిర్యాలగూడ
రోగనిరోధక శక్తి అన్ని వయసుల వారికి అవసరమే. ఇది తక్కువగా ఉండే వారిలో వాతావరణం మారిన ప్రతిసారి జలుబు, ఇన్‌ఫెక్షన్లు వంటివాటితో పాటు.. దీర్ఘకాలిక వ్యాధులు సైతం సంబవించే ప్రమాదం ఉంది. దీని కోసం సరైన వయసులో రోగనిరోధక టీకాలతో పాటు అన్ని పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి.

# భుజ బలంతోనే బాహు బిలం

నల్గొండ : వెలుగుమట్ల వద్ద 60 అడుగుల లోతుతో ప్రారంభమై మధ్యలో అత్యధికంగా 105 అడుగుల వరకు లోతు ఉండటం గమనార్హం. దీనిలో ఏడాది పొడవునా నీరు నిలిచి ఉంటుంది.
నాడు ఆధునిక యంత్రాలు లేవు.. కొండల్ని పిండిచేసే సామగ్రీ లేదు. భుజ బలమే శ్రమజీవుల ఆయుధం. తమ రెక్కల కష్టంతోనే అతి లోతైన కాల్వను తవ్వేశారు. ఏళ్లు గడుస్తున్నా అక్కడి దృశ్యాలు నేటికీ గగుర్పాటుకు గురిచేస్తూనే ఉన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పూర్వ ఏపీలోని ఖమ్మం, కృష్ణా జిల్లాల్లో సాగునీటి అవసరాలు తీర్చేందుకు నాగార్జున సాగర్ ఎడమ కాల్వ నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా 1975లో పాలేరు చెరువు నుంచి ఏపీ నూజివీడు వరకూ కాల్వ నిర్మాణం ప్రారంభించారు. ఖమ్మం నగరానికి చేరువగా ఉన్న రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం గ్రామం వద్ద ఎత్తైన నేలను తొలిచే క్రమంలో భాగంగా సన్నని లోతైన కాలువ (డీప్‌కట్) నిర్మాణం చేపట్టారు. వెలుగుమట్ల వద్ద నుంచి వి.వెంకటాయపాలెం గ్రామ శివారు వరకు కిలోమీటరు పొడవున దీన్ని నిర్మించారు. పూర్తిగా మానవ వనరులతోనే దీన్ని తవ్వారు. నగర, పరిసర వాసులు గతంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఎదుర్కొన్న సమయంలో ఈ డీప్‌కట్‌లో జలాలే అవసరాలను తీర్చాయి. స్థానిక పొలాలకు మాత్రం ఈ జలాలు అందే పరిస్థితి లేకపోవటంతో రైతులు కాల్వకు ఇరువైపులా విద్యుత్తు మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ డీప్‌కట్ ఆధారంగా గతంలో కొదుమూరు–వందనం, ఇటీవల మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు.

# విధులు సరే.. నిధులేవీ?




నకిరేకల్ : పల్లెలకు ఎన్నికల పండుగొచ్చింది. విజయవంతం కావాలంటే సరిపడా డబ్బులుండాలి. నామినేషన్ల ఘట్టం ముగిసినా ఎన్నికల నిర్వహణ కోసం క్షేత్రస్థాయికి పైసా నిధులు ప్రభుత్వం నుంచి రాలేదు. గ్రామాల సంఖ్య ఆధారంగా ఒక్కో మండలానికి రూ.ఐదు నుంచి పది లక్షలు అవసరం అవుతున్నాయి. అధిక శాతం మండల పరిషత్‌లలో జనరల్ ఫండ్ కూడా లేకపోవడంతో ఎన్నికల ఏర్పాట్లకు ప్రస్తుతం నిధుల కటకట నెలకొంది.
జిల్లా కేంద్రం నుంచి పలుమార్లు ఎన్నికల సామగ్రిని తీసుకువచ్చేందుకు వాహనాల అద్దెలు, కోడ్ అమలుకు ఏర్పాట్లు, పంచాయతీలకు ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కోసం రవాణా ఛార్జీలు, కేంద్రాల నిర్వహణ, పోలింగ్ సిబ్బందికి భోజనాలు తదితర ఖర్చులు ఉంటాయి. పోల్ సిబ్బంది రెమ్యూనరేషనే మండలానికి రూ.3 లక్షలకుపైగా అవసరంగా ఉంటుంది.
2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ముందస్తుగానే ప్రతి మండలానికి రూ.లక్ష చొప్పున విడుదల చేయడంతో ఏర్పాట్లు జరిగిపోయాయి.
నాలుగైదు గ్రామాలకు ఒకటి చొప్పున నామినేషన్ల స్వీకరణ (స్టేజ్–1) కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇలా ఒక్కో మండలంలో ఐదు నుంచి పది వరకు కేంద్రాలు ఏర్పాటు చేసి నామపత్రాలు స్వీకరించారు. ఎన్నికల అధికారులు, గ్రామ పంచాయతీల సిబ్బంది, పోలీసులు ఇలా.. 20 మంది వరకు పనిచేశారు. వీరికి భోజన వసతి సౌకర్యాల భారం అంతా సంబంధిత పంచాయతీ కార్యదర్శులపైనే పడటం గమనార్హం.
నామినేషన్ల చివరి రోజు గడువు ముగిసేలోపు డిజిటల్ గడియారాలను కొనుగోలు చేయాలని శుక్రవారం ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో క్షేత్రస్థాయి సిబ్బంది పరుగులు తీశారు. ఒక్కో డిజిటల్ వాచ్‌ను రూ.వెయ్యి నుంచి 1200లకు కొనుగోలు చేసి స్టేజ్–1 కేంద్రాల్లో పెట్టారు.
ఎన్నికల నిర్వహణ నిధులు త్వరలోనే అందుతాయని, ట్రెజరీ నుంచి విడుదల కావాల్సి ఉందని నియోజకవర్గానికి చెందిన ఒక అధికారి తెలిపారు.

జిల్లాలో ఇలా..
మండలాలు: 33
గ్రామ పంచాయతీలు 869
వార్డులు: 7,494
నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు 117

# పర్యావరణం..!



మిర్యాలగూడ : ఉమ్మడి జిల్లాలో ఏటా కాలుష్యం భారీగా పెరుగుతోంది. రహదారుల నిర్మాణం, విస్తరణతో చెట్లనే నరికేయడం, పరిశ్రమలు కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు పాటించకపోవడం, వాహనాల వినియోగం భారీగా పెరగడం తదితర కారణాలతో కాలుష్యం కోరలు చాస్తోంది. ప్రజలు, పారిశ్రామిక వేత్తల్లో అవగాహన పెంచేందుకు ఏటా డిసెంబరు 2న 'జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

**ప్రమాదకరంగా ధూళి కణాలు..**

కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం ఘనపు మీటరు గాలిలో 2.5 మైక్రో మీటర్ (పీఎం 2.5) వ్యాసం గల ధూళి కణాల సూచీ 30 వరకు ఉంటే కనిష్ఠ ప్రమాదంగా పరిగణిస్తారు. కానీ ఉమ్మడి జిల్లాలో పలు సమయాల్లో 30 దాటి అధికంగా నమోదవుతుంది. మరో వైపు నిబంధనల ప్రకారం ఘనపు మీటరు గాలిలో 10 మైక్రో మీటర్ వ్యాసం(పీఎం10) కలిగిన ధూళి కణాల సూచీ 50 వరకు ఉండొచ్చు. కానీ ఉమ్మడి జిల్లాలోని నల్గొండలో 70, సూర్యాపేటలో 73, దేవరకొండలో 81గా నమోదవుతుంది.

ఉమ్మడి జిల్లాలో గాలి నాణ్యత పరీక్ష కేంద్రాలు ఉన్న పట్టణాలు
సూర్యాపేట 3
మిర్యాలగూడ 3
నల్గొండ 1
భువనగిరి 1

**వీడని ప్లాస్టిక్ భూతం..**

తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ సంచుల వినియోగంపై ప్రభుత్వం నిషేధించినప్పటికీ ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. 19 పురపాలికల్లో నిత్యం టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఈ ప్లాస్టిక్ సంచుల కారణంగా పర్యావరణ కలుషితంతో పాటు వాటిని తింటున్న మూగజీవాలు అనారోగ్యానికి గురవుతున్నాయి.

**నీటి కాలుష్యంతో అనారోగ్యం..**

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా కృష్ణా, మూసీ వంటి నదులతో పాటు జలాశయాలు, వేల సంఖ్యలో చెరువులు, కుంటలు ఉన్నాయి. జిల్లాలో ఉన్న పలు పరిశ్రమల నుంచి వ్యర్థాలను నిబంధనలకు విరుద్ధంగా నేరుగా కాలువల్లోకే వదులుతుండడం, పంట పొలాల్లో విచ్చలవిడిగా క్రిమి సంహారక మందులు వాడడం వంటి కారణాలతో జలవనరులన్నీ కలుషితం అవుతున్నాయి.

నియంత్రించేందుకు ఇవి పాటించాలి
వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించాలి
విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలి
పరిశ్రమలు కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు పాటించాలి
పంట వ్యర్థాల కాల్చివేతను నిరోధించాలి.

ప్రజలు భాగస్వాములు కావాలికాలుష్యం ఏ రూపంలో ఉన్నా ప్రజలు జీవ జాతులకు అనర్థాలు తప్పవు. ముఖ్యంగా జల, వాయు కాలుష్యాల కారణంగా శ్వాస సంబంధ వ్యాధులు, ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్యలు, గుండె పోటు, ఊపిరితిత్తుల క్యాన్సర్, చర్మ వ్యాధులు వంటి పలు రకాల సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. కనుక కాలుష్య నియంత్రణలో ప్రజలు సైతం భాగస్వాములు కావాలి.
డాక్టర్ ప్రసన్నకుమార్, మిర్యాలగూడ

# వడివడిగా ధాన్యం సేకరణ



ఎల్లారెడ్డిపేట: వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం సేకరణ వడివడిగా కొనసాగుతోంది. మెట్ట ప్రాంతమైన జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో రైతులు వరి పంటను సాగు చేశారు. 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు అవసరమైన చోట కేంద్రాలను నెలకొల్పారు. ఈ నెల 1 వరకు 32,085 మంది రైతులు వద్ద రూ.474.04 కోట్లు విలువ చేసే 198426 మెట్రిక్ టన్నులు కొన్నారు. 26,541 మంది రైతులకు చెందిన 1,41,842 మెట్రిక్ టన్నుల ధాన్యం డబ్బులు రూ.308.86 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు.

**అకాల వర్షాలతో ఆందోళన చెందినా..**

వానాకాలం వరి కోతలను ప్రారంభించిన రైతులు వెనువెంటనే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. తొలుత అప్పుడప్పుడు కురిసిన అకాల వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిముద్దయింది. కొన్ని చోట్ల వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నిర్ణీత తేమశాతం 17 వచ్చిన ధాన్యాన్ని కుప్పగా పోయడం, మళ్లీ ఎండబెట్టడం వల్ల రైతులు పట్టాల అద్దెకు, కూలీలకు అదనపు వ్యయం చేయాల్సి వచ్చింది. తూకాలు కూడా మందకొడిగా సాగాయి. ఆ తర్వాత వర్షాకాలం పూర్తయి, శీతాకాలం ప్రారంభవడంతో ఇక్కట్లు తీరాయి. వాతావరణం అనుకూలించగానే తూకాలు వేగవంతమయ్యాయి. తూకం వేసిన బస్తాలను కూడా కేటాయించిన మిల్లులకు చేర్చే ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. జిల్లా కలెక్టర్ నుంచి మండల స్థాయి వరకు అధికారులు కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు. కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. గన్నీ సంచులు, హమాలీలు, లారీల కొరతను అధిగమించేందుకు చర్యలు చేపట్టారు. కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు, రైతులను సమన్వయపరుస్తున్నారు. వచ్చే నెల రెండో వారం వరకు జిల్లాలో కొనుగోళ్లు పూర్తయ్యే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

**25 కేంద్రాల మూసివేత**

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 239 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించారు. 18,8475 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం, 9951 మెట్రిక్ టన్నుల సన్నరకం వడ్లను కొన్నారు. ఇందులో 1,90,942 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు చేర్చారు. తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాల్సి ఉంది. కొనుగోళ్లు పూర్తి చేసుకున్న 25 కేంద్రాలను మూసి వేశారు.

# ఉద్యానంపై కన్ను.. అధికారుల దన్ను

హైదరాబాద్ : నగరంలో ఉద్యానవనాలకు రక్షణ కల్పించాల్సిన జీహెచ్ఎంసీ అధికారులే వాటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నారు. జూబ్లీహిల్స్ ప్రధాన రహదారికి, రోడ్డు నం.66కు ఆనుకుని 30 గుంటల్లో ఉండాల్సిన పార్కు విషయంలో అదే జరిగింది. ఎలాంటి సర్వే చేయకుండా.. దశాబ్దాల నాటి ఉద్యానవనం ఆక్రమణకు బల్దియా అధికారులు దన్నుగా నిలిచారు. ఇది పార్కు కాదు.. రోడ్డు అని అధికారులు నిర్ణయించడంతో స్థానికులు రెచ్చిపోయారు. ఉద్యానవనం ప్రహరీని కూల్చి లోపల చెట్లను తొలగించి 10 అడుగుల మట్టితో పూడ్చి రోడ్డును నిర్మించారు. ఘటనపై విచారణ జరపాలని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్



వెంకటేశ్, స్థానికులు కోరుతున్నారు.

**రూ.50కోట్ల భూమి**

జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్ ప్రకారం రోడ్డు నం.66 నుంచి పక్కనున్న కాలనీకి రోడ్డు ఉంది. ఆ లేఅవుట్ ఎప్పటిది.. సవరణకు గురైన లేఅవుటా.. కాదా అన్నది జూబ్లీహిల్స్ సర్కిల్ అధికారులు విచారించలేదు. సర్కిల్ ఉన్నతాధికారిని వివరణ కోరగా విచారించి చెబుతానని సమాధానమిచ్చారు. అంటే.. గుడ్డిగా పార్కు గోడను కూల్చి.. రోడ్డు నిర్మాణానికి అధికారులు అంగీకరించారని అర్థమవుతోంది. దాదాపు 600 గజాల్లో రోడ్డు నిర్మించారని, దాని విలువ రూ.50 కోట్ల వరకు ఉంటుందని జోనల్ కమిషనర్ కార్యాలయంలో స్థానికులు ఫిర్యాదు చేశారు.

# పోకిరీలు!

"అతడో ప్రభుత్వ ఉద్యోగి..తననెవరూ గమనింట్లేదనే ధీమాతో ఆడపిల్లతో అనుచితంగా ప్రవర్తించాడు. అదుపులోకి తీసుకున్న పోలీసులతో వాదనకు దిగాడు. తాము రికార్డ్ చేసిన వీడియోను చూపితే తప్పయిందని.. కాళ్లావేళ్లా పడ్డాడు."
"ఆరు పదుల వయసు.. మనుమరాలి వయసున్న బాలికను తాకాడు. మరో మహిళకు దగ్గరగా వెళ్లి వికృతబుద్ధి చూపే ప్రయత్నంలో షీటీమ్స్ చిక్కాడు. కౌన్సెలింగ్ సమయంలో కుటుంబసభ్యుల ఎదుట ముఖం చూపలేక విలవిల్లాడిపోయాడు. మరోసారి ఇటువంటి చేష్టలకు పాల్పడితే జైలు ఖాయమని పోలీసులు హెచ్చరించారు."
ఈనాడు, హైదరాబాద్ : నగరంలో నిత్యం ఆడపిల్లలు వేధింపులు చవిచూస్తున్నారు. గడప దాటినప్పటి నుంచి ఇల్లు చేరేవరకూ కొందరి వికృతచేష్టలకు మనోవేదన అనుభవిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు, బహిరంగ ప్రదేశాల్లో ఆకతాయిల వేధింపులపై నెలకు 500కుపైగా ఫిర్యాదులు వస్తుయి. షీటీమ్స్ నిఘాతో రోజూ 10–15 మంది పట్టుబడుతున్నారు. వేధింపులకు గురైన బాధితురాలు దాన్నుంచి బయటపడేందుకు 3–4 నెలల సమయం పడుతుందని మనస్తత్వ నిపుణులు విశ్లేషిస్తున్నారు. సున్నిత మనస్కులైతే 1–2 ఏళ్ల పాటు కుంగుబాటుకు గురవుతుంటారు. వరుస ఫిర్యాదులతో సీపీ సజ్జనార్ పోకిరీలపై కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఆడపిల్లల జోలికొస్తే హిస్టరీ షీట్ ఓపెన్ చేయమని ఎస్‌హెచ్‌వోలను ఆదేశించారు.
అమ్మాయిలను వేధిస్తే కొలువు మాయం
ఆకతాయిలకు అడ్డుకట్ట వేసే క్రమంలో పోలీసులు కేసులు, కౌన్సెలింగ్‌కే పరిమితంగాకుండా ఆ ప్రబుద్ధులు పనిచేసే కంపెనీలకు సమాచారమిస్తున్నారు. వినాయక ఉత్సవాలు, బోనాలు, ఊరేగింపుల్లో యువతులతో అనుచితంగా ప్రవర్తించిన 1000 మందిని పట్టుకున్నారు. వీరిలో ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగులు, వృద్ధులు, మైనర్లున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్నతాధికారులు మెమోలు జారీచేశారు. ప్రైవేటు ఉద్యోగుల్లో 20 మందిని కొలువుల నుంచి తొలగించినట్టు సమాచారం. మెట్రోరైళ్లు, బస్టాప్‌లు, విద్యాసంస్థల సమీపంలో పోకిరీలపై షీటీమ్స్ నిఘా ఉందని.. మహిళా భద్రతా విభాగం డీసీపీ డా.లావణ్య నాయక్ జాదవ్ హెచ్చరించారు. బాధితులు డయల్ 100, 112 ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు.

# ఎనిమిదేళ్లయినా ఎదురుదెబ్బలేనా?

హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రోరైలు సేవలు ప్రారంభమై ఎనిమిదేళ్లు అవుతున్నా ఇప్పటికీ బాలారిష్టాలను ఎదుర్కొంటోంది. కనుచూపు మేరలో కష్టాలు గట్టెక్కె పరిస్థితి కన్పించకపోవడంతో సర్కారు కు అప్పగించేందుకు ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ సిద్ధమైంది. మెట్రోను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో నిర్మించారు. కేటాయించిన భూముల నుంచి 45 శాతం ఆదాయం రాబట్టుకోవాలి. రియల్ ఎస్టేట్, ప్రకటనలు, ప్రయాణికుల ఛార్జీల ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో రూ.1112.66 కోట్లు వచ్చింది. ఖర్చేమో రూ.1738.57 కోట్లు. ఇందులో రూ.940 కోట్లు అప్పులపై వడ్డీలకు చెల్లిస్తున్నారు. 2024–25లో రూ.625.88 కోట్ల నష్టం వచ్చింది. ఏటే పెరుగుతోంది.

**సమస్యలు అధిగమించలేక...**



రద్దీకి అనుగుణంగా రైళ్లను మెట్రో నడపలేపోతుంది. సర్కారు చేతికి వచ్చాక కొనుగోలుకు ఆర్డర్ ఇస్తే కొత్త కోచ్‌లు వచ్చేందుకు 18 నెలలు పడుతుందని మెట్రో ఎండీ అంటున్నారు.
మెట్రోరైలు స్టేషన్ల నుంచి ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ కనెక్టివిటీ సమస్యగా ఉంది. కొన్ని స్టేషన్లకు మినహా గుమ్మం నుంచి గమ్యం దాకా సేవలు లేవు. దీంతో వ్యక్తిగత వాహనాల్లో వెళ్లేందుకు ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారు. మెట్రో విస్తరణ ముందుకు సాగకపోవడం కూడా ప్రయాణికుల సంఖ్య పెరగకపోవడానికి ఒక కారణంగా కనబడుతోంది.
మెట్రో రైలు స్టేషన్లలో మాల్స్ ఉన్నాయి. వీటిని లీజు ఇవ్వడంలో సదరు సంస్థ పూర్తిగా విఫలమైంది.
మెట్రో, ఆర్టీసీ, ఎంఎంటీఎస్, క్యాబ్‌లు అన్నింటికి చెల్లుబాటు అయ్యేలా కామన్ కార్డు ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది.

# చేయి తడిపితేనే చేను చూసేది!

కాకినాడ : రెవెన్యూలో కీలకమైన సర్వేశాఖ గొలుసు తప్పుతోంది. బాధితుల అవసరాలను సొమ్ము చేసుకుంటున్నారు. పైసలిస్తేనే పొలంలోకి వస్తున్నారు. లేకుంటే నెలలు తరబడి కాలయాపన చేస్తూ రైతులను తిప్పుతున్నారు. కొందరు భూమిలోకి వెళ్లకుండానే సర్వే చేసినట్లు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సైతం తప్పుబడుతున్నారు. ఇటీవల వివిధశాఖల తీరుపై ప్రభుత్వం సేకరించిన సంతృప్తిస్థాయి నివేదికల్లో సర్వేయర్ల తీరుపై అంతటా పెదవివిరుపే వినిపిస్తుంది.

**వారికి ఇక్కట్లు.. వీరికి కాసులు**



గత ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీసర్వే రైతులను చిక్కుల్లోకి నెట్టింది. సాగు విస్తీర్ణం తగ్గించి చూపడం, పట్టా భూములను అసైన్డ్ భూములుగా నమోదు చేయడంతో మరలా సర్వేలు చేయించాల్సి వస్తోంది. జాయింట్ ఎల్‌పీఎం సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ఒక సర్వే నంబర్‌లోని భూమి మొత్తం ఒకే రైతు పేరుపై చూపడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమైపోతున్నారు. వీటిపై అర్జీలు ఎక్కువగా రావడంతో జాయింట్ ఎల్‌పీఎంలను సబ్ డివిజన్ చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇక్కడే సర్వేయర్లు చేతివాటం చూపుతున్నారు. బిక్కవోలు మండలం బలబద్రపురం సచివాలయం పరిధిలో నిర్వహించిన సర్వేలో మీ అర్జీకి సర్వేయర్ నోటీసు ఇస్తున్నారా అని అడిగితే నూరు శాతం ఇవ్వలేదనే సమాధానం

# ఈవీ ఛార్జింగ్.. ఇకపై ఈజీగా..

రాజమహేంద్రవరం : కాలుష్య నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈవీ(ఎలక్ట్రిక్ వాహన) వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. దానికి తగ్గట్లుగా ఇంధన ధరలకు భయపడి ప్రజలు విద్యుత్తు వాహనాల వైపు అడుగులేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో విద్యుత్తు వాహనాల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. వాటికి అనుగుణంగా ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో కొంతమేర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏపీ ఈపీడీసీఎల్ పీఎం ఈ-డ్రైవ్ పథకంలో కొత్తగా ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. ముందుగా ప్రభుత్వ కార్యాలయాల్లోని ఖాళీస్థలాల్లో వీటిని అందుబాటులోకి తేనున్నారు. కేటగిరీ-ఏ కిందకు వచ్చే కలెక్టరేట్, నగరపాలక సంస్థ, ఆర్టీసీ, ప్రభుత్వ కళాశాలలు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తారు.

**వాహనాలు పెరిగినా.. ఛార్జింగ్ స్టేషన్లు లేక..**

జిల్లాలో గత అయిదేళ్లతో పోల్చితే ఈవీల వినియోగం విపరీతంగా పెరిగింది. అయిదేళ్ల క్రితం కేవలం 2వేల లోపే ఉన్న వాహనాలు ప్రస్తుతం అన్ని రకాలు కలిపి 9,009కు పెరిగాయి. ఈవీల కొనుగోలుకు ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తున్నా బడ్జెట్ ధరల్లో వాహనాలు లేకపోవడం, ఛార్జింగ్‌కు ఇబ్బందులు ఎదురవడం వంటి సమస్యలున్నాయి. ఇంటి దగ్గర ఛార్జింగ్ పెట్టుకుంటే అధిక విద్యుత్తు బిల్లుతో సంక్షేమ పథకాలు ఆగిపోతాయని కూడా కొందరు భయపడుతున్నారు. ఛార్జింగ్ స్టేషన్లు విరివిగా అందుబాటులోకి వస్తే ఈవీల వైపు అంతా




అడుగేస్తారు.

**ఈ ప్రాంతాల్లో..**

గతంలో 100 శాతం రాయితీ ఇస్తామని ప్రతిపాదించినా, ప్రస్తుతం 80 శాతం ఇస్తామని చెబుతున్నారు. జిల్లాలోని రాజమహేంద్రవరం గ్రామీణం బొమ్మూరు, హకుంపేట పంచాయతీలు, రాజమహేంద్రవరం నగరంలోని మున్సిపల్ కార్యాలయం, లూథర్‌గిరి సచివాలయం, పంచాయతీ రాజ్ డివిజన్ కార్యాలయం, లాలాచెరువు సబ్‌స్టేషన్, కంబాలచెరువులోని హైటెక్‌బస్టాండ్, నల్లజర్లలోని సబ్‌స్టేషన్, రాజానగరంలోని దివాన్‌చెరువు సబ్‌స్టేషన్, కోరుకొండలోని సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు.

రాజమహేంద్రవరం డివిజన్
అన్నిరకాలు: 2,847
బ్యాటరీ ఆధారితం: 4,581
కొవ్వూరు డివిజన్ అన్నిరకాలు: 594
బ్యాటరీ ఆధారితం: 987
ఒక కారు ఛార్జింగ్‌కు
వినియోగించే విద్యుత్తు: సుమారు 30 యూనిట్లు
ఒక యూనిట్‌కు వసూలు చేసే ఛార్జి: రూ.21-23

# ముక్కోటికి ఆలయాల ముస్తాబు



ఆత్రేయపురం : ఈ నెల 30 ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర, అంతర్వేది లక్ష్మీనరసిం హస్వామి, అప్పనపల్లి బాలబాలాజీ ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. ఆలయాల్లో స్వామివార్లు ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిస్తారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వాడపల్లిలో ఆలయ ప్రాకార మండపాలు, గోపురాలను విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. తెల్లవారుజామున 4.30 గంటల నుంచి భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అంతర్వేదిలో లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ మూర్తులను ఉత్తర ద్వారం వద్ద ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామని ఏసీ నాగవరప్రసాద్ తెలిపారు. ఆనవాయితీ ప్రకారం పల్లిపాలెం అగ్నికులక్షత్రియులు స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాల అభిషేకం చేస్తారన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

# ఎస్సార్బీ ‘ఛీ’



నంద్యాల : 1.90 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ఎస్సార్బీసీ పనులు మధ్యలో ఆగిపోయాయి. సుమారు 18 ఏళ్ల కిందటే ఎస్సార్బీసీకి చెందిన అత్యధిక పనులు పూర్తిచేయగా 36, 37, 38 ప్యాకేజీల్లోని పనులు అప్పట్లోనే పెండింగులో ఉంచారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా మూడు ప్యాకేజీల పనులు వదిలేశారు. ఇవి పూర్తయితే సుమారు 29,200 ఎకరాలు సాగులోకి వచ్చేది.

**ప్రతిపాదనతోనే సరి..**

పెండింగు పనులు పూర్తిచేయడానికి రూ.268 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనావేశారు. కేవలం 57 కి.మీ. మేర కాలువల నిర్మాణం చేస్తే మొత్తం 29,200 ఎకరాలకు నీరందుతుందని నిర్ధారించారు. గతంలో పంపిన ప్రతిపాదనలను ప్రస్తుత ధరలకు అనుగుణంగా మార్చి వైకాపా హయాంలోనే నూతన ప్రతిపాదనలను పంపినా.. పనులకు మోక్షం కలగలేదు.

**క్రమంగా పెరుగుతూ..**

ఎస్సార్బీసీకి సంబంధించిన పనులన్నీ 2007లో పూర్తయ్యాయి. అప్పట్లోనే 57 కి.మీ.ల మేర కాలువలు నిర్మిస్తే కేవలం రూ.70 కోట్ల లోపు నిధులు సరిపోయేవి. నాడు ఆయా పనులు చేయకపోవడంతో వదిలేసిన కొద్దిపాటి పనుల విలువ క్రమంగా పెరుగుతూ ప్రస్తుతానికి రూ.268 కోట్లకు చేరింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోపాటు గుత్తేదారులకు బిల్లులన్నీ చెల్లించేశారు.

**అగచాట్లు**

ఎస్సార్బీసీ ప్రధాన కాలువ పనులు సంజామల మండలంలో పేరుసోముల గ్రామం వరకు పూర్తయ్యాయి. అక్కడి నుంచి ప్రధాన కాలువ పనులు చాలాచోట్ల పూర్తిచేయకుండా నిలిపివేశారు. ఫలితంగా మైలవరం జలాశయానికి రావాల్సిన నీరు రావడంలేదు. సంజామల, ఉయ్యాలవాడ మండలాల్లోని వేలాది ఎకరాలకు నీరందని దుస్థితి తలెత్తింది. అవుకు జలాశయం నుంచి ఎస్సార్బీసీకి పంపడానికి సాగునీరు అందుబాటులో ఉన్నా కాలువలు లేని కారణంగా ఆయకట్టుకు నీరివ్వలేని దుస్థితి నెలకొంది.

**నిధులు పక్కదారి**

ఎస్సార్బీసీ కింద కొన్ని పెండింగు పనులు ఉండగానే వాటిని అర్ధాంతరంగా నిలిపివేసి బిల్లులు చెల్లించడంపై పలు ఆరోపణలున్నాయి. గుత్తేదారుల నుంచి కొందరు నేతలు దండుకుని ఆయా చెల్లింపులన్నీ పూర్తయ్యేలా చేశారన్న విమర్శలు ఉన్నాయి. నాటి నేతల ధనదాహం కారణంగా నేడు సుమారు నాలుగువేల మంది రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

**ఒట్టిపోయిన 12 వేల ఎకరాలు**

ప్యాకేజీ 36, 37ల పరిధిలో చేపట్టాల్సిన పనులన్నీ నంద్యాల జిల్లాలోనే ఉన్నాయి. సంజామల, ఉయ్యాలవాడ మండలాల పరిధిలో కాలువలు, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం చేయాల్సి ఉంటుంది. ఆయా కొద్దిపాటి పనులు పూర్తిచేస్తే 12 వేల ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుంది. దీంతోపాటు 37వ ప్యాకేజీ కింద పనులు పూర్తిచేస్తే ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో 17,200 ఎకరాలకు నీరందుతుంది.

# పునాదులు కూల్చిన ‘భూ’తాలు



కర్నూలు : నగరంలో భూమాఫియా రెచ్చిపోతోంది.. ఏకంగా పక్కా గృహాలు, ప్రహరీలు కూల్చి ఆక్రమించేస్తున్నారు. కోడుమూరు రోడ్డులో ఎస్‌డబ్ల్యూసీ గోదాములకు ఎదురుగా ఉన్న రహదారికి ఆనుకుని ఉన్న 3.50 ఎకరాల భూమిని కబ్జా చేశారు. కల్లూరు మండల పరిధిలోని సర్వే నంబరు 292లో సుమారు 3.95 ఎకరాలను కొందరు దశాబ్దాల కిందట కొనుగోలు చేశారు. అందరికీ చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. కొనుగోలుదారుల్లో కొందరు ఇతరులకు స్థలాలు విక్రయించారు. కొందరు మాత్రం నగరపాలక సంస్థ అనుమతులు తీసుకుని భవనాలు నిర్మించుకున్నారు. మరికొందరు స్థలాల చుట్టూ ప్రహరీలు ఏర్పాటు చేసుకున్నారు. ఆయా భూములు కోడుమూరు రోడ్డుకు కూతవేటు దూరం ఉండటం.. దాని వెనక భాగంలో పలు నిర్మాణాలు వెలియడంతో ధరలు చుక్కలనంటుతున్నాయి. ప్రస్తుతం అక్కడ ఎకరా రూ.10 కోట్లకుపైగా పలుకుతోంది.

**బాధితుల గగ్గోలు**

ఆ భూముల్లోకి బుల్డోజర్లతో వెళ్లి అక్కడున్న ఓ ఇంటిని పూర్తిగా కూల్చేశారు. ప్రహరీని ధ్వంసం చేశారు. భూమిలో ఉన్న హద్దు రాళ్లను పెకిలించేశారు. పక్కాగా నిర్మించిన కొన్ని భవనాలను వదిలేసి మిగిలిన భూమి మొత్తానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నారు. వారి మనుషులను అక్కడ కాపలాగా ఉంచి ఎవరూ ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఆక్రమణదారులకు కొందరు తెదేపా నేతల అండదండలు ఉండడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు.

**నిందితులపై కేసులు**

సర్వే నెంబరు 292లో స్థలాలు కొనుగోలు చేసిన కొందరు బాధితుల ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు అక్టోబరు 8న కేసు కూడా నమోదు చేశారు. ఆస్తులను ధ్వంసం చేయడం, ఇతరుల ప్రాంగణాల్లోకి అక్రమంగా చొరపడడంతోపాటు అడ్డువచ్చిన వారిపై దౌర్జన్యం చేశారన్న సెక్షన్లతో జనార్దన్ ఆచారి, తెలుగు మహేశ్, వడ్డే నాగేశ్వరరావు, దేవేంద్రకుమార్ తదితరులపై కేసు నమోదైంది.

**ఏళ్ల కిందట కొనుగోలు చేశామని....**

“ 1913లో అహ్మద్ హుస్సేన్ ఖాద్రి నుంచి మా నాన్న కేశవ ఆచారి 3.95 ఎకరాలు కొనుగోలు చేశారు.. 1914లో ప్రభుత్వం రైతువారీ పట్టా ఇచ్చిందని ” ఎస్.డి.చారి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నాన్న 1991లో చనిపోవడంతో ఆ భూమి తన ఆధీనంలో ఉందని.. ఆ భూమికి ఇన్‌జంక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. తమ దగ్గరున్న దస్తావేజులు, భూమి తమదని నిరూపించే ఆధారాలను బాధితులు న్యాయస్థానానికి సమర్పించారు. ఎస్.డి.చారికి ఇచ్చిన ఇన్‌జంక్షన్ ఉత్తర్వులను జడ్జి రద్దు చేశారు.

**ఇల్లు నేలమట్టం : రాజు, బాధితుడు**

కల్లూరులో సర్వే నంబరు 292లో నాకున్న రెండున్నర సెంట్లలో చిన్న ఇల్లు కట్టించా. విద్యుత్తు కనెక్షన్ ఇచ్చేందుకు ఎక్కువ మొత్తం చెల్లించాలని డిమాండు చేయడంతో ఆ మొత్తం చెల్లించలేక ఆ ఇంటిని ఖాళీ చేశా. ఆ ఇంటిని మొత్తాన్ని అడ్డగోలుగా కూల్చేసి నా ప్లాటు ఆక్రమించారు. నాతోపాటు సుమారు 30 మందికి సంబంధించిన స్థలాలను సైతం ఆక్రమించుకున్నారు.

**ప్రహరీ పడగొట్టారు : కృష్ణమూర్తి, బాధితుడు**

నా సోదరుడు కె.శ్రీనివాసులు 80 సెంట్ల స్థలాన్ని 2007లో కొనుగోలు చేశారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. అతని పేరుతో అడంగల్, పాస్‌బుక్ ఉన్నాయి. వ్యవసాయ భూమి కావడంతో ప్రభుత్వానికి రూ.5 లక్షలు చెల్లించి వ్యవసాయేతర భూమిగా 2013లో మార్చుకున్నాం. ప్రహరీ నిర్మించి గేటు ఏర్పాటు చేసుకున్నాం. ప్రహరీ ఆనవాళ్లు లేకుండా కూల్చేశారు.

# ఆరోగ్యం గజగజ

కర్నూలు : గతంలో ఎన్నడూలేనివిధంగా సీమలో కనిష్ఠస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.. వెన్నులో వణుకు పుట్టిస్తున్న చలితో చిన్నారులు, వృద్ధులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఊపిరి ఆడక ఉక్కిబిక్కిరి అవుతున్నారు. గత 20 రోజులుగా కర్నూలు, నంద్యాల సర్వజన వైద్యశాలల్లోని జనరల్ మెడిసిన్, చర్మ, గుండె తదితర విభాగాలకు వాచ్చేవారి సంఖ్య రెట్టింపు అయ్యింది. పలువురు ఇన్‌పేషెంట్లుగా చేరి చికిత్స పొందుతున్నారు.

శిశువిలాపంచిన్నారుల విభాగం కిక్కిరిసిపోతోంది. ఇందులో ఎక్కువ మంది ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్ష సమస్యతో ఇబ్బంది పడుతున్నారు.. కొందరు న్యూమోనియాతో అల్లాడుతున్నారు. జలుబు, దగ్గు, గొంతునొప్పి వంటి సమస్యలతో వస్తున్నారు. తక్కువ బరువుతో పుట్టిన చిన్నారులు.. అనారోగ్యంతో పుట్టినవారి పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉంటుంది. నెలలోపు వయసున్న శిశువులకు హైపోథర్మియా వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. వీటన్నిటిని దీన్ని దృష్టిలో పెట్టుకొని ఫ్యాన్లు, ఏసీలకు దూరంగా పిల్లలను పడుకోబెట్టాలి. స్వెటర్లు తొడగటం, కాళ్లకు సాక్సులు, చేతులకు గ్లౌజులు వేయాలి. చిన్నారులకు ఎట్టి పరిస్థితిలోనూ బయటి ఆహారం పెట్టకూడదు. చల్లని పానీయాలను దూరంగా ఉంచాలని వైద్యులు పేర్కొంటున్నారు. చర్మ పొడిబారుతోందిచర్మ సంరక్షణకు ప్రత్యేకంగా మాయిశ్చర్స్ వాడాలి. ఆయిల్ సబ్బులు వినియోగించాలి. చలి రక్షణ దుస్తులు, మంకీ క్యాప్‌లు వాడాలి. వెరికోస్, సోరియాసిస్‌తో బాధపడేవారికి చర్మ సంబంధిత సమస్యలు అధికంగా వస్తాయి. ఈ నేపథ్యంలో ఉదయం, రాత్రివేళల్లో మాయిచర్స్ పూసుకోవాలి. చల్లని, వేడి నీటికంటే గోరు వెచ్చని నీటితో స్నానం చేస్తే మంచిది.“ వసతిగృహాల్లో ఉండేవారిలో ఎక్కువగా చర్మం పొడిబారుతూ ఉంటుంది. వ్యక్తిగత పరిశుభ్రత పాటించకుంటే దురదలు, గజ్జి, తామర వంటి బారిన పడతారు. గోరు వెచ్చని నీటితో స్నానం చేస్తే మేలని” అసోసియేట్ ప్రొఫెసర్ డా.గౌతమి సూచించారు.వణుకుతున్న పెద్దలుఆస్తమా, సీవోపీడీ ఉన్న వృద్ధులు ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధుమేహం, రక్తపోటు ఉన్నవారు మరింత ఇబ్బంది పడుతున్నారు. వీటిని నియంత్రణలో ఉంచుకోకుంటే బ్రెయిన్ స్ట్రోక్, గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు. “ వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు ఉదయం, రాత్రి వేళల్లో చలిలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఊపిరి ఆడని సమస్యలతో బాధపడేవారు ఇన్‌హేలర్లు అందుబాటులో ఉంచుకోవాలి. దోమలు, కీటకాలతో డెంగీ, వైరల్ జ్వరాల బారిన పడే ప్రమాదముంది తప్పనిసరిగా నియంత్రణలో ఉంచుకోవాలని” ప్రొఫెసర్ డా.లక్ష్మీబాయి తెలిపారు.

# మంత్రి ఆదేశించినా..! ఆక్రమణలు మామూలే

రాజమహేంద్రవరం : పుష్కరాలకు వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని రహదారులు, కాలువలను విస్తరించాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఇటీవల నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆక్రమణలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. రోడ్లు విస్తరించాలంటే ముందుగా ఆక్రమణలు తొలగించాలి. ఇందుకుగాను నగరంలో రద్దీగా ఉన్న రహదారులు, వాటి పరిధిలోని ఆక్రమణలు గుర్తించారు. తొలుత మూలగొయ్యి, జాంపేట, ఆజాద్ చౌక్, కంబాలచెరువు ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగింపు ప్రారంభించారు. ఈ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో తొలగించిన చోట మళ్లీ ఆక్రమణలు వెలిశాయి. ఏకంగా నడకదారుల పై దుకాణాలు, రోడ్డుపైనే వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ



40 నుంచి 60 అడుగుల రోడ్డు ఉన్నప్పటికీ కనీసం వెళ్లేందుకు 20 అడుగుల కూడా కనిపించకపోవడం గమనార్హం. దుకాణాలు రోడ్డుపైకి వస్తే, కొనుగోళ్ల కోసం వచ్చిన వాహనదారుల వాహనాలు రోడ్డు సగం ఆక్రమించేస్తున్నాయి. దీంతో ఉన్న సగం రోడ్డులోనే వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. నగరంలో ప్రధాన ప్రాంతాల్లో ఇదే దుస్థితి నెలకొంది. దేవీచౌక్, మెయిన్ రోడ్డు, జాంపేట, గోరక్షణపేట, కోరుకొండ రోడ్డు, కోటిపల్లి బస్టాండ్ రోడ్డు, అప్సరా థియేటర్ రోడ్డు, కోటగుమ్మం, డీలక్స్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. జాంపేట వద్ద బిర్యానీ సెంటర్లు, చికెన్ దుకాణాలను నెలవారీ మామూళ్లకు అలవాటు పడిన యంత్రాంగం చూసిచూడనట్లు వదిలేసినట్లు సమాచారం. ముఖ్యంగా పెద్ద దుకాణాల విషయంలో భారీగానే మామూళ్లు పిండేస్తున్నారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తు కార్యాచరణ దిశగా అడుగు వేస్తుంటే ఆదిలోనే హంస పాదు అన్నట్లు పరిస్థితి మారిపోయింది.

# ఉపాధి పని దినాల పెంపు

రావులపాలెం : ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకంలో పనిదినాలు 100 రోజులు ఉండేవి. వీటిని 125 రోజులకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఈ పథకాన్ని అనుసంధానం చేయడంతో రైతులు, వేతనదారులకు మేలు చేకూరనుంది.

**3.36 లక్షల మందికి ప్రయోజనం**

అంబేడ్కర్ కోరసీమ జిల్లాలోని 22 మండలాల్లో 385 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జాబ్ కార్డులు 2.2 లక్షలు ఉండగా ఉపాధి శ్రామికులు 3.36 లక్షల మంది ఉన్నారు. జిల్లాలో జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పాడి పశువులకు గోకులం షెడ్లు, మ్యాజిక్



డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం, ఉద్యాన పంటల సాగు, ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్నారు. రోజుకు శ్రామికులు గరిష్ఠ వేతనం రూ.307 పొందుతున్నారు.

**త్వరలోనే అమలు**

వంద రోజుల నుంచి 125 రోజులకు పనిదినాలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే అమలు చేస్తాం. పనిదినాలు పెరగడం వల్ల వేతనదారులకు గరిష్ఠ ఆదాయం వస్తుంది. మధుసూదన్, డ్వామా పీడీ

# ‘సూర్య’డర్

నంద్యాల : దేశవ్యాప్తంగా కోటి సౌర విద్యుత్తు ఫలకాలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పీఎం ‘సూర్యఘర్ యోజన’ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉమ్మడి జిల్లాలో వినియోగదారులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు విస్తృత ప్రచారం చేశారు. పథకం వినియోగించుకునేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నా బ్యాంకర్ల నుంచి సహకారం అంతంతమాత్రంగానే ఉంది. వివిధ కొర్రీలు పెట్టి పథకానికి తూట్లు పొడుస్తున్నారు.

**సదుద్దేశంతో శ్రీకారం చుట్టినా..**

కర్నూలు జిల్లాలో 6,46,025, నంద్యాల జిల్లాలో 5,21,518 మంది గృహ విద్యుత్తు వినియోగదారులు ఉన్నారు. లోఓల్టేజీ సమస్యలు, విద్యుత్తు సరఫరాలో అవాంతరాలను అధిగమించడం.. రూ.వేల విద్యుత్తు బిల్లుల నుంచి ఉపశమనం పొందేందుకు కేంద్రం ఈ పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటివరకు పరిశీలిస్తే నంద్యాల జిల్లాలో 2,200, కర్నూలు జిల్లాలో 1,581 యూనిట్లు మాత్రమే ఏర్పాటయ్యాయి. బ్యాంకుల ద్వారా రాయితీ రుణాలు ఇస్తున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలవడం లేదు. వ్యాపారులు, ఉద్యోగులకు మాత్రమే బ్యాంకర్లు మంజూరు చేస్తున్నారు.

**అడ్డంకులెన్నో..**

ఉమ్మడి జిల్లాలో పెద్దఎత్తున రైతులున్నారు. వీరు సోలార్ యూనిట్ల కోసం బ్యాంకర్లను సంప్రదిస్తే సిబిల్ స్కోర్, లావాదేవీలు, గతంలో తీసుకున్న రుణాలపై ఆరా తీస్తున్నారు. వ్యక్తిగత వివరాలు అడుగుతుండటంతో వీరు పథకానికి దూరమవుతున్నారు.

ఇంటి యజమాని అంగీకరించకపోవడంతో అద్దె ఇంట్లో ఉన్నవారు పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

60 ఏళ్లు దాటినవారికి రుణం ఇవ్వడం లేదు.

కర్నూలు నగరంతోపాటు నంద్యాల, ఆదోని తదితర పట్టణాల్లో వేలాది బహుళ అంతస్తు భవనాలున్నాయి. ఇక్కడ ఎవరైనా యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని భావిస్తే అపార్టుమెంటులో నివసిస్తున్న 10 కుటుంబాల వారు సంతకాలు చేయాల్సి రావడం అడ్డంకిగా మారింది. ఇలా.. సూర్యఘర్‌కు వివిధ వర్గాలవారు దూరమయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 11,67,543 మంది విద్యుత్తు వినియోగదారులు ఉండగా.. వారిలో కనీసం 0.5 శాతం మందికి కూడా ‘సూర్యఘర్’ అందని పరిస్థితి నెలకొంది.

**రూ.కోటి అవకాశం కోల్పోయినట్లే..**

గ్రామంలో వంద శాతం ఇళ్లకు సౌర ఫలకాలు ఏర్పాటుచేస్తే.. కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహంగా రూ.కోటి వరకు నిధులు విడుదల చేస్తుంది. కర్నూలు జిల్లాలో 484, నంద్యాల జిల్లాలో 489 గ్రామాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏ ప్రాంతంలోనూ ఈ అవకాశాన్ని వినియోగించుకోలేదు. గ్రామాలవారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని బ్యాంకులు రుణాలు ఇవ్వాల్సి ఉంది.

## అక్కడ అందరూ.. 'తాపీ'గుంటారు..!

పుత్తూరు :అద్భుతమైన ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టాలంటే నేటి కాలంలో అందరూ ఇంజినీర్లను సంప్రదించి నిర్మాణాలు చేస్తున్నారు. కానీ పుత్తూరు, పలమనేరుకు చెందిన తాపీమేస్త్రీలు ఇంజినీర్లకు తీసిపోని విధంగా నిర్మాణాలు చేపడుతూ ఔరా అనిపిస్తున్నారు.

**గోవిందపాళెం మేస్త్రీలకు డిమాండు ఎక్కువే..**

పుత్తూరు మున్సిపాలిటీలోని గోవిందపాళెంలోని తాపీమేస్త్రీలకు భలే డిమాండ్. ఎన్నో ఏళ్లుగా ఇదే వృత్తిని ఎంచుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో సుమారు వంద కుటుంబాలు ఉన్నాయి. అందరూ తాపీమేస్త్రీలే. పుత్తూరులో వందల భవనాలు వీరి చేతుల మీదుగా నిర్మించినవే. నగరిలో ఎన్ఎంసీ థియేటర్, తిరుపతి సంధ్య థియేటర్, కేఎస్ఆర్ కల్యాణ మండపం ఇలా చెప్పుకొంటూ పోతే పెద్ద జాబితాయే



ఉంది. వంశపారంపర్యంగా ఇదే వృత్తిలో కొనసాగుతుండటంతో అందులోని మెలకువలు నేర్చుకుని ఆ రంగంలో రాణిస్తుండటం విశేషం.

**ఇంటికొకరు..**సాధారణంగా గ్రామాల్లో అందరూ ఒకే మాటకు కట్టుబడి ఉండటం చూశాం. కానీ ఆ గ్రామంలో మాత్రం అందరూ ఒకే పనిని ఎంచుకోవడం విశేషం. పలమనేరు మండలంలోని గొబ్బిళ్లకోటూరులో సుమారు 500 గృహాలు ఉన్నాయి. ఇక్కడ ఇంటికొకరు తాపీ పనివారు ఉంటారు. అయితే ఎందుకు అందరూ ఒకే రకం పని నేర్చుకున్నారంటే వారి దగ్గర సమాధానం లేదు. సమీప బెంగళూరులో నిర్మాణ పనుల కూలీలకు డిమాండు ఉండటంతో ఉపాధి నిమిత్తం వీరంతా ఎక్కువగా అక్కడికే వెళ్తుంటారు. గంగవరం మండలం బండమీదజరావారిపల్లెలో కూడా 90 శాతం మంది ఈ పని చేస్తున్నారు. పలమనేరు

## కట్టాలంటే కాసులమోత.. వికటిస్తే కూల్చివేత

తిరుపతి : తిరుపతిలోని తిరుమల బైపాస్ సమీపంలో ఓ భారీ బహుళ అంతస్తుల భవన నిర్మాణం గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. అప్పట్లో అధికార పార్టీ నాయకుల అండదండలతో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు రూ.5 లక్షల లంచం తీసుకొని నిర్మాణానికి అనుమతించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరోసారి అధికారులు వాలిపోయారు. మరో రూ.4 లక్షలు తీసుకొని పనుల కొనసాగింపునకు ఆమోదించారు. రెండోసారి లంచం తీసుకున్న అధికారి బదిలీ కావడం.. అతని స్థానంలో వచ్చిన మరో అధికారి రూ.4 లక్షలు తీసుకొని పనులను చూసీచూడనట్లు వదిలేశారు. సుమారు రూ.13 లక్షల లంచం ఇచ్చుకున్నా.. ఆ భవన నిర్మాణంపై తీవ్ర విమర్శలు రావడంతో నగరపాలక కమిషనర్ కూల్చివేతకు ఆదేశించారు. మామూళ్లు తీసుకున్న అధికారులే దగ్గరుండి ఆపని చేపట్టడం గమనార్హం.

తిరుపతిలో ఎవరైనా భవన నిర్మాణం చేపట్టారంటే కొంతమంది అధికారులు కాకుల్లా వాలిపోతున్నారు. ఏవేవో నిబంధనలు చెప్పి బెదిరిస్తారు. అడిగినంత ఇచ్చుకుంటే అటువైపు కన్నెత్తి చూడరు. బయటి వ్యక్తులు నిర్మాణంపై ఫిర్యాదు చేస్తే.. భవనం కూల్చినట్లు ఉన్నతాధికారులను ఫొటోలతో ఏమార్చుతారు. తప్పనిసరిగా కూల్చాల్సి వస్తే.. లంచం ఇచ్చిన వ్యక్తికి మొండిచేయి చూపించి కూలగొడతారు. ఈ తతంగం తిరుపతి నగరంలో సాధారణమై పోయింది.

**కక్కలేక.. మింగలేక..**

తిరుపతి నగరంలో అక్రమ భవనాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కొంతమంది అధికారులు దొడ్డిదారిన అనుమతులిస్తూ అడ్డగోలుగా జేబులు నింపుకొంటున్నారు. ఇన్నాళ్లు దర్జాగా సాగిన వీరి అవినీతి దందాకు ప్రభుత్వం కళ్లెం వేసింది. కూటమి ప్రభుత్వం అక్రమ, అనధికారక భవనాలు, అంతస్తులను కూల్చివేయాలని ఆదేశించడంతో.. కొందరి పరిస్థితి కక్కలేక.. మింగలేక అన్నట్లుగా మారింది. దీంతో కొత్త నాటకాలు ప్రారంభించారు. ఇన్నాళ్లు అక్రమ నిర్మాణాలను



ప్రోత్సహించిన అధికారులే కూల్చివేతలకు ఎగబడుతుండటంతో అక్రమ భవన నిర్మాణదారుల్లో ఆందోళన మొదలైంది. అప్పుడే అన్ని అనుమతులు తీసుకొని.. ప్రభుత్వానికి రుసుములు చెల్లించినా సరిపోయేదని ఇప్పుడు మదనపడుతున్నారు.

**అనుమతులు సాధ్యం కాదని..**

తిరుపతిలో నిషేధిత జాబితా భూములు, తితిదే భూములు, కాలువ పోరంబోకు స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. నిబంధనల ప్రకారం వీటిల్లో నిర్మాణాలకు అనుమతులు పొందడం సాధ్యం కాదు. ఇదే ఆ విభాగం అధికారులకు కలిసిస్తోంది. ఎల్ఆర్ఎస్, బీపీఎస్ సౌకర్యాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలోనూ విఫలమవుతున్నారు.

**అవగాహన లేకే..**

రాష్ట్రంలో స్థిరాస్తి వ్యాపారాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం భవన నిర్మాణాలు, లేఅవుట్ల ఏర్పాటు కోసం సింగిల్ విండో విధానాన్ని తీసుకువచ్చింది. అనుమతులు సులభతరం చేసింది. ఆన్‌లైన్ విధానంలో పలు రకాల మినహాయింపులతో గంటల వ్యవధిలోనే అనుమతులు పొందే ఏర్పాట్లు చేసింది. ఐదు అంతస్తుల భవనాలకు ప్రభుత్వ గుర్తింపు కలిగిన లైసెన్స్డ్ ఇంజినీర్ల ద్వారా దరఖాస్తు చేసి రుసుములు చెల్లిస్తే అనుమతులు సులువుగా వచ్చేస్తాయి. వీటిపై చాలామందికి అవగాహన లేకపోవడంతో అధికారులతో లాలూచీ పడుతున్నారు.

# 4.82 కోట్ల చేపపిల్లల ఉత్పత్తి



అనంతపురం : జిల్లాలో మత్స్యశాఖ ఆధ్వర్యంలోని నాలుగు క్షేత్రాల్లో 4.82 కోట్ల చేప పిల్లలను పెంచారు. అందులో ఒక్క పీఏబీఆర్ మత్స్య క్షేత్రంలో 2.06 కోట్ల పిల్లలను అత్యధికంగా ఉత్పత్తి చేసి ప్రగతి సాధించారు. పెద్ద చేప పిల్లల సరఫరాకు రాష్ట్రస్థాయిలో టెండర్లు పిలిచారు. ఒక్కో పిల్లను రూ.1.68 పైసలు చొప్పున టెండర్లు ఖరారు చేశారు. లైసెన్సు ఉన్న జలాశయాలకు ఉచితంగా పంపిణీ చేయగా, మత్స్య సహకార సొసైటీలకు రాయితీతో చేపల పిల్లలు అందించనున్నారు. 8 ఎం.ఎం. పొడవున్న 4.23 కోట్ల పిల్లలు, 100 ఎం.ఎం. 59.25 లక్షలు చొప్పున చేప పిల్లలు పెంచారు. అందులో పీఏబీఆర్ క్షేత్రంలో మత్స్య అభివృద్ధి అధికారి పెద్దబాబునాయక్ ప్రత్యేక చొరవతో 2,05,75,000 అత్యధికంగా పెంచారు. అనంతపురం క్షేత్రంలో 1.12 కోట్లు, ఎంపీఆర్ డ్యాం క్షేత్రంలో 93 లక్షలు, భైరవానితిప్ప క్షేత్రంలో 72.50 లక్షలు చొప్పున సిద్ధంగా ఉన్నాయి. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పీఎంఎంఎస్‌వై) కింద చేపపిల్లలను పంపిణీ చేయనున్నారు. మూడు జలశయాలకు ఉచితంగా: జిల్లాలోని మిడ్‌పెన్నార్ జలాశయానికి 12 లక్షలు, భైరవానితిప్పకు 10.50 లక్షలు, కడప జిల్లా గండికోట జలాశయానికి 36.75 లక్షలు చొప్పున ఉచితంగా 100 ఎం.ఎం. చేప పిల్లలను సరఫరా చేస్తారు. జిల్లాలోని 22 చెరువులకు 14.83 లక్షలు చేప పిల్లలను పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు.


**రాయితీలు ఇలా..** మత్స్య సహకార సొసైటీలకు, రైతులకు రాయితీతో పంపిణీ చేస్తారు. జనరల్‌కు 40 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం చొప్పున రాయితీ ఇస్తారు. మిగిలిన వాటా చెల్లించాల్సి ఉంటుంది.

కలెక్టర్ నుంచి అనుమతి రాగానే..

చంద్రశేఖర్‌రెడ్డి, మత్స్యశాఖ ఇన్‌ఛార్జి డీడీ

జిల్లాలో చేప పిల్లల ఉత్పత్తిలో ముందున్నాం. ఈసారి కడప జిల్లా గండికోట జలాశయానికి 36.75 లక్షల చేప పిల్లలు, ఎంపీఆర్ డ్యాం, బీటీపీకి 22.50 లక్షలు సరఫరా చేయాలని రాష్ట్ర అధికారులు కేటాయించారు. ఆ ప్రకారం చేప పిల్లలు సిద్ధం చేశాం. కలెక్టర్ అనుమతి రాగానే పంపిణీకి చర్యలు తీసుకుంటాం.

# వారధి.. కష్టాలు తీరే దారేదీ?



రాయదుర్గం: వాగులు దాటేందుకు ప్రతిఏటా ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నా.. నివారణకు వారధులు నిర్మించడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రాయదుర్గం డివిజన్‌లోని పలు గ్రామీణ ప్రాంతాల్లో వర్షాకాలం కాజ్‌వేలపై వాగులు, వంకలు ఉద్ధృతంగా పొంగి పొర్లుతుండటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. నీటి ఉద్ధృతి తగ్గేవరకు ఒకటి రెండు రోజులు కొన్ని గ్రామాలు జల దిగ్బంధంలోనే ఉండాల్సి వస్తోంది. అత్యవసర సమయాల్లో ఇతర మార్గాలను చుట్టేసి గమ్యస్థానాలు చేరుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

**క్షణక్షణం భయంతో ప్రజలు**

కణేకల్లు మండలంలోని గరుడచేడు– మీనహళ్లి నడుమ లోతట్టు వంతెన శిథిలావస్థకు చేరింది. ఇది ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. కిందటి జూన్‌లో వంతెన కోతకు గురైతే గ్రామస్థులే మట్టిపోసి తాత్కాలిక మరమ్మతులు చేసుకున్నారు. బిదురుకొంత సమీపంలో వ్యాసాపురం దారిలో పీఆర్ కల్వర్టు కూలిపోగా.. తాత్కాలికంగా మట్టి వేసుకొని గ్రామస్థులు రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలంలో కణేకల్లు– ఉరవకొండ ర.భ రోడ్డులో సొల్లాపురం వద్ద కాజ్‌వేపై వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో తరచుగా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

**అధికారులకు విన్నవిస్తున్నా..**

హనకనహాళ్– సొల్లాపురం దారిలో వర్షాకాలంలో రెండుచోట్ల వంకలు ఉద్ధృతంగా ప్రవహంతో వాహనాలు, బస్సుల రాకపోకలు నిలిచిపోతున్నాయి. హనకనహాళ్– బెళుగుప్ప నడుమ రోడ్డుపై వాగు వెళ్తుండటంతో అవస్థలు తప్పడం లేదు. హనకనహాళ్ గ్రామస్థులకు చుట్టుపక్కల గ్రామాలతో సంబంధాలు తెగిపోతున్నాయి. దీంతో ప్రజలది ఎటూ కదలని పరిస్థితి. నివారణకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందన కరవైంది. లోతట్టు కల్వర్టుల వద్ద ప్రవాహం వల్ల బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు గంటల తరబడి నిలిచిపోతున్నాయి. ఇటీవల ఓ ప్రైవేటు బస్సు రాత్రిపూట వాగులో ఇరుక్కుపోవడంతో స్థానికులు అప్రమత్తమై ట్రాక్టరు సాయంతో లాగి గట్టెక్కించడంతో ముప్పు తప్పింది. అత్యవసర సమయాల్లో ఉరవకొండకు వెళ్లేందుకు ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**ప్రతిపాదనలు పంపాం**

రవిశంకరరెడ్డి, ర.భ డీఈ

కణేకల్లు మండలంలోని లోతట్టు వంతెనలను ఇదివరకే గుర్తించాం. ఎత్తు వంతెనల నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరవగానే పనులు ప్రారంభిస్తాం. మరికొన్ని ప్రాంతాల్లోనూ ప్రతిపాదనలు తయారు చేయాల్సి ఉంది.

# మీ హెల్మెట్.. నాణ్యమైనదేనా?

తిరుపతి : శిరస్త్రాణం (హెల్మెట్) ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే జరిమానా.. ఆపై కేసులు.. డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని పోలీసు, రవాణా శాఖలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో శిరస్త్రాణధారణ తప్పనిసరిగా మారింది. పట్టుబడిన ప్రతిసారీ రూ.వెయ్యి జరిమానా చెల్లించే కంటే ఒకసారి కొంటే సరిపోతుందనే భావన ద్విచక్ర వాహనదారుల్లో వచ్చింది.సరే.. కొందామని చూస్తే ప్రతి కూడలిలో వెలసిన దుకాణాల వద్ద రూ.500 చెప్పి.. చివరకు రూ.250కి ఇస్తున్నారు. నాణ్యమైనదేనా అని అనుమానం వ్యక్తపరిచేలోగా దుకాణదారు ఐఎస్ఐ మార్క్ చూపిస్తున్నారు. ఇదే ఐఎస్ఐ మార్క్ ఉన్న హెల్మెట్ షోరూమ్‌లో రూ.700 – రూ.వెయ్యికి విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏది నిజమైన ఐఎస్ఐ మార్క్ శిరస్త్రాణమో తేల్చుకోలేక గందరగోళ పరిస్థితుల్లో ద్విచక్ర వాహనదారులు ఉన్నారు.

**ప్రాణాలకు ఎలాంటి రక్షణ**

ఫైబర్ గ్లాస్, పాలీ కార్బొనేట్, కంపోజిట్ పదార్థాలతో చేసిన హెల్మెట్ బయటి పొర మొదట దెబ్బను స్వీకరించి.. పదునైన వస్తువులను తలలోకి చొచ్చుకెళ్లకుండా అడ్డుకుంటుంది.

బయట పొర తర్వాత ఉంటే ఈపీఎస్ ప్రమాద సమయంలో మెదడుపై పడే దెబ్బ తీవ్రతను తగ్గిస్తోంది.

ఈపీఎస్ మీద ఉండే మృదువైన పొరే కంఫర్ట్ ప్యాడింగ్. హెల్మెట్ తలపై కదలకుండా ఉండేలా చూస్తుంది.


చిన్‌స్ట్రాప్ బిగువుగా లేకపోతే ఖరీదైన హెల్మెట్ కూడా పనికిరాదు.

గాలి, దుమ్ము, వర్షం, పురుగుల నుంచి కళ్లను విజర్ రక్షిస్తోంది.

శిరస్త్రాణం బయట కనిపించే కవచమే కాదు.. లోపలి పొరలూ రక్షిస్తాయి. హెల్మెట్లో గాలి ప్రసరణ, లోపల వేడి, చెమటను తగ్గించే సౌకర్యాలు వెంటిలేషన్ సిస్టమ్ సమకూర్చుతుంది.

**ఎలాంటివి పెట్టుకోవాలంటే..**

భారతీయ ప్రమాణాల సంస్థ (బీఐఎస్) రూపొందించిన ఐఎస్–



4151:2015 హెల్మెట్లు మాత్రమే పెట్టుకోవాలి. ః ఇది 1,500 గ్రాముల బరువు మించకూడదు.

అధిక బరువున్నవి మెడపై ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. ః రోజువారీ వినియోగానికి ఫుల్ ఫేస్, లోయర్ ఫేస్ కవర్ ఉన్నవి వాడాలి.

సరైన పరిమాణం, బిగువైన చిన్ స్ట్రాప్ ఉండేలా చూసుకోవాలి. ః ప్రమాదానికి గురైన హెల్మెట్, లోపల పగుళ్లు ఉన్నవాటిని వాడకూడదు.

**అధీకృత డీలర్ల వద్ద కొనండి**

నాణ్యత లేని శిరస్త్రాణం ధరించినా ప్రమాదాలకు గురైనప్పుడు ప్రాణాలకు భద్రత ఉండదు. రూ.రెండు, మూడు వందల కోసం నాసిరకం వాటిని కొన్నా ఫలితం ఉండదు. ప్రస్తుతం ఐఎస్ఐ మార్క్‌తో అందరూ మోసగిస్తున్నారు. తీసుకున్న డబ్బుకు బిల్లు ఇచ్చే అధీకృత డీలర్ల వద్ద హెల్మెట్లు కొనుగోలు చేయండి. లోపలి నిర్మాణం సరిగ్గా ఉన్న శిరస్త్రాణాలతో ప్రాణభద్రత లభిస్తుంది.

## రైట్ రైట్

తిరుపతి : తిరుపతిలోని ఏపీఎస్ ఆర్టీసీ కేంద్రీయ బస్టాండ్ స్థానంలో నూతనంగా ఇంటర్ మోడల్ బస్టాండ్(ఐఎంఎస్) నిర్మాణానికి దాదాపు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో శ్రీవారి భక్తులకు అంతర్జాతీయ ప్రమాణాలతో వసతులు కల్పించేలా బస్టాండ్ అభివృద్ధికి రోడ్డు, రవాణా, రహదారుల మంత్రిత్వశాఖకు చెందిన నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్(ఎన్‌హెచ్ఎల్ఎంఎల్) సంస్థ ముందుకొచ్చింది. గతంలో ఇందుకు సంబంధించి ఏపీఎస్ ఆర్టీసీతో ప్రాథమికంగా ఒప్పందం చేసుకుంది. ఆర్టీసీ బస్టాండ్, డిపోకు కలిపి 13 ఎకరాలు ఉండగా, అందులో కొంతభాగంలో ఆధునిక హంగులతో బస్టాండ్ నిర్మించనున్నారు.



**త్వరలో ఆర్టీసీ ఎండీ సమీక్ష**

ఇంటర్ మోడల్ బస్టాండ్ నిర్మాణానికి సంబంధించి త్వరలో తిరుపతి లేదా విజయవాడ కేంద్రంగా ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఎన్‌హెచ్ఎల్ఎంఎల్, రైట్స్ ప్రతినిధులతో సమీక్షించనున్నారు. ఈ సమీక్ష ద్వారా టెండర్ ప్రక్రియ ఓ కొలిక్కి రానుంది.

**పూర్తిగా విద్యుత్తు బస్సులు నడిపేలా..**

గతంలో డీజిల్ బస్సులను దృష్టిలో ఉంచుకొని డీపీఆర్ సిద్ధం చేశారు. కూటమి ప్రభుత్వం రానున్న రోజుల్లో ఆర్టీసీలో పూర్తి స్థాయిలో విద్యుత్తు బస్సులను నడిపేలా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఇటీవల కేంద్రం ఈ–బస్ సేవ పథకం కింద రాష్ట్రానికి 750 విద్యుత్తు బస్సులను కేటాయించింది. వీటికి అదనంగా తిరుమల–తిరుపతికి నడిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు 300 బస్సులను కోరగా అంగీకరించింది. నూతనంగా నిర్మించే ఇంటర్ మోడల్ బస్టాండ్‌లో ప్లాట్‌ఫాం వద్దే బస్సులకు ఛార్జింగ్ చేసుకునేలా, బస్టాండ్‌లో అత్యవసర నిమిత్తం మినీ డిపో గ్యారేజీ ఉండేలా చర్యలు తీసుకోనున్నారు.

## ప్రకృతికి తిరిగి ఇచ్చేయాల్సిందే..!

శ్రీకాళహస్తి :'ప్రకృతి నుంచి తీసుకుంది.. మళ్లీ ప్రకృతికి ఇచ్చేయాల్సిందే' అన్న అంతర్ సూత్రంతో శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు డాక్టర్ ఎస్.సుబ్రహ్మణ్యశర్మ మినీ ఫాస్ట్ కంపోస్టర్‌ను తయారు చేశారు. ఇటీవల నాయుడుపేటలో నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఉపాధ్యాయ విభాగంలో ఉత్తమంగా నిలిచి.. రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక కావడం విశేషం. ఆ ప్రదర్శనలో పాల్గొనేందుకు విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

**పనితీరు ఇలా..**కూరగాయల వ్యర్థాలను ఏరోబిక్ కంపోస్టింగ్ పద్ధతి ద్వారా మొక్కలకు అనువైన ఎరువుగా మార్పు చేయడం ఈ ఆవిష్కరణ ప్రధాన లక్ష్యం. కూరగాయల ద్వారా వచ్చే వ్యర్థాలు బయట పడేస్తే



కుళ్లి పోవడంతో పాటు దోమలు వృద్ధి చెందే అవకాశముంది. అదే మినీ ఫాస్ట్ కంపోస్టర్ ద్వారా వ్యర్థాలు నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాషియం ఎక్కువగా ఉన్న ఎరువుగా సిద్ధమవుతుంది. ఈ మూడు స్థూల పోషకాలు మొక్కల ఎదుగుదలకు ఎంతో అవసరం. ప్రకృతి నుంచి తీసుకున్నది మళ్లీ ఇలా తిరిగి ఇవ్వడం ఎంతో శ్రేయస్కరమని, ఇదే సూత్రంతో దీన్ని తయారు చేసినట్లు వివరించారు.

## మత్స్యకారులకు కూటమి తీపి కబురు

గూడూరు : కూటమి ప్రభుత్వం సముద్రంలో వేటకు వెళ్లే జాలర్లకు తీపి కబురు అందించింది. వారికి రాయితీతో కూడిన పడవలు, వలలు, ఇంజిన్లు ఇచ్చేందుకు సిద్ధమైంది. అర్హులైన మత్స్యకారులు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునేలా వెబ్‌సైట్ను రూపొందించారు. జిల్లాలోని వాకాడు, కోట, చిల్లకూరు, సూళ్లూరుపేట, తడ మండలాల్లో ప్రస్తుతం 479 దరఖాస్తులు వచ్చాయి.

వివరాలిలా.. జిల్లాలో తీర మండలాలు– వాకాడు, కోట, చిల్లకూరు, సూళ్లూరుపేట, తడ. తీర గ్రామాలు–25

మత్స్యకారులు– 20 వేల మంది జాలర్లు– 3753



పడవలు– 800

దరఖాస్తులు– 479

**అందించేవి ఇవే..** మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం రాయితీతో కూడిన పడవలు, వలలు, ఇంజిన్లు ఇవ్వనున్నారు. మత్స్యకారుల్లో వోబీసీలకు 40 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం రాయితీతో ఇవ్వనున్నారు. ఒక్కో యూనిట్ ఖరీదు రూ.5 లక్షలు. దీంతో పడవ, వల, ఇంజిన్ కొనుగోలు చేయవచ్చు. పడవ రూ.60 వేలు– రూ.2.50 లక్షలు, ఇంజిన్ రూ.90 వేలు – రూ.2 లక్షల వరకు ఉంటుంది. వల వంద కేజీల నుంచి 500 కేజీల వరకు రూ.1 లక్ష విలువ చేస్తుంది. ప్రభుత్వ రాయితీ పోనూ మిగిలిన మొత్తాన్ని మత్స్యకారులు డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. జిల్లా మత్స్యశాఖ అధికారి రాజేష్ వివరణ కోరగా రాయితీతో కూడిన పరికరాలు మత్స్యకారులకు అందిస్తున్నామన్నారు. దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చేసుకోవాలని సూచించారు. టెండర్లు పూర్తికాగానే త్వరలో పంపిణీ చేస్తామని చెప్పారు.

# దుకాణ దందా.. ఆపేదుందా!!

విశాఖపట్నం : వైకాపా కార్పొరేటర్లకు ఆ నాయకుడు బంధువు. గత ప్రభుత్వంలో చెరువులో దర్జాగా అనధికారికంగా చేపలు పెంచి జేబులు నింపేసుకున్నాడు. మళ్లీ ఇప్పుడు 'కాసులిచ్చి దుకాణం పెట్టుకోండి. నేను చూసుకుంటా' అంటూ అక్రమార్జనకు పావులు కదిపాడు.జీవీఎంసీ ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ లంగ్స్' కార్యక్రమంలో భాగంగా తగరపువలసలోని ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలో జాతీయ రహదారి సర్వీసు రహదారి పక్కన ఉన్న అనధికార దుకాణాలను తొలగించారు. అయితే వీటిలో కొన్ని సంగివలస కొండప్ప చెరువు గట్టు సమీపంలో ఎన్‌హెచ్ సర్వీసు రోడ్డు (676 లొకేషన్) పక్కనే రాత్రికి రాత్రే ఏర్పాటు చేశారు. ఎలాంటి సమస్య రాకుండా ఉండాలంటే ఒక్కో దుకాణానికి రూ. 30 వేలు వరకూ సదరు నాయకుడికి ఇస్తే చాలనే భరోసా ప్రచారంలో ఉంది. అంతే కాదు...ఆ నాయకుడు కూడా రెండు దుకాణాలు ఏర్పాటు చేశాడు.

**గుప్పిట్లో చెరువు:** సంగివలసలో కొండప్ప చెరువు 10 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఎలాంటి అనుమతుల్లేకుండా సదరు వైకాపా నాయకుడు గత ప్రభుత్వంలో చెరువులో చేపలు అక్రమంగా సాగు చేశాడు. ఏటా రూ.లక్షల్లో ఆదాయం జేబులో వేసుకున్నాడు. చేపల పెంపకం వల్ల నీరు దిగువకు వెళ్లే మార్గం మూసేశారు. వర్షాకాలం నీరు పోటెత్తి జాతీయ రహదారి సర్వీసు రోడ్డు నీట మునిగిపోయేది. మురుగు చెరువులో కలిసి ఆగిపోవడం, చేపలకు ఆహారంగా కోళ్ల



వ్యర్థాలు వేయడంతో దుర్వాసన వస్తుందనే ఫిర్యాదులు సైతం అందాయి. 'కూటమి' అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల తరువాతే చెరువులో చేపల సాగుకు అడ్డు కట్టపడింది.


**ఆ స్థలంపై కన్నేసి:** ఇక్కడి చెరువును దివీస్ ల్యాబ్స్ సీఎస్ఆర్ నిధులతో పార్కులా అభివృద్ధి చేశారు. గ్రీన్ బెల్ట్ కింద కొంత భాగం వదిలేశారు. ఈ స్థలంలోనే ప్రస్తుతం దుకాణాలు పుట్టగొడుగుల్లా ఏర్పాటవుతున్నాయి. వీటినిలా ఉంచేస్తే కాలువల్లో మురుగు ముందుకు వెళ్లక మళ్లీ సర్వీసు రోడ్డులో సమస్య తలెత్తుతుందని అధికారులకు కొందరు అర్జీలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్ అధికారులు స్పందించి క్రేన్, ఇతర యంత్రాలతో దుకాణాల తొలగింపునకు వెళ్లగా స్థానిక వైకాపా నాయకుడు అడ్డుకున్నారు. 'ఎన్‌హెచ్ స్థలం మూడు మీటర్లే ఉంది. రెవెన్యూ, జీవీఎంసీ అధికారులతో మేం మాట్లాడుకుంటాం' అంటూ వారిని వెనక్కి పంపినట్లు సమాచారం.

# జలజల.. గలగల

విజయనగరం: వ్యవసాయానికి ఊపిరిపోసే నీటి పారుదల రంగాన్ని గత వైకాపా ప్రభుత్వం నీరు గార్చింది. ఉమ్మడి జిల్లాలో అన్నదాతలకు కన్నీరు మిగిల్చింది. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రాధాన్యతా క్రమంలో తక్షణం పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి రామానాయుడు, జలవనరుల శాఖ అధికారులతో ఇటీవల అమరావతిలో సమావేశమయ్యారు. నివేదికలు పరిశీలించి ఉమ్మడి జిల్లాలోని నాలుగు ప్రాజెక్టులకు ప్రాధాన్యమిచ్చారు. పనులు పరుగులు పెట్టించాలని అధికారులను ఆదేశించారు.

**తారకరామ**సాగు, తాగునీటికి ఉభయతారకంగా విజయనగరం జిల్లాలో తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 16,538 ఎకరాల నూతన ఆయకట్టుతో పాటు 8,172 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ ఈ ప్రాజెక్టు లక్ష్యం. 44.40 శాతం పనులు పూర్తయ్యాయి. మూడు గ్రామాల్లో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేస్తే ప్రధాన అడ్డంకి తొలగుతుంది. సుమారు రూ.800 కోట్లలో కొంతైనా వస్తే జూన్ 2027 నాటికి ప్రాజెక్ట్ పూర్తవుతుందని అధికారులు విన్నవించారు.

**తోటపల్లి** ఉమ్మడి జిల్లాలో తోటపల్లి ప్రాజెక్ట్ ప్రధానమైంది. మూడు



జిల్లాల్లో 1,31,221 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 64 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా పనులు ప్రారంభించి 85 శాతం పూర్తిచేశారు. మిగిలిన 15 శాతం పూర్తికి రూ.290 కోట్లు అవసరం. నిర్మాణాలకు రూ.120 కోట్లు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలుకు రూ.170 కోట్లు ఇస్తే ఈ ప్రాజెక్టును వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని అధికారులు నివేదించారు.

**జంఝావతి**

అంతర్రాష్ట్ర వివాదంలో చిక్కుకున్న జంఝావతి ప్రాజెక్టు పంట కాల్వల పనులు పూర్తికి రూ.59 కోట్లు ప్రభుత్వం విడుదల చేయాలి. తమ భూభాగానికి ముంపు వాటిల్లుతుందని ఒడిశా ప్రభుత్వం మోకాలడ్డింది. ప్రస్తుతం తొమ్మిది వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తున్నారు. మిగిలిన పనులకు రూ.59 కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వానికి అధికారులు నివేదిక పంపారు. నిధులిస్తే జూన్ 2027 నాటికి పూర్తి చేస్తామని వారు పేర్కొన్నారు.

**నదుల అనుసంధానానికి..**

తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్ట్ కుడి ప్రధాన కాలువ ద్వారా నాగావళి నది నుంచి చంపావతి నదికి నీటిని మళ్లించే అనుసంధానం నిధులు రాక నిలిచిపోయింది. ఇది పూర్తయితే విజయనగర వాసుల తాగునీటి అవసరాలు తీరుతాయి. గడిగెడ్డ జలాశయం కింద 2,950 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందుతుంది. ప్రభుత్వం రూ.24.80 కోట్లకు ఆమోదించింది. ఇప్పటివరకు రూ.3.27 కోట్లతో 19.32 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన నిధులిస్తే వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని అధికారులు నివేదించారు.

**రూ.32 కోట్లు కోరాం**

ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. కనీస నిర్వహణ పనులకు రూ.32 కోట్లు అవసరమని కోరాం. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులిచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపుతామన్నారు. ఇందుకు ఒక కార్యాచరణ రూపొందించనున్నారు. త్వరలో దీనికి ఒక రూపు వస్తుందని ఆశిస్తున్నాం.స్వర్ణకుమార్, ఎస్ఈ, జలవనరుల శాఖ

# మున్సిపాలిటీ దిశ.. మారనున్న దశ



సత్యవేడు : ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా సత్యవేడు, వరదయ్యపాళెం పంచాయతీలకు మున్సిపాలిటీలుగా ఉన్నతీకరించేందుకు ప్రభుత్వం అడుగులు వేసింది. ఈ మేరకు ప్రజాభిప్రాయం, తీర్మానం చేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావడంతో పట్టణ దశ, దిశ మారనుందని ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

గత సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాటి ప్రతిపక్షనేతగా సత్యవేడులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సత్యవేడు, వరదయ్యపాళెంలను మున్సిపాలిటీలుగా తీర్చిదిద్ది అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఏడాదిన్నరలోనే ఇచ్చిన హామీని నెరవేర్చే క్రమంలో వాటికి మూడు కి.మీ. పరిధిలోని పంచాయతీలు సైతం విలీనం చేసి మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దడానికిగల సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి.

**విలీనం కానున్న పంచాయతీలివే**

సత్యవేడులో : వీఆర్‌కండ్రిగ, ఎన్ఆర్అగ్రహారం, కొత్తమారికుప్పం, కాళమనాయుడుపేట, మదనంబేడు పంచాయతీలు

వరదయ్యపాళెంలో: ఇందిరానగర్, సీఎల్ఎన్‌పల్లి, కడూరు, కాంబాక్కం, కురుంజలం, అరుదూరు, కంచరపాళెం పంచాయతీలు

**కార్యదర్శులకు నోటీసులు**

సత్యవేడు మండలంలోని ఆరు పంచాయతీలు, వరదయ్యపాళెం మండలంలోని ఎనిమిది పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఉన్నతీకరించేందుకు ప్రజాభిప్రాయం ద్వారా ఆయా పంచాయతీల నుంచి తీర్మానం చేసి నివేదించాల్సిందిగా నెలరోజుల కిందట కలెక్టరు నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గడువు ముగిసినా కార్యదర్శులు తీర్మానం పంపకపోవడంతో వివరణ కోరుతూ ఆయా పంచాయతీ కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారి నుంచి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి.

**మెజారిటీ ఆమోదం.. కొందరికి రాజకీయ ఖేదం**

తమ పంచాయతీలు మున్సిపాలిటీ పరిధిలోకి వస్తే మౌలిక వసతులు సమకూరి అభివృద్ధి చెందుతాయని పలువురు సర్పంచులు, నాయకులు ఆమోదం తెలుపుతుండగా పంచాయతీలో తమ రాజకీయ ప్రాబల్యం తగ్గిపోతుందనే కారణంగా మరికొందరు వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. తాము మండల కేంద్రానికి మూడు కి.మీ. దూరంపైగా ఉన్నందున తమకు ఆమోదయోగ్యం కాదని వరదయ్యపాళెం మండలం కంచరపాళెం, కురుంజలం పంచాయతీలు అంగీకరించలేదు. వరదయ్యపాళెం పక్కనే ప్రభుత్వ కార్యాలయాలన్నీ కొలువైన ఇందిరానగర్ సైతం తమకు అంగీకారం కాదని ఓ విపక్ష రాజకీయ నాయకుడు, స్థానిక ప్రజాప్రతినిధి వ్యతిరేకించినట్లు సమాచారం.

# పురుగే.. వణికిస్తోంది



చిత్తూరు : ఉమ్మడి జిల్లాను కొత్త వ్యాధి హడలెత్తిస్తోంది. అది చిన్న కీటకమే అయినా జ్వరాలతో జనాలను ఆసుపత్రులకు పరుగులు పెట్టిస్తోంది. స్క్రబ్ టైఫస్ అనే జ్వరం చాపకింద నీరులా వ్యాపిస్తోంది. అప్రమత్తమై చికిత్స చేయించుకుంటే ప్రమాదం లేదని వైద్యులు చెబుతున్నారు.

**లక్షణాలు**

కీటకం కుట్టిన వెంటనే బ్యాక్టీరియా శరీరంలోకి వెళ్తుంది.

పది రోజుల్లో జ్వరం వస్తుంది. తలనొప్పి తీవ్రంగా ఉంటుంది.

నిర్లక్ష్యం చేస్తే శరీరమంతా నల్లమచ్చలు ఏర్పడతాయి.

మెదడు, ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది.

వైద్య ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం జనవరి నుంచి ఇప్పటివరకు సుమారు 145 కేసులు నమోదయ్యాయి. పొరుగు రాష్ట్రాల్లో ఉంటున్న 234 మంది జిల్లా వాసుల్లో ఇది వెలుగు చూసింది. మొత్తంగా 379 కేసులు నమోదైనట్లు చెబుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే కేసులను కలుపుకొంటే ఈ సంఖ్య రెట్టింపు ఉంటుందని అంచనా. తిరుపతి జిల్లాలో 17 కేసులు నమోదయ్యాయి.

**ఎలా వస్తుంది..?**

బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ ఉన్న చిగ్గర్‌మైట్ అనే నల్లిని పోలిన కీటకం కుడితే ఈ జ్వరం వస్తుంది.

ఈ జాగ్రత్తలు తీసుకోండి..

పాత మంచాలు, పరుపులు, దిండ్లను వారానికి ఒకసారైనా శుభ్రం చేసుకోవాలి.

కాళ్లు, చేతులు కప్పి ఉండేలా దుస్తులు వేసుకోవాలి

తడి నేలలు, పొలాలు, గడ్డివాములు, పశువుల పాకల్లో, వ్యర్థాలుండే చోట ఈ పురుగు ఉండే ప్రమాదం ఉంది. జాగ్రత్తలు తీసుకోవాలి.

**పట్టించుకోని అధికారులు**

ఈ జ్వరాల కేసులు పెరుగుతున్నా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ప్రజలకు అవగాహన కల్పించడం లేదు. పైగా ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదయ్యే కేసులు, అనుమానిత కేసులను పరిగణనలోకి తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

**చికిత్సతో నయం చేయొచ్చు**– గౌరీప్రియ, ఫిజీషియన్, చిత్తూరు

జ్వరం తగ్గకుండా ఉంటే.. శరీరంపై మచ్చలేవైనా ఉంటే పరీక్షలు చేసుకోవాలి. వ్యాధి నిర్ధారణ అయితే వాటికి తగ్గ చికిత్స ద్వారా నయం చేసుకోవచ్చు.

# పగలు తవ్వకాలు.. రాత్రుళ్లు పంపకాలు



అనకాపల్లి : జిల్లాలో ఇసుకాసురులు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. దేవరాపల్లి, మాడుగుల మండలాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ప్రకృతి వనరులను దోచేస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఇటీవల మొంథా తుపాను ధాటికి జిల్లా పరిధిలోని శారదా నది ఉప్పొంగి ప్రవహించింది. చాలాప్రాంతాల్లో ఇసుక మేటలు చేరాయి. వీటిని కొల్లగొట్టేందుకు ఎక్కడికక్కడ పోటీపడుతున్నారు. జిల్లా కలెక్టరే స్వయంగా కన్నెర్ర చేసినా కానీ.. దందాకు అడ్డుకట్ట పడటం లేదు.

దేవరాపల్లి మండలం చింతలపూడి, సమ్మెద, తామరబ్బ, దేవరాపల్లి, వెంకటరాజపురం, మారేపల్లి, తిమిరాం, కలిగొట్ల, బోయిలకింతాడ నదీ పరివాహక గ్రామాలు. ఇక్కడ యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. దీంతో దేవరాపల్లి, తెనుగుపూడి, తారువ, కలిగొట్ల, గవరవరం వంతెనలకు ముప్పు వాటిల్లుతోంది.

మాడుగుల మండలం సత్యవరం, సాగరం, గొట్టివాడ అగ్రహారం, వీరవెల్లి అగ్రహారంలో ఇసుక తవ్వకాలు నిత్యకృత్యం. నది నుంచి ఒడ్డుకు ఎడ్లబళ్లతో.. అక్కడ నుంచి ట్రాక్టర్లు, లారీలతో తరలిస్తున్నారు. అధికంగా రావికమతం, పాడేరు ఏజెన్సీ ప్రాంతానికి తరలిస్తూ దూరాన్ని బట్టి సొమ్ము చేసుకుంటున్నారు.

శారదా నదిలో ఇసుక తవ్వకాలకు దేవరాపల్లి మండలంలోని ఓ గ్రామంలో కొన్నాళ్ల క్రితం వేలంపాట నిర్వహించారు. భారీ స్థాయిలో ఈ బహిరంగ వేలంలో పాల్గొని.. రూ. 30 లక్షలకు పాటపాడారు. ఇక్కడ నుంచే శృంగవరపుకోట, వేపగుంట ప్రాంతాలకు రాత్రి వేళల్లో తరలించేస్తున్నారు.

**అధికారులంతా గప్‌చుప్..**

జిల్లాలోని నది పరివాహక ప్రాంతాలవైపు అధికార యంత్రాంగం కనీసం కన్నెత్తి చూడటంలేదు. అక్రమార్కులు కూడా కొత్త పంథాకు తెరలేపారు. అర్ధరాత్రి వేళ ఒకేసారి పెద్దసంఖ్యలో లారీలతో రవాణా చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం దేవరాపల్లిలో ఇసుక అక్రమ రవాణా అధికంగా జరుగుతోందని తెలిసి.. కలెక్టరే నేరుగా ప్రతి గ్రామంలో నలుగురితో ఓ కమిటీ ఏర్పాటు చేశారు. వీరు గ్రామాల్లో ఇసుక పక్కదారి పట్టకుండా చూడాలి. కానీ.. క్షేత్రస్థాయిలో అలా జరగడం లేదు. ఇప్పటికి ఒక్క ట్రాక్టర్‌ను కూడా అడ్డుకోలేదు.

**కేసులు నమోదు చేస్తాం**

మాడుగుల, దేవరాపల్లి మండలాల్లో ఇసుక పక్కదారి పడుతున్నట్టు తెలిసింది. వాటిని కట్టడి చేసేందుకు నది పరివాహక గ్రామాల్లో కమిటీలు వేశాం. పోలీసులు సాయంతో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. అక్రమ నిల్వలు స్వాధీనం చేసుకుంటున్నాం. దారిలో కందకాలు తవ్వి అక్రమ రవాణాను అడ్డుకుంటున్నాం. అప్పటికీ నిబంధనలు పాటించకపోతే.. చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం.

శ్రీనివాస్, మైనింగ్ ఏడీ, అనకాపల్లి

# మాస్టార్లు ఎప్పుడొస్తారు?

విజయనగరం : జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయాన్ని బోధకుల కొరత వేధిస్తోంది. ఇక్కడ నియమితులైన వారిలో 15 మంది విభజనకు ముందు జేఎన్‌టీయూ కాకినాడ, నరసారావుపేటకు డిప్యుటేషన్‌పై వెళ్లి, తర్వాత ఐచ్ఛికం ఇచ్చి అక్కడే ఉండిపోయారు. వారంతా వెనక్కివస్తే కాని కొరత తీరే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం ఒప్పంద, అవర్లీ బేస్డ్ వారితో బోధన సాగిస్తున్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరమవుతోంది.

బోధకుల విషయమై జేఎన్‌టీయూ కాకినాడ, గురజాడ మధ్య నాలుగేళ్లుగా వివాదం నలుగుతోంది. ఎవరెక్కడ? అన్నదానిపై స్పష్టత కొరవడడమే దీనికి కారణంగా పేర్కొంటున్నారు. తాజాగా ఈ విషయమై గవర్నర్ దృష్టికి వెళ్లడంతో ఫ్యాకల్టీ అంతర్గత పదోన్నతులకు సంబంధించిన కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్(సీఏఎస్) తాత్కాలికంగా నిలిపివేయడంతో విషయం తెరపైకి వచ్చింది.

**శాసన మండలిలో ప్రస్తావన**

డిప్యుటేషన్‌పై వెళ్లిన వారిని వెనక్కి పంపించాలని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం అధికారులు గతంలో ప్రభుత్వానికి లేఖ రాశారు. ప్రజాప్రతినిధులకు వినతులు అందజేశారు. నాటి ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ సమస్యను అప్పట్లో మండలిలో ప్రస్తావించారు. ఎవరు ఎక్కడ వారన్న దానిపై స్పష్టత వస్తే కాని భవిష్యత్తులో నియామకాలు, పదోన్నతులు కష్టమని అధికారులు పేర్కొంటున్నారు. సమస్యపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని జేఎన్‌టీయూ గురజాడ




విద్యాలయం ఉప కులపతి వి.వి.సుబ్బారావు తెలిపారు.

**ఇదీ ప్రస్తుత పరిస్థితి**

ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం యూజీ, పీజీ ప్రోగ్రాంలకు వందమంది అధ్యాపకులు ఉండాలి. ప్రస్తుతం యూజీలో 72 మందికి 27 మంది రెగ్యులర్ అధ్యాపకులున్నారు. మిగిలిన వారంతా ఒప్పంద విధానంలో ఉన్నవారే. పీజీలో 28 మందికి అందరూ ఒప్పంద విధానంలోనే పనిచేస్తున్నారు.

యూజీ సివిల్ బ్రాంచిలో అసలు రెగ్యులర్ ఫ్యాకల్టీయే లేరు. ఈసీఈ మినహా మిగిలిన విభాగాలకు ఇద్దరు ముగ్గురే రెగ్యులర్ వారున్నారు. అధ్యాపకుల కొరతతో న్యాక్, ఎన్‌బీఏ గుర్తింపునకు వర్సిటీ దూరమవుతోంది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో విశ్వవిద్యాలయానికి చోటు లభించని పరిస్థితి ఉంది.

గతంలో మెకానికల్, ఈసీఈ, సీఎస్సీ బ్రాంచిలకు ఎన్‌బీఏ(నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్) గుర్తింపు ఉండేది. ఇప్పుడది ఈసీఈ, సీఎస్సీ బ్రాంచిలకే పరిమితమైంది.

ప్రాంగణ నియామకాలు ఒకప్పటి కంటే తగ్గుముఖం పట్టాయి. 2021-22లో 265, 2022-23లో 174, 2023-24లో 120, 2024-25 64 మందికి అవకాశాలు లభించాయి.

# మెరుగైన వైద్యసేవలకు ముందడుగు

శృంగవరపుకోట: ఎస్.కోట పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువకానున్నాయి. ప్రాంతీయాసుపత్రికి నాబార్డు నిధులు రూ.12.60 కోట్లతో చేపట్టిన కొత్త భవనాల నిర్మాణం దాదాపు పూర్తి కావడంతో రోగులకు అదనపు సౌకర్యాలు కలగనున్నాయి. ఇన్నాళ్లూ భవనాలు చాలక పలు యూనిట్లు మంజూరైనా ఏర్పాటు కాలేదు. ఓపీ చూసేందుకూ వీల్లేక ఒకే గదిలో ఇద్దరు, ముగ్గురు వైద్యులు సేవలు అందిస్తున్నారు. పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు నేలపైనే కూర్చోవాల్సిన పరిస్థితి. భవనాలు ఈ నెలలో ప్రారంభమైతే.. సమస్యలు తొలగడంతోపాటు కొత్తగా రక్తనిధి కేంద్రం, డయాలసిస్ సదుపాయం, ఆడియాలజీ, ఎక్స్‌రే విభాగం అందుబాటులోకి రానున్నాయని ఆసుపత్రివర్గాలు చెబుతున్నాయి.

**రోజుకు 15 మందికి డయాలసిస్**

ఆసుపత్రికి డయాలసిస్ కేంద్రం మంజూరైంది. పీఎం నేషనల్ డయాలసిస్ కార్యక్రమంలో భాగంగా మంజూరైన ఈ కేంద్రం ద్వారా రోజుకు మూడు సెషన్ల ద్వారా 15 మందికి రక్తశుద్ధి సదుపాయం కలుగుతుంది. ఇందుకోసం రూ.75 లక్షల విలువైన రక్త శుద్ధి యంత్రాలు, పరికరాలు సమకూర్చుతున్నారు. ప్రస్తుతం కిడ్నీ వ్యాధి బాధితులు డయాలసిస్ కోసం వ్యయప్రయాసలకు ఓర్చి విజయనగరం లేదా విశాఖ వెళ్తున్నారు.



**ఆడియాలజీ గది మంజూరు**

ఆసుపత్రికి ఆడియాలజీ గది మంజూరైంది. వినికిడి సంబంధిత రోగులు పరీక్షలు చేయించుకోవడానికి, సదరం ధ్రువపత్రాల జారీకి ఆడియాలజీ గది ఎంతో అవసరం. రూ.6.42 లక్షలతో ఈ గది నిర్మించారు.

**రక్తనిధి కేంద్రం ఏర్పాటు**

ఆసుపత్రిలో రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు 17 రకాల పరికరాల కోసం రూ.18.53 లక్షలు కేటాయించారు.

**ఎక్స్‌రే యూనిట్, ఫ్రీజర్ ఏర్పాటు**

ఆసుపత్రికి 300ఎంఏ ఎక్స్‌రే యూనిట్ మంజూరైనా స్థలం లేక ఏర్పాటు చేయలేదు. 100ఎంఏ ఎక్స్‌రే యూనిట్‌తో లాంబార్ పెయిన్(నడుం నొప్పి) వంటివి తీయడానికి వీలుపడడం లేదు.

**ఈ నెలలోనే అందుబాటులోకి..: ఎన్.భారతి, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ**

ప్రాంతీయ ఆసుపత్రి భవనాల నిర్మాణం దాదాపు పూర్తికావచ్చింది. ఈ నెలలో అందుబాటులోకి తీసుకొచ్చి, సేవలు అందిస్తాం.

చురకలు



# సంక్షేమ 'అవస్థల' గృహాలు

చిత్తూరు : వైకాపా హయాంలో సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన పేద విద్యార్థులు చలికి వణుకుతున్నా కార్పెట్లు, దుప్పట్లు ఇవ్వలేదు. జడివానతో గదుల్లోకి వర్షపు నీరు వచ్చినా కిటికీలకు మరమ్మతులు చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిసారి కుప్పంలో పర్యటించినప్పుడే ఉమ్మడి జిల్లాలోని వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. కొన్ని పనులు చేసినా మరికొన్ని సమస్యలు అలానే ఉన్నాయి. అద్దెభవనాల్లో ఇరుకు గదులు, నీటిశుద్ధి యంత్రాలు లేక విద్యార్థులు బయటి నుంచి తెచ్చుకుంటున్నారు. అక్కడక్కడా కిటికీలు దెబ్బతిన్నాయి. మెస్‌లు చిరిగిపోయాయి.
ఏడాదిన్నర వ్యవధిలో సాంఘిక సంక్షేమ వసతిగృహాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. బీసీ హాస్టళ్లపైనా కొంత ఖర్చు పెట్టినా ఆ మొత్తం సరిపోలేదు. ఆర్వో ప్లాంట్లు లేక కొందరు వార్డెన్లు బయటి నుంచి నీరు తెప్పిస్తున్నారు. పలమనేరు, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో బోరు నీళ్లే దిక్కవుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం నిధులిచ్చినా పది శాతం హాస్టళ్లలోనే ఇవి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

**రెండు జిల్లాల్లో రూ.20.97 కోట్ల ఖర్చు**



జగన్ పాలనలో సంక్షేమ వసతిగృహాల్లోనూ నాడు- నేడు కింద వసతులు కల్పిస్తామని చెప్పినా ఆచరణలోకి రాలేదు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రెండు జిల్లాల్లో రూ.20.97 కోట్లు ఖర్చు చేశారు. నెల రోజుల క్రితమే కార్పెట్లు, దుప్పట్లు ఇచ్చారు. ఈ ఏడాది మరో రూ.14 కోట్ల వ్యయంతో పనులకు ప్రతిపాదనలు రూపొందించారు. వీటిని వేగవంతం చేస్తే మిగతా సమస్యలూ తీరతాయి.

**శిథిలావస్థలో భవనాలు**

శ్రీకాళహస్తి, పూతలపట్టు, నగరి, కుప్పం నియోజకవర్గాల్లోని సంక్షేమ వసతిగృహాలు శిథిలావస్థకు చేరాయి. నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. దీంతో విద్యార్థులు ఇరుకు గదుల్లో అవస్థలు పడుతున్నారు. కుప్పం బీసీ సంక్షేమ వసతిగృహంలో పెచ్చులూడుతుండటంతో ఇటీవల 23 మందిని సాంఘిక సంక్షేమ హాస్టల్‌కు మార్చారు. ఇప్పుడు 5 గదుల్లో 68 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇక్కడ కిటికీలు దెబ్బతిన్నాయి.

# మేఘాల నడుమ.. కొండల మధ్య

అరకులోయ : పర్యాటక సీజన్ ఆరంభంతో సందర్శనీయ ప్రదేశాలు కళకళలాడుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. పర్యాటకుల వసతి కోసం ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ప్రత్యేక ప్యాకేజీలు నిర్వహిస్తోంది. విశాఖతో పాటు అరకు, అనంతగిరి, లంబసింగిలో విలాసవంత సౌకర్యాలతో అందుబాటు ధరల్లో పర్యాటకులకు గదులు సిద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా లోయలను ఆనుకొని కొండల మధ్య ప్రశాంత వాతావరణం అందరిని ఆకట్టుకుంటుందని అధికారులు చెబుతున్నారు.

**ప్రత్యేక ప్యాకేజీలతో:** పర్యాటకుల కోసం ఏపీటీడీసీ వసతులను సిద్ధం



చేసింది. గదుల వద్ద క్యాంప్‌ఫైర్, థింసా నృత్యం ఉంటాయి. బృందాలుగా, కుటుంబ సభ్యులతో వచ్చే వారికి ప్రత్యేక ప్యాకేజీలున్నాయి. బొంగు చికెన్, నాటు కోడి రుచులు అందిస్తాం' అని ఏపీటీడీసీ డీవీఎం జగదీష్ పేర్కొన్నారు.

**అద్భుతం.. అనంతగిరి:** ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థకు అనంతగిరి హిల్ రిసార్టు ఎంతో ప్రత్యేకం. కొండ వాలుకు ఆనుకొని ప్రత్యేకంగా నిర్మించిన రిసార్టు ఎంతగానో అలరిస్తుంది. ఏసీ సూట్ గదుల నుంచి చూస్తే ప్రకృతి అందాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి.

**లంబ సింగిలో:** లంబసింగిలోని హరితా రిసార్టు పచ్చని కొండల నడుమ అలరిస్తుంది. తెల్లవారుజాము పొగమంచు, చల్లటి వాతావరణంతో సందర్శకులను మైమరపిస్తుంది. ఇక్కడి గదులు రూ.4 వేల నుంచి అందుబాటులో ఉన్నాయి.

# కదిలేనా.... కలగానే మిగిలేనా

అచ్యుతాపురం : పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం ప్రజాభిప్రాయ సేకరణకే పరిమితమైంది. గత వైకాపా ప్రభుత్వం హార్బర్ ఏర్పాటుపై రెండేళ్లపాటు హడావుడి చేసి ఎన్నికల ముందు గాలికొదిలేసింది. ఫలితంగా మత్స్యకారులకు ఎదురుచూపులు తప్పడం లేదు.
20 వేల జనాభాగల పూడిమడక రాష్ట్రంలోనే అతిపెద్ద మత్స్యకార గ్రామం. విశాఖపట్నం హార్బర్ తరవాత అతి ఎక్కువగా చేపలవేట సాగించేది ఇక్కడే. గ్రామంలోని 90 శాతం మందికి ఇదే జీవనాధారం. వైకాపా ప్రభుత్వం ఇక్కడ ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని ప్రకటించింది. దీనికి గ్రామంలోని సర్వే నం. 139లో ప్రాజెక్టుకు అవసరమైన భూమిని గుర్తించింది. 2020 డిసెంబర్ 31న ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. మత్స్యకారులంతా పార్టీలకు అతీతంగా ప్రాజెక్టును ఆహ్వానిస్తూ మాట్లాడారు. రోజూ చేపల వేటకు బోట్లను మోసుకుంటూ వెళ్తుండడం చాలా కష్టంగా ఉంటోందని, హార్బర్ నిర్మాణం పూర్తయితే ఈ కష్టాలు తీరిపోతాయని ఆశించారు. నిర్మాణానికి రూ.350కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన అనుమతి ఇచ్చిన వైకాపా ప్రభుత్వం నిర్మాణానికి టెండర్లు పిలవకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. దీంతో మత్స్యకారుల ఆశలన్నీ అడియాశలయ్యాయి. ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు ఆదిలోనే అటకెక్కినట్లయింది.
మత్స్యకారుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ కూటమి ప్రభుత్వం పూడిమడక ఫిషింగ్ హార్బర్ నిర్మాణంపై దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టుపై సాంకేతిక నిపుణులతో ప్రత్యేకంగా అధ్యయనం చేయించింది. నూతన సాంకేతికత వినియోగించి తక్కువ వ్యయంతో తక్కువ సమయంలో ప్రాజెక్టు పూర్తయ్యేలా నివేదిక అందివ్వాలని కోరింది. దీంతో నిపుణులు వచ్చి ప్రాజెక్టుపై విచారణ చేసినా ఇంకా పనులు ప్రారంభం కాలేదు. పూడిమడకలో తీరం తరచూ కోతకు గురవుతుండటం, కెరటాల తాకిడికి పడవలు, వలలు దెబ్బతినడం మత్స్యకారులు ఎన్నెన్నో ఇబ్బందులు పడుతున్నారు.

పూడిమడక జనాభా : సుమారు 20 వేలు
బోట్లు : 600 వరకు
హార్బర్‌కు ఎంపిక చేసిన భూమి : 37 ఎకరాలు
ప్రతిపాదిత వ్యయం : రూ. 350 కోట్లు

# సొంతింటి కల సాకారం దిశగా!



అనంతపురం : సొంతిళ్లు నిర్మాణం కోసం పేదల నుంచి భారీగా డిమాండ్ కని స్తోంది. గత వైకాపా హయాంలో ఊర్లకు ఊళ్లు నిర్మించామంటూ ఊదరగొట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సొంతిల్లు, స్థలం కావాల్సిన వారు, సొంత స్థలం ఉండి ఇళ్లు కావాల్సిన వారి వివరాలను క్రోడీకరిస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ ఇళ్లు కావాలంటూ పేదలు కోరుతున్నారు. నిజంగా వైకాపా హయాంలో పేదలు అందరికీ ఇళ్లు నిర్మించి ఉంటే ఇంత డిమాండ్ ఏర్పడేది కాదని స్పష్టం అవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటి నిర్మాణాలకు పలు వెసులుబాట్లు కల్పించడంతో ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తున్నట్లు స్పష్టం అవుతోంది.

**సాగని ఇంటింటా సర్వే!**

గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇళ్లు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ప్రత్యేకంగా ఆవాస్ యాప్‌ను తీసుకొచ్చి నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఎవరికి అవసరమో వారి వివరాలను ముఖ ఆధారిత, వేలి ముద్రలు ద్వారా వివరాలు యాప్‌లో అనుసంధానం చేయాల్సి ఉంటుంది. పలు గ్రామాల్లోని ఇంజినీరింగ్ సహాయకులు సచివాలయాలకు వచ్చిన వారికి మాత్రమే ముఖ ఆధారిత వివరాలు నమోదు చేస్తున్నారు. సొంత స్థలం ఉంటే స్థలంతోపాటు లబ్ధిదారుల వివరాలను స్థలం ఉన్న ప్రదేశంలోనే చేయాల్సి ఉండటంతో వెళుతున్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే చేస్తే ఇంకొంత మంది పేదలకు సొంతిళ్లు సాకారం అయ్యే అవకాశం ఉంటుంది. గత నెల 30 నాటికి గడువు ముగిసినా ఇంకొంత మందికి లబ్ధి చేకూరాలనే ఉద్దేశంతో ఈనెల 14 వరకు గడువు పొడిగించారు.

**సద్వినియోగం చేసుకోవాలి**

సచివాలయం సిబ్బంది కచ్చితంగా ఇంటింటా సర్వే చేసి వివరాలు అనుసంధానం చేయాలి. ఈనెల 14 వరకు గడువు పొడిగించారు. ఆలోపు ఇంకా ఎవరైనా లబ్ధిదారులు ఉంటే సంబంధిత సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.
శైలజ, గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు అధికారిణి

నియోజకవర్గం- దరఖాస్తుదారులు
కళ్యాణదుర్గం 12,210
రాయదుర్గం 9,142
ఉరవకొండ 9,468
రాప్తాడు 9,319
శింగనమల 6,920
తాడిపత్రి 6,308
గుంతకల్లు 5,038

# ఖనిజ సంపద దోపిడీ



పెద్దవడుగూరు : ఆ ప్రాంతంలో ఏ భూముల్లో చూసినా విలువైన భూగర్భ ఖనిజాలు ఉంటాయి. దీంతో సదరు భూముల ధరకు రెక్కలొచ్చాయి. ఎకరం రూ.అరకోటి పైమాటే. ఉమ్మడి అనంత జిల్లాలో అత్యధికంగా పెద్దవడుగూరు మండలం కొండుపల్లి, క్రిష్టిపాడు గ్రామాల పరిధిలో సుమారు 36 భూగర్భగనులు ఉన్నాయి. కొందరికి మాత్రమే అనుమతులు ఉండగా మరికొందరు అడ్డగోలుగా భూగర్భగనుల్లో తవ్వకాలు జరిపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా భూములకు విలువ పెరుగుతూ వస్తోంది. మరోవైపు రాజస్థాన్‌లో భూగర్భగనులు బంద్ కావడంతో ప్రస్తుతం ఇక్కడి వాటికి డిమాండ్ పెరిగింది. అక్రమార్జనే ధ్యేయంగా తవ్వకాలు సాగిస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. రోజూ వేల టన్నుల ఖనిజం తరలిపోతున్నా అటవీ, రెవెన్యూ, గనుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. రెండు గ్రామాల పరిధిలోని భూగర్భంలో స్టియటైట్, డోలమైట్, సున్నపురాయి ఉన్నాయి. ఇందులో స్టియటైట్‌కు మంచి గిరాకీ ఉంది. దీంతో తవ్వకాలు జరిపి.. జేబులు నింపుకోవడానికి అక్రమార్కులు పోటీ పడుతున్నారు.

**రహదారుల కింద సైతం..**కొండుపల్లి సమీపంలో అటవీ భూములు వందలాది ఎకరాల్లో ఉన్నాయి. సర్వే నంబరు 302-ఎలో 267.69 ఎకరాలు.. 1007 సర్వేనంబరులో 715.30 ఎకరాలతోపాటు కొండలు విస్తరించి ఉన్నాయి. అనుమతి గనుల పక్కనే ఉన్న అటవీభూముల వైపు తవ్వకాలు జరిపి విలువైన ఖనిజ సంపదను దోచుకుంటున్నారు. ఇదిలా ఉండగా గ్రామాలకు వెళ్లే రహదారుల కింది భాగంలో తవ్వకాలు జరిపి అక్రమార్జనకు తెరలేపారు. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తే ఎప్పుడు కుంగిపోతాయోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండుపల్లి, క్రిష్టిపాడు ప్రాంతాల్లో 16 గనులకే అనుమతులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇటీవల అధికారులు తూతూమంత్రంగా దాడులు చేసి వెళ్లారు. తిరిగి అక్రమార్కులు తవ్వకాలు సాగిస్తూ ఖనిజ సంపదను కొల్లగొడుతున్నారు.

**పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం**

కొండుపల్లి ప్రాంతంలోని అటవీభూముల్లో కొందరు భూగర్భంలో తవ్వకాలు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తవ్వకాలు జరిపిన వారిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.నారపరెడ్డి, అటవీశాఖ సెక్షన్ అధికారి, గుత్తి

# భావితరాల భాండాగారం



తిరుపతి : ముక్తిని ప్రసాదించే తిరుపతి పుణ్యక్షేత్రం అతి పురాతన తాళపత్ర గ్రంథాలను తనలో దాచుకుంది.. వేద, ఉపనిషత్తులను సంరక్షిస్తూ భావితరాలకు అందిస్తోంది. అందుకు వేదికగా నిలుస్తోంది శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ప్రాచ్య పరిశోధనా సంస్థ (ఓఆర్ఐ).

**పునర్ ముద్రణలు**

అముద్రిత గ్రంథాలను పరిష్కరించి వెలుగులోకి తేవడమే కాకుండా, ఎప్పుడో ముద్రించినా ఇప్పుడు అందుబాటులో లేని వాటిని తితిదే సహకారంతో పునర్ ముద్రిస్తోంది.

**బీజం ఇలా..**

నాటి మద్రాసు ముఖ్యమంత్రి పానగల్ రాజు ఆలోచనతో 1937లో తిరుపతిలో శ్రీవేంకటేశ్వర ఓరియంటల్ ఇన్‌స్టిట్యూట్‌కు బీజం పడింది. ఈ సంస్థ నాటి డైరెక్టర్ రంగస్వామి అయ్యంగార్ దేశం నలుమూలలకు పండితులను పంపి సంస్కృతం, తెలుగు, తమిళ భాషలకు చెందిన 10 వేలకు పైగా రాత ప్రతులు, 20 వేలకు పైగా ముద్రిత గ్రంథాలను సమీకరించారు. సంస్థను 1956లో ఎస్వీయూలో విలీనం చేసి ప్రాచ్య పరిశోధన సంస్థ (ఓఆర్ఐ)గా పేరు మార్చారు.

**పరిశోధన:** పీహెచ్‌డీ, ఎంఫిల్ డిగ్రీల కోసం అముద్రిత గ్రంథాలను వీలైనంత వరకు పరిశోధనాంశాలుగా ఇస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు 94 పీహెచ్‌డీలు, అనేక ఎంఫిల్ డిగ్రీలు వచ్చాయి.

**గ్రంథాలయాల్లోనూ..** ఇక్కడి గ్రంథాలయాల్లో గజవైద్యము, గణితశాస్త్రము, గారడీ విద్య, వాస్తుసారము, శకునశాస్త్ర గ్రంథాలు, రామాయణ, మహాభారత, కావ్య, ప్రబంధ, శాస్త్రాలకు సంబంధించిన మొదటి ముద్రణ గ్రంథాలున్నాయి.

**గ్రంథ పరిష్కారం.. సంరక్షణ**

భారతీయ సంస్కృతిని తెలిపే తాళపత్రాలు, రాతప్రతులు, అమూల్య గ్రంథాలను పరిష్కరించి సంరక్షించడంతో పాటు భావితరాలకు అందించేందుకు డిజిటలైజ్ చేస్తున్నారు.
వీటిని వెబ్‌సైట్: %www. svuori.com%లో అందుబాటులో ఉంచుతోంది.

# కాపరు వైరు.. స్వాహా

చిత్తూరు : విద్యుత్తు సరఫరా సంస్థల్లో ఒకటైన ఏపీ ట్రాన్స్‌కో దోపిడీకి వేదికగా మారింది. గత ప్రభుత్వ పెద్దల అండదండలతో చిత్తూరు డివిజన్ ముందున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ డివిజన్ అధికారి చెప్పిందే వేదమని, ఆయన కనుసన్నల్లోనే అన్నీ జరుగుతున్నాయని, ఇప్పుడు ట్రెంచ్‌లైన్‌లోని కాపర్ వైరును దిగమింగినట్లు సిబ్బంది ఆరోపిస్తున్నారు. చిత్తూరు గిరింపేటలో 220 కేవీ ఉపకేంద్రం 50-60 ఏళ్ల కిందట నిర్మించారు. ఇక్కడి నుంచే ఐరాల, పాకాల, నూనెగుండ్లపల్లెల్లోని 132 కేవీ ఉప కేంద్రాలకు విద్యుత్తు సరఫరా అవుతోంది. సరఫరా ఆన్-ఆఫ్‌కు ఏపీసీబీ బ్రేకర్ వినియోగించేవారు. ఇందుకు ప్రత్యేకంగా ట్రెంచ్ కాపర్ లూప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఇలా ఏడు వరుసల్లో సుమారు మూడువేల మీటర్లు ఉంటుందని చెబుతున్నారు. తదనంతరం ఆటోమెటిక్ బ్రేకర్లు రావడంతో వాటి అవసరం లేకుండా పోయింది.



**దండుకుందిలా..**

ఉపకేంద్రం ప్రాంగణంలో ట్రెంచ్ కాపర్‌రాడ్ లూప్‌లైన్ కనబడకుండా పైభాగంలో పలకలు అమర్చారు. ఇటీవల ఉపకేంద్రం నుంచి కాపర్‌రాడ్డును రాత్రి వేళ పక్కదారి పట్టించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు ఒప్పంద ఉద్యోగులను పురమాయించినట్లు సమాచారం. ఇలా 3-4 టన్నుల కాపర్ స్వాహా చేసినట్లు తెలిసింది. గతేడాది డివిజన్ పరిధిలోని ఉపకేంద్రాల్లో 20 ఏళ్లుగా నిల్వఉన్న రూ.లక్షల విలువచేసే పాత పరికరాలు, అల్యూమినియం, కాపర్ తీగలు, స్టీల్ పరికరాలు ఇంటి దొంగలే పక్కదారి పట్టించిన ఘటన వెలుగుచూసింది. **అక్రమాలకు తావులేదు..: చిన్నబ్బ శేఖర్, ఈఈ, ట్రాన్స్‌కో**గిరింపేటలోని 220కేవీ ఉపకేంద్రంలో కాపర్ రాడ్ అక్రమంగా తరలించే ఆస్కారం లేదు. అక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే సస్పెండ్ చేస్తాం.

# ఎంఎస్‌ఎంఈ పార్కు పనులకు గ్రహణం

బొబ్బిలి : రామభద్రపురం మండలం కొట్టక్కి సమీపంలో కాకర్లవలస- కారేడువలస మధ్య ఎంఎస్‌ఎంఈ పార్కు పనులకు గ్రహణం వీడడంలేదు. ఇక్కడ ఏపీఐఐసీకి 187 ఎకరాల స్థలం ఉంది. దీంట్లో 87 ఎకరాల్లో పార్కు ఏర్పాటుకు ఈ ఏడాది మే 10న మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే బేబినాయన భూమిపూజ చేశారు. రూ.7 కోట్లతో టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి ఆ భూములపై వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. కొంతమంది రైతులు తమకు ఈ భూముల్లో పట్టాలు ఇచ్చారని అభ్యంతరం తెలుపుతున్నారు. ఆరు నెలలు గడిచినా ఒక్క అడుగూ ముందుకెళ్లలేదు.

**కొలిక్కిరాని చర్చలు**

అధికారులు ఆందోళనకారుల మధ్య ఇటీవల ఆర్డీవో కార్యాలయంలో



చర్చలు జరిగాయి. కాకర్లవలస- కారేడువలసకు చెందిన 20 మంది రైతులకు 2017లో అటవీశాఖ పోడు పట్టాలు ఇచ్చినట్లు చూపుతున్నారు. ఏపీఐఐసీ కూడా పార్కు కోసం ఆయా భూములను కొనుగోలు చేసినట్లు దస్త్రాల్లో ఉంది. రైతుల పట్టాలు ఒక చోట ఉన్నాయని, కానీ ఏపీఐఐసీ భూముల్లో సాగుచేశారని అధికారులు నిర్ధారించారు. పట్టాల్లోని భూమిని చదునుచేసి రైతులకు ఇస్తామని భరోసా ఇచ్చారు. అయినప్పటికీ గిరిజనులు వినిపించుకోలేదు. దీంతో వివాదం తేలలేదు. అధికారులు కొనుగోలు చేసిన నాటి నుంచి భూములకు సరైన రక్షణ చర్యలు చేపట్టలేదు. కంచె ఏర్పాటు చేసి బోర్డులు ఏర్పాటు చేస్తే ఈ సమస్య వచ్చేది కాదు. ఇప్పుడు పార్కు పనులు ప్రారంభమయ్యాక అసలు సమస్య మొదలైంది.

**మాట్లాడుతున్నాం..: రఫీ జాన్ ఆజూ, తహసీల్దారు, రామభద్రపురం**

ఏపీఐఐసీ భూముల్లోనే పార్కు నిర్మాణం జరుగుతోంది. గిరిజనులకు ఇచ్చిన పట్టాలకు సంబంధించిన భూములను అప్పగిస్తామని చెప్పాం. అప్పటికీ వినకపోతే కేసులు పెడతాం. సంబంధిత లబ్ధిదారులకు న్యాయం చేస్తాం. ఆందోళన చెందాల్సిన పనిలేదు. ప్రభుత్వ పరంగా చేపట్టే పనులు అడ్డుకోవడం చట్టరీత్యా నేరం.

# అన్నవరంలో మరిన్ని వసతి గదులు

అన్నవరం : అన్నవరం ఆలయంలో భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా, సమయం ఆదా అయ్యేలా ఆన్‌లైన్ సేవలను విస్తృతం చేస్తున్నారు. ఇందులో భాగంగా దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలకు అనుగుణంగా ఆలయంలో ఉన్న గదుల్లో 70 శాతం గదులను ఆన్‌లైన్‌లో సోమవారం నుంచి అందుబాటులో ఉంచారు. రత్న, సత్యగిరులపై వివిధ వసతిసముదాయాల్లో సుమారు 480 గదులున్నాయి. ఇందులో 70 శాతం (336 గదులు) ఆన్‌లైన్లో ఉండగా భక్తులు %aptemples.org% ద్వారా, మన మిత్ర వాట్సాప్ నంబరు 95523 00009 ద్వారా బుకింగ్ చేసుకోవచ్చు. అమలు సాధ్యమేనా..అన్నవరంలో వసతిగదులకు డిమాండ్ ఉంటుంది. వ్రతాలు, వివాహాలు జరుగుతాయి. వివాహాలకు ముందుస్తుగా విష్ణుసదన్‌లో హాల్స్ బుకింగ్ చేసుకునేవారికి 2 గదులను కేటాయిస్తారు. ఇక్కడ 32 హాల్స్ ఉన్నాయి. అన్ని హాల్స్ బుకింగ్ అయితే 64 గదులు కేటాయించాలి. ఇతర ప్రదేశాల్లో వివాహాలు చేసుకునేవారికి గదులివ్వాలి. ఇలా సుమారు 30 శాతానికి పైగా వివాహలకు కేటాయించగా, 70 శాతం ఆన్‌లైన్లో ఉంచితే నేరుగా అన్నవరం వచ్చే వారికి గదులు దొరికే పరిస్థితి ఉంటుంది. సాధారణ రోజుల్లో బాగున్నా.. రద్దీ రోజుల్లో ఇబ్బంది ఎదురవుతుంది. దీనికి తోడు సిఫార్స్ లేఖల తాకిడీ ఉంటుంది.

చురకలు



## బ్లాక్ వెల్వెట్ చీరలో ఫాతిమ నాజూకు సొగసు

దంగల్ ఫేం ఫాతిమా సనా షేక్ చురుకైన హావభావాలు, ఫ్యాషన్ సెన్స్ కి ప్రత్యేకించి ఫ్యాన్సున్నారు. ఇటీవల ఈ బ్యూటీ బొద్దుతనం నుంచి మారిపోయి, సన్నజాజి తీగలా మెరిసిపోతోంది. మొన్నటికి మొన్న ఓ ఇంటర్వ్యూలో ఈ బ్యూటీ చెప్పిన కొన్ని వ్యక్తిగత అనారోగ్య సమస్యలు నిజంగా అభిమానులకు షాకిచ్చాయి. తనకు అదుపు తప్పి తినే అలవాటు ఉందని, దానివల్ల చాలా బరువు పెరిగానని, తిండిని కట్టేసే శక్తి తనకు లేదని ఫాతిమా చెప్పింది. తినడానికి ఏదైనా ఉంటే, గంటల తరబడి తినగలనని అది చూసి సహచరులు ఝుడుసుకుంటారని కూడా చెప్పింది. బాగా తినే అలవాటు చాలా పెద్ద సమస్య. సెట్ లో అందరూ చూస్తుంటే సిగ్గుగా ఉండేదని కూడా చెప్పింది. కానీ ఇప్పుడు దానిని అధిగమించానని తెలిపింది. ఫాతిమా ఆహార నియమాలను మార్చుకుంది.. చికిత్సను తీసుకుంది. ఫిట్ లుక్ కోసం జిమ్ లో చాలా శ్రమిస్తోంది. ఇటీవల టోన్డ్ లుక్ ను సాధించింది.. రూపం చాలా మారింది. అందాల ఫాతిమ ఇప్పుడు సన్నజాజి తీగను తలపిస్తోంది. తాజాగా విడుదలకు సిద్ధమవుతున్న



గుస్తాక్ ఇష్క్ సినిమా ప్రమోషన్లలో ఫాతిమా నల్ల రంగు వెల్వెట్ చీర ధరించి గుబులు రేపిన ఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారాయి. ఇది వింటర్ ఎడిషన్.. బ్లాక్ వెల్వెట్ చీరకు తగ్గట్టుగా, కిల్లర్ కటౌట్ బ్లౌజ్, బోల్డ్ ఎమరాల్డ్ లాకెట్టు ధరించిన ఫాతిమా చాలా స్పెషల్ గా కనిపిస్తోంది. రెడ్ కార్పెట్ పై ఈ బ్యూటీ కిల్లింగ్ గా కనిపించింది. ప్రస్తుతం ఫాతిమా ఐకానిక్ ఫోజులు ఇంటర్నెట్ లో వైరల్‌గా మారుతున్నాయి. ఎత్తైన నెక్‌లైన్, పాలిష్ చేసిన ఫ్రంట్ కటౌట్, చిన్న స్ట్రక్చర్డ్ స్లీవ్‌లు, సైడ్ కట్ స్టైలింగ్ పీస్ తో బ్లౌజ్ కూడా ఈ చీరకు అంతే మ్యాచ్ అయింది. ఫాతిమా లుక్ కేవలం స్టైలింగ్ వల్లనే కాదు.. తన హొయలుతోను మరో స్థాయి ఎలివేషన్ కి చేరుకుంది. ఫోటోషూట్ కోసం అందమైన భంగిమలతోను దంగల్ బ్యూటీ గుబులు రేపింది. మనీష్ మల్హోత్రా ఈ డిజైనర్ చీర - అందమైన బ్లౌజ్‌ను డిజైన్ చేసారు. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. ఫాతిమ నటించిన తాజా చిత్రం %-%గుస్తాక్ ఇష్క్%-% ట్రైలర్ ఇటీవలే విడుదలైన సంగతి తెలిసిందే. ఇందులో విజయ్ వర్మ కథానాయకుడిగా నటించగా, నసీరుద్దీన్ షా ఫాతిమా తండ్రిగా నటించారు. ఇది ఒక అందమైన రొమాంటిక్ లవ్ స్టోరి. సంగీతం నేర్చుకోవడానికి వచ్చిన యువకుడు గురువు కుమార్తెను ప్రేమించాక ఏం జరిగిందనేదే ఈ సినిమా. ఇందులో ఫాతిమా నటనకు ఆస్కారం ఉన్న పాత్రను పోషించింది. ఈనెల 28న సినిమా విడుదల కావాల్సి ఉండగా, ఈరోజు ముంబైలో సెలబ్రిటీ ప్రీమియర్ ని చిత్రబృందం ప్లాన్ చేసింది. కానీ హీమ్యాన్ ధర్మేంద్ర మృతి అనంతరం సంస్మరణం గౌరవార్థకంగా ప్రీమియర్ ని చిత్రబృందం వాయిదా వేసుకుంది.

## ఎల్లమ్మ.. ఇబ్బందులు దాటేదెలా..?

బలగం సినిమాతో సూపర్ హిట్ అందుకున్న వేణు యెల్దండి తన రెండో సినిమాను ఎల్లమ్మ అంటూ ప్రకటించాడు. దాదాపు రెండేళ్ల నుంచి ఆ సినిమా స్క్రిప్ట్ మీద కూర్చున్న వేణు అదిరిపోయేలా కథ రాసుకున్నాడు. సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ మొత్తం పూర్తైంది. బలగం లాంటి హిట్ ఇచ్చాడు కాబట్టి ఈసారి వేణు కోరినంత బడ్జెట్ ఇచ్చేందుకు దిల్ రాజు డిసైడ్ అయ్యారు. ఇక సినిమా మొదలు పెట్టడమే తరువాయి అనుకుంటున్న టైం లో ఎల్లమ్మ కాస్టింగ్ పై జరుగుతున్న చర్చలు షాక్ ఇస్తున్నాయి.

**తమ్ముడు డిజాస్టర్ అవ్వడంతో..** ముందు ఈ సినిమాలో హీరో ఎవరన్నది ఇప్పటికీ సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఎల్లమ్మ సినిమాను ముందు నానితో చేయాలనుకున్నాడు వేణు కానీ హీరోయిన్ పాత్రకు ఎక్కువ ఇంపార్టెన్స్ ఉండటం వల్ల అతను కాదన్నాడట. ఇక రేసులో నితిన్ వచ్చాడు. ఐతే దిల్ రాజు, నితిన్ చేసిన తమ్ముడు డిజాస్టర్ అవ్వడంతో నితిన్ తో ఎల్లమ్మ కూడా రిస్క్ అని భావించాడు దిల్ రాజు. అందుకే ఎల్లమ్మలో నితిన్ దాదాపు కన్ ఫర్మ్ అని చెప్పి మరీ



అతన్ని బయటకు వెళ్లేలా చేశారు. ఇక శర్వానంద్ తో పాటు బెల్లంకొండ శ్రీనివాస్ కూడా ఈ సినిమాలో నటిస్తాడన్న వార్తలు వచ్చాయి. వీరవరు కాదు మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాలో నటిస్తున్నారని అంటున్నారు. ఐతే ఎల్లమ్మ హీరో గురించి ఇంతగా డిస్కషన్ జరుగుతుండగా హీరోయిన్ గా కీర్తి సురేష్ ఫైనల్ అని అనుకున్నారు. వేణు ఈ సినిమాలో ముందు సాయి పల్లవిని హీరోయిన్ గా అనుకోగా ఆమె ఈ సినిమా చేయడానికి డేట్స్ అడ్జెస్ట్ కావని చెప్పడంతో ఆ ఆఫర్ కీర్తి సురేష్ కి వచ్చింది.

**ఇప్పుడు హీరోయిన్ కూడా లేదన్న మ్యాటర్..** ఐతే లేటెస్ట్ గా కీర్తి సురేష్ తన కొత్త సినిమా రిలీజ్ ప్రమోషన్స్ లో ఎల్లమ్మలో తాను నటించట్లేదని చెప్పి షాక్ ఇచ్చింది. ఎల్లమ్మ సినిమాలో ఇన్నాళ్లు హీరో మాత్రమే కన్ ఫర్మ్ అవ్వలేదని అనుకుంటుండగా ఇప్పుడు హీరోయిన్ కూడా లేదన్న మ్యాటర్ అర్థమైంది. కీర్తి సురేష్ ముందు చేయాలని అనుకుని తర్వాత కాదన్నదా లేదా ఆమె ముందు నుంచి రిజెక్ట్ చేసిందా అన్నది తెలియాల్సి ఉంది. కీర్తి సురేష్ ఎల్లమ్మ కామెంట్స్ పై ఆడియన్స్ అంతా షాక్ అవుతున్నారు. కీర్తి కాకపోతే ఎల్లమ్మ లో ఫిమేల్ లీడ్ గా ఎవరికి ఛాన్స్ ఇస్తారు.. సినిమాలో హీరోయిన్ పాత్ర వెయిట్ ఎక్కువ ఉంటుందని తెలిసినా కూడా ఎవరు ఈ ప్రాజెక్ట్ పై ఎందుకు ఆసక్తి చూపించట్లేదు అన్నది తెలియాల్సి ఉంది. మరి దిల్ రాజు ప్రొడక్షన్ లో ప్రెస్టీజియస్ గా రాబోతున్న ఎల్లమ్మ మీద ఇన్ని రకాలుగా డిస్కషన్ జరగడం కొత్తగా ఉంది. మరి వీటన్నిటికీ ఆన్సర్ ఇస్తూ ఎస్.వి.సీ బ్యానర్ నుంచి ఏదైనా అప్డేట్ వస్తే బెటర్ లేదంటే సినిమా మీద ఉన్న ఇంట్రెస్ట్ కాస్త పడిపోయే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు.




## శర్వా బైకర్.. రేసులో ఊహించని బ్రేక్




సినిమా ఇండస్ట్రీలో రిలీజ్ డేట్ అనౌన్స్ చేశాక వెనక్కి తగ్గడం అంటే ఫ్యాన్స్ కు కొంచెం నిరాశ కలిగించే విషయమే. చార్మింగ్ స్టార్ శర్వానంద్ నటిస్తున్న 'బైకర్' సినిమా విషయంలో కూడా ఇప్పుడు అదే జరిగింది. డిసెంబర్ 6న థియేటర్లలో దుమ్మురేపడానికి సిద్ధమైన ఈ రేసర్, సడెన్ గా బ్రేక్ వేశాడు. అయితే ఈ వాయిదా వెనుక సాధారణ కారణాలు కాకుండా, ఒక మైండ్ బ్లోయింగ్ ప్లాన్ ఉందని మేకర్స్ ఇచ్చిన అప్డేట్ ఇప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తోంది. సాధారణంగా పోస్ట్ ప్రొడక్షన్ లేట్ అయ్యిందో, షూటింగ్ అవ్వలేదో వాయిదా వేస్తుంటారు. కానీ 'బైకర్' టీమ్ ఆలోచన వేరే లెవెల్ లో ఉంది. కేవలం సినిమాను చూపించడమే కాదు, ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని ఇవ్వాలని డిసైడ్ అయ్యారు. అందుకే అనుకున్న తేదీకి రాలేకపోతున్నామని, కానీ తిరిగి వచ్చేటప్పుడు మాత్రం అంతకు మించి ఉంటుందని ఒక అఫిషియల్ నోట్ ద్వారా క్లారిటీ ఇచ్చారు. అసలు విషయం ఏంటంటే.. 'బైకర్' సినిమా విడుదల వాయిదా పడింది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాని రెడీ చేయడానికి తమ కాస్ట్ అండ్ క్రూ నిద్రలేని రాత్రులు గడిపారని, అయితే అవుట్ పుట్ చూసాక ఇది కేవలం స్క్రీన్ మీద చూసే సినిమా మాత్రమే కాదని, అంతకు మించిన ఎక్స్‌పీరియన్స్ అని అర్థమైందని మేకర్స్ తెలిపారు. ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు సరికొత్త టెక్నాలజీతో తీసుకురాబోతున్నారు. కేవలం 2Dలోనే కాకుండా, 3D మరియు 4DX ఫార్మాట్లలో కూడా 'బైకర్' రిలీజ్ కానుందట. రేసింగ్ సన్నివేశాలు, హై యాక్షన్ సీక్వెన్సులు 4DX లో చూస్తే ఆ కిక్కే వేరుగా ఉంటుంది. ఆ అడ్రినలిన్ రష్ ను ఆడియన్స్ కు ఫీల్ అయ్యేలా చేయడానికే ఈ సమయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. తెలుగు సినిమా ఇప్పటివరకు చూడని భారీ స్కేల్ లో ఈ సినిమా ఉండబోతోందని చిత్ర యూనిట్ నమ్మకంగా చెబుతోంది. "హెల్మెట్లు టైట్ గా పెట్టుకోండి.. లైఫ్ టైమ్ రైడ్ కు సిద్ధమవ్వండి" అంటూ మేకర్స్ ఇచ్చిన వార్నింగ్ ఫ్యాన్స్ లో అంచనాలను పెంచేసింది. శర్వానంద్ కెరీర్ లోనే ఇదొక బెంచ్ మార్క్ సినిమాగా నిలిచే అవకాశం ఉంది. మొత్తానికి డిసెంబర్ 6న రావలసిన సినిమా వాయిదా పడినా, 3D మరియు 4DX రూపంలో రాబోతున్న ఈ గుడ్ న్యూస్ ఫ్యాన్స్ ను కూల్ చేసింది. కొత్త రిలీజ్ డేట్ ను త్వరలోనే అనౌన్స్ చేయనున్నారు. మరి ఈ లేటెస్ట్ టెక్నాలజీతో శర్వానంద్ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి రేస్ ని చూపిస్తాడో చూడాలి.

## డ్రాగన్ ఇంటర్నేషనల్ రిలీజ్!





సూపర్ స్టార్ మహేష్ హీరోగా నటిస్తోన్న వారణాసి గ్లోబల్ స్థాయిలో రిలీజ్ అవుతోన్న సంగతి తెలిసిందే 120 దేశాల్లో చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా రాజమౌళి రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. ఒక్క హిట్ తోనే మహేష్ ని ఇంటర్నేషనల్ స్టార్ ని చేయాలన్నది రాజమౌళి ప్లాన్. దీనిలో భాగంగానే పక్కా ప్రణాళికతో %వారణాసిని కనెక్ట్ చేసే ప్రయత్నంచేస్తున్నారు. రిలీజ్ అవుతున్న 120 దేశాలు లిస్ట్ బయటకు రావాల్సి ఉంది.

పాన్ ఇండియా సినిమాకు బాహుబలితో ఓ బాట వేసారని కొందరు భావిస్తుంటే? ఆ తర్వాత రిలీజ్ అయిన ఆర్ ఆర్ ఆర్‌తో ఏకంగా సిక్స్ లైన్ హేవేనే వేసారన్నది మరికొంత మంది అభిప్రాయం. ఇందులో ఆ మాటను బలంగా సమర్థించిన దర్శకుడు ప్రశాంత్ నీల్. తాను రాజమౌళినే స్ఫూర్తిగా సినిమాలు తీస్తున్నట్లు ఓ సందర్భంలో తెలిపారు. ఇప్పటి వరకూ నీల్ నుంచి రిలీజ్ అయిన కేజీఎఫ్, సలార్ రెండు పాన్ ఇండియాకే పరిమితమయ్యాయి. ఇతర దేశల్లో రిలీజ్ అయినా? అనుకున్నంతగా రెస్పాన్స్ రాలేదు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ తో తెరకెక్కిస్తోన్న డ్రాగన్ చిత్రాన్ని మాత్రం ప్రశాంత్ నీల్ కూడా అంతర్జాతీయంగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. భారత్, అమెరికా, చైనా, రష్యా, జపాన్ లాంటి దేశాలతో పాటు వీలైనన్ని దేశాల్లో డ్రాగన్ రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. తాను రాసుకున్న కథ యూనివర్సల్ గా కనెక్ట్ అవుతుందని భావించి ఈ ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రశాంత్ నీల్ కూడా తాను ఏ కథ రాసుకున్నా? ఆ కథకు ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తాడు. ప్రేక్షకుల్ని ఆ ప్రపం చంలోకి అంతే జీగా తీసుకెళ్లగల ప్రతిభావంతుడు. కేజీఎఫ్,సలార్ లు అలాంటి కాన్సెప్టులే. బ్యాక్ డ్రాప్ లు ఒకేలా అనిపించినా? కథని మాత్రం కొత్త కోణంలో నడిపించాడు. ఈ నేపథ్యంలో డ్రాగన్ కథ ఎలా ఉంటుంది? అన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కానీ హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ అవుతంది? అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ సినిమా కోసం తారక్ ప్రత్యేకంగా సన్నధమయ్యాడు.

లుక్ పరంగా చాలా మార్పులు తీసుకొచ్చాడు. మునుపటి కంటే బాగా స్లిమ్ లుక్ లోకి మారిపోయాడు. దీంతో ప్రతీ ఫ్రేమ్ లో తారక్ ఎంతగా హైలైట్ అవుతాడు? అన్నది అభిమానుల ఊహకే వదిలేయాలి. ప్రత్యేకించి తారక్ కు జపాన్ లో భారీ ఎత్తున అభిమానులున్న సంగతి తెలిసిందే. అక్కడ మాత్రం వీలైనన్ని థియేటర్లలో డ్రాగన్ రిలీజ్ కానుంది.

## బ్యాడ్మింటన్ కోర్టులో అషు రెడ్డి గ్లామర్ హీట్

సోషల్ మీడియా సెన్సేషన్గా, డబ్స్మాష్ వీడియోలతో పాపులర్ అయిన అషు రెడ్డి గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. జూనియర్ సమంతగా నెటిజన్ల మనసు గెలుచుకున్న ఈ బ్యూటీ, బిగ్ బాస్ షోతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. నిత్యం ఏదో ఒక గ్లామరస్ అప్డేట్తో ఇంటర్నెట్లో హల్చల్ చేయడం ఆమెకు అలవాటుగా మారింది. లేటెస్ట్ గా అషు రెడ్డి షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో సెగలు రేపుతున్నాయి. అమెరికాలోని ఫ్లోరిడాలో బ్యాడ్మింటన్ ఆడుతూ, ఆలివ్ గ్రీన్ కలర్ బ్యాక్లెస్ జంప్సూట్ ధరించి ఎంతో గ్లామరస్ గా దర్శనమిచ్చారు. చేతిలో రాకెట్ పట్టుకుని, వెనుక వైపు తిరిగి తన ఫిట్ బాడీని, స్టైలిష్ లుక్కు హైలెట్ చేస్తూ నెటిజన్లను ఆకట్టుకుంటున్నారు. ఆమె పెట్టిన ఆసక్తికరమైన క్యాప్షన్ లో ఆమెలోని మనోధైర్యాన్ని, ఫిట్నెస్ పట్ల ఉన్న శ్రద్ధను సూచిస్తోంది. 'చల్ మోహన్ రంగ' సినిమాతో వెండితెరకు పరిచయమైనా, ఆమెకు అసలైన గుర్తింపు తెచ్చిపెట్టింది మాత్రం 'బిగ్ బాస్' రియాలిటీ షోనే. హౌస్లో తన



ఆటతీరుతో, గ్లామర్తో, బోల్డ్నెస్తో ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నారు. అప్పటి నుంచి బుల్లితెరపై, వెండితెరపై వరుస అవకాశాలను అందుకుంటూ తనకంటూ ఓ ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. కేవలం గ్లామర్కే పరిమితం కాకుండా, రామ్ గోపాల్ వర్మతో చేసిన బోల్డ్ ఇంటర్వ్యూలతోనూ అషు రెడ్డి ఇంటర్నెట్ను షేక్ చేశారు. ప్రస్తుతం ఆమె ఎక్కువగా విదేశీ పర్యటనలతో ఎంజాయ్ చేస్తున్నారు. ఖరీదైన కార్లు, లగ్జరీ లైఫ్స్టైల్తో సోషల్ మీడియాలో ఎప్పుడూ ట్రెండింగ్లో ఉంటారు. నటిగా మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తూనే, డిజిటల్ ప్లాట్ఫామ్స్లో తన సత్తా చాటుతున్నారు. సినిమా అవకాశాలు పెద్దగా లేకపోయినప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం అషు రెడ్డి ఫాలోయింగ్ ఏమాత్రం తగ్గలేదు. ఇలాంటి గ్లామర్ ఫొటోషూట్లతో, ట్రెండీ రీల్స్తో తన ఫ్యాన్స్ను ఎప్పుడూ ఎంటర్టైన్ చేస్తూనే ఉంటారు. గ్లామర్ డోస్ పెంచుతూ, నెట్టింట తన క్రేజ్ను కాపాడుకోవడంలో అషు రెడ్డి ఎప్పుడూ ముందుంటారు. మరి అమ్మడు భవిష్యత్తులో ఏవైనా గ్లామరస్ ఛాన్సులు అందుకుంటుందో లేదో చూడాలి.

## సమంత.. ఫేవరెట్ టైమ్ ఏంటో తెలుసా?

స్టార్ హీరోయిన్ సమంత సోషల్ మీడియాలో ఫుల్ గా యాక్టివ్ గా ఉంటారన్న విషయం తెలిసిందే. ఎప్పటికప్పుడు కొత్త కొత్త పిక్స్ ను షేర్ చేస్తుంటారు. తన పర్సనల్ లైఫ్ కు సంబంధించిన అప్డేట్స్ కూడా ఇస్తుంటారు. అవి ఎప్పుడూ వైరల్ అవుతుంటాయి. ముఖ్యంగా ఇన్ స్టాగ్రామ్ స్టోరీస్.. నెట్టింట స్పెషల్ గా ఉండి ఆకట్టుకుంటాయి. తాజాగా తన ఇయర్ లో ఫేవరెట్ టీమ్ ఏంటో చెబుతూ పోస్ట్ చేశారు సమంత. అంతకుముందు ముంబైలోని తన ఇంటి మెయిన్ డోర్ పిక్ ను షేర్ చేశారు. డోర్ చుట్టూ స్పెషల్ డెకరేషన్ చేసి ఉంది. మరోనెల రోజుల్లో క్రిస్మస్ పండుగ రానుండగా.. ఇప్పుడే సామ్ ఆ ఫెస్టివల్ మోడ్ లోకి వెళ్లిపోయారు. తన ఇంటిని డెకరేట్ చేసుకున్నారు. ఇంటి మెయిన్ డోర్ కు ఓవైపు క్రిస్మస్ ట్రీ పార్ట్ ను అటాచ్ చేయగా.. మరోవైపు స్టైలిష్ "%బూావీ%"లోగో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. ఈ సంవత్సరం ఇలా అన్నట్లు క్యాప్షన్ ఇవ్వగా.. మరో పిక్ లో ఇంట్లో క్రిస్మస్ థీమ్ డెకరేషన్ చేసుకున్న పిక్ పోస్ట్ చేశారు. ఆ ఫోటోకు అదే తన ఫేవరెట్ టైమ్ అంటూ




రాసుకొచ్చారు సమంత. ప్రస్తుతం సమంత ఇన్ స్టా స్టోరీస్ కు సంబంధించిన స్క్రీన్ షాట్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అవి అందరినీ ఆకట్టుకుంటున్నాయి. దీంతో డెకరేషన్ అదిరిపోయిందని సామ్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అడ్వాన్స్ హ్యాపీ క్రిస్మస్ అంటూ విషెస్ చెబుతున్నారు. ఫుల్ గా సెలబ్రేట్ చేసుకోండని అంటున్నారు. అయితే సమంత.. పర్సనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలతో కొంతకాలంగా వార్తల్లో నిలుస్తున్నారు. గత కొంత కాలంగా బాలీవుడ్ డైరెక్టర్ రాజ్ నిడిమోరుతో ఆమె సన్నిహితంగా ఉన్నారని, వారిద్దరూ డేటింగ్ లో ఉంటున్నారని సోషల్ మీడియాలో రూమర్లు వినిపిస్తున్నాయి. కానీ ఇప్పటి వరకు ఎక్కడా సమంత రెస్పాండ్ అవ్వలేదు. కానీ రాజ్ నిడిమోరుతో కలిసి పార్టీలకు, సినిమా ఈవెంట్స్ కు సామ్ వెళ్లడంతో రిలేషన్ షిప్ రూమర్లకు మరింత బలం చేకూరుతుంది. వారిద్దరూ ఎక్కడ కనిపించినా అక్కడికి సంబంధించిన వీడియోలు, దిగిన ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి. రీసెంట్ గా దీపావళి పండుగ ఇద్దరూ కలిసి జరుపుకున్నారు. మరి రిలేషన్ షిప్ రూమర్స్ లో నిజమెంతో వారికే తెలియాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536